1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 12
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2020


ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ

UNESCO

21-2-2020



నల్లగొండ జిల్లా బడిపిల్లల కథలు
పుస్తక ముఖచిత్రం



తెలుగు, తెలుగేతర
గిరిజన తెగల
భాషా సాహిత్య
నిర్మాణ విశేషాలు



భూమిమీద అతిపెద్ద
హిందూ దేవాలయంగా
పేరుగాంచిన
'అంగ్‌కార్ వాట్
కాంబోడియా
జాతీయ పతాకంపై
నెలకొని ఉంది. వివరాలకు
'జగమునేలిన తెలుగు'
ధారావాహికను
నెలనెలా చదవండి

ఉద్యమాలతోనే అమ్మనుడుల సాధికారిత

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం చేయవలసిన పనుల స్పష్టీకరణ



భారత ఉపరాష్ట్రపతి గౌ॥ముప్పవరపు వెంకయ్యానాయుడుగారి చొరవతో ఇటీవల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు కేంద్రంగా పనిచేయడం సాగిస్తున్నదని చదువరులకు తెలిసిందే. జనవరి 20,21 తేదీలలో వెంకయ్యనాయుడుగారి నెల్లూరు పర్యటన సందర్భంగా తెలుగు పండితులు, ఉపాధ్యాయులు, రచయితలు ఆసక్తిగల తదితరులతో ఒక కార్యగోష్ఠిని కేంద్రం నిర్వహించింది. వందమందికి పైగా పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ కేంద్రం చేయవలసిన పనుల గురించి డైరెక్టర్ మునిరత్నం నాయుడుగారిని అడుగగా వారుపంపిన వివరాలను ఈ క్రింద ప్రచురిస్తున్నాము :

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి సంబంధించిన ప్రాజెక్టులను, కార్యక్రమాలను విధివిధానాలను భారతీయ భాషా సంస్థ రూపొందించాలని, అందులో బోధన, పరిశోధన, దృశ్యీకరణ (Documentation), పరివ్యాప్తి మొదలైన విషయాలను ఈ కేంద్రం ద్వారా చేపట్టాలని సూచించింది. అంతేకాకుండా పైన పేర్కొన్న కార్య క్రమాల అమలులో ఆయా విషయ నిపుణులతోనూ, రాష్ట్ర ప్రభుత్వాల తోనూ, కేంద్రప్రభుత్వంతోనూ, విదేశాల్లోని సంబంధిత వర్గాలతో సంప్రదింపులు కొనసాగించి తెలుగు భాషను అభివృద్ధి చేయడానికి ఈ కింది మార్గదర్శకాలను సూచించింది.

1. ప్రాచీన తెలుగు భాషకు అవసరమైన ఆధారాలను గుర్తించి, సేకరించడం. 2. ప్రాచీన తెలుగు భాషకు సంబంధించిన ఆధారాలను సేకరించి, వాటిని భద్రపరిచి, వాటి పరివ్యాప్తికి ఆయా రాష్ట్రాల్లోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ తగిన ప్రచారం చేయాలి. 3. ప్రాచీన తెలుగు భాషను ప్రోత్సహించడానికి భారతదేశం, విదేశాల్లోను ఆయా విషయా లపై పరిశోధన, దృశ్యీకరణ (Documentation) చేపట్టాలి. 4. తాళపత్ర గ్రంథాలను పరిరక్షించి, డిజిటలైజ్ చేయాలి. 5.ప్రాచీన తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలను ప్రచురించాలి. 6. ప్రాచీన తెలుగు భాషకు తమ రచనల ద్వారా విశేష కృషి చేసిన పండితులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నగదు పురస్కారాలతో సన్మానించాలి. 7. ప్రాచీన తెలుగు భాషకు తమ రచనలద్వారా విశిష్ట సేవలందించిన రచయితలు – వారి కావ్యాలపై దృశ్యీకరణలు రూపొందించాలి. 8. ప్రాచీన తెలుగు భాష, సాహిత్యం , చరిత్ర, లిపి, నాణేలు, పురాతత్వ శాస్త్రాలపై తులనాత్మక పరిశోధనలకు అవకాశాలు కల్పించాలి. 9. ప్రాచీన తెలుగుభాషకు లలితకళలు – శాస్త్రీయ సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం వంటి అంశాలతో ఉన్న సంబంధాలపై పరిశోధన చేయాలి. 10. ప్రాచీన తెలుగు భాషను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయాలి. 11. ప్రాచీన తెలుగు కావ్యాలను ఆంగ్లం, ఇతర భారతీయ భాషల్లోకి అనువదించాలి. అవసరమైతే ఎంపిక చేసిన యూరోపియన్ భాషల్లోకి కూడా అనువదించాలి. 12. ప్రాచీన తెలుగు భాష, సంస్కృతులను ప్రపంచ ప్రాచీన నాగరికతలతో ఉన్న సంబంధాలపై పరిశోధనలను ప్రోత్సహించి, వాటిని భద్రపరచాలి. 13. ద్రావిడ భాషా కుటుంబంతో తెలుగు భాష విడిపోయే నాటికి ఉన్న ప్రాచీన – తెలుగు భాషా రూపాలను పునర్నిర్మించి, పదనిధిని అభివృద్ధి చేసి, భద్రపరిచి, భావి పరిశోధనలకు అవకాశం కల్పించాలి. 14. భారతీయ విశ్వవిద్యాల యాల్లో ప్రాచీన తెలుగు పీఠాలను ఏర్పాటు చేయాలి. 15. ప్రాచీన భాషగా తెలుగును ప్రపంచ పటంలో చూపడానికి అవసరమైన అధ్యయనం, పరిశోధనలు చేపట్టాలి. 16. ప్రాచీన భారతీయ భాషల్లో జరిగిన పరిశోధనల్ని తెలుగు భాషలో జరిగిన పరిశోధనలను తులనాత్మక అధ్యయనం చేసి, ఆ సమాచారాన్ని సోదర భాషలతో సమన్వయించాలి.

పై మార్గదర్శకాలను ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అమలు చేయాలని ఆదేశించారు.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఫిబ్రవరి 2020

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

కార్టూన్లు	రేఖాచిత్రాలు	కంప్యూటరీకరణ
సరసి	పాపులూరి చిదంబరేశ్వరరావు	లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్ట్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో – చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు – 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ – 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**–1.

తెలుగుభాషోద్యమ పతాకాన్ని అన్ని సందర్భాల్లో, అన్నిచోట్లా ఎగురవేయండి



తెలుగు భాషోద్యమ పతాకం

2 పతాకాలు రు. 100/-
25 పతాకాలు రు. 1000/-

రవాణా ఖర్చును భరించి, కొరియర్‌లోగాని, పోస్టు పార్సిల్‌లో గాని పంపిస్తాము.

కావలసినవారు : సొమ్మును ఎం.ఒ. లేదా డి.డి.ని 'అమ్మనుడి' పేర పంపాలి.

వివరాలకు : **డా॥ సామల లక్ష్మణబాబు,**
ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

గమనిక

ఈ పతాకాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య రూపొందించి 15 ఏళ్లకుపైగా భాషోద్యమ సందర్భాల్లో వినియోగిస్తున్నది. అయితే దీనిని, సమాఖ్య మాత్రమే కాదు; తెలుగు భాషోద్యమ కారులందరూ – వారే సంస్థకు చెందినప్పటికీ దేశమంతటా ఎక్కడైనా ఉపయోగించవచ్చునని ప్రకటిస్తున్నది. తెలుగు భాషోద్యమ సంకేతంగా ఈ పతాకాన్ని ఉపయోగించండి.





అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని 2020 ఫిబ్రవరి 21న ఎల్లెడలా నిర్వహిద్దాం

తెలుగు భాషోద్యమ సమాఖ్య పిలుపు

'స్థానిక భాషలే అభివృద్ధికీ అభ్యుదయానికీ శాంతిభద్రతలకూ సయోధ్యకూ మూలం'

2020 సంవత్సరంలో యునెస్కో (ఐ.రా.స) అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న కార్య క్రమాలకు 'స్థానిక భాషలే అభివృద్ధికీ అభ్యు దయానికీ శాంతి భద్రతలకూ సయోధ్యకూ మూలం' అనే ప్రధానాంశాన్ని మకుటంగా యునెస్కో (ఐ.రా.స) మన ముందుంచింది.

ఈ సందర్భంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ సందేశం :

'భాష ప్రసార సాధనం మాత్రమే కాదు. ఇది మనలో మిగిలిన మానవతా విలు వలకూ, నమ్మకాలకూ ఇంకా మన ఉనికికి గుర్తింపు నిచ్చే వ్యవస్థ. భాష ద్వారానే మనం మన అనుభవాలను పంచుకుంటాం, అనూ చానంగా వస్తున్న సంప్రదాయాలను కింది తరాలకు అందిస్తాం, వేల యేండ్లుగా సంపా దించిన జ్ఞానాన్ని యువతరానికి ప్రసారం చేస్తాం. భాషావైవిధ్యం విశ్వ వ్యాప్తం గా ఉన్న మానవ జీవన శైలిలో ఉన్న అమిత వైవి ధ్యాన్ని ప్రతిబింబిస్తోంది'.

ప్రతిఏటా ఫిబ్రవరి 21 ను అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా జరుపుకోవాలని యునెస్కో (ఐరాస) పిలుపు ఇచ్చింది. ఆ పిలుపునందుకొని 2000 సం. నుండి ప్రపంచమంతటా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

2003లో అదే రోజున తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించి, ప్రతి ఏటా ఫిబ్రవరి 21న తెలుగు ప్రాంతాలన్నింటా యునెస్కో సందేశాన్ని ప్రచారం చేస్తూ, ఆ సందర్భంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్న సంగతి అందరికీ తెలిసిందే.

'మాతృభాష (అమ్మనుడి) లో చదువులు, ప్రజల భాషలో పరిపాలన' అనే ఆశయంతో అనేకమంది భాషోద్యమకారులు, విద్యా సంస్థలు, సంఘాలు, కృషి చేస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోని తెలుగు తావుల్లోనూ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకొందాం. దీనికి మరింత సరళమైన తెలుగుమాటగా – "ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ" అని పిలుచు కొందాం. ఇప్పటి నుండే ఈ మాటను విస్తారంగా ప్రచారంలోకి తెద్దాం.

తెలుగు రాష్ట్రాల్లో మాతృభాషల పరిరక్షణ విషయంలో ప్రభుత్వాల పరంగానూ, ప్రజల పట్టనితనం వల్లనూ తెలుగుభాష ఉనికి, భవిష్యత్తు గందరగోళంగా తయారైన పరిస్థితుల్లో మాతృభాషలను కాపాడుకోవలసిన అవసరాన్ని ప్రచారం చేద్దాం. సమస్యలను చర్చిద్దాం. కావలసిన సమాచారం, సహకారం, సూచనల కోసం, ఈ క్రిందివారిని సంప్రదించవచ్చు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ–520004.
9848016136 : డా॥ సామల రమేష్‌బాబు
93930 15584 : డా॥ వెన్నిసెట్టి సింగారావు

"చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు, శాస్త్రం మీదే కాక, చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది' – డి.ఎస్. కొఠారి

అధ్యక్షుడు బి.హనుమారెడ్డి హఠాన్మరణంతో విషాదంగా ముగిసిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం 9వ రాష్ట్రస్థాయి రచయితల మహాసభలు




వర్తమాన సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కవులు, రచయితలు తమ కలాలను పదునెక్కించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. జనవరి 17న ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో ప్రారంభమైన ప్రకాశం జిల్లా రచయితల సంఘం 9వ రాష్ట్రస్థాయి రచయితల మహాసభల ప్రారంభోత్సవ సభలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రరసం అధ్యక్షుడు బి.హనుమారెడ్డి అధ్యక్షత వహించారు.

అదే సభలో ప్రరసం నూతన అధ్యక్షుడుగా ప్రస్తుత ప్రధాన కార్యదర్శి పొన్నూరు వేంకట శ్రీనివాసులు పేరును స్వయంగా హనుమారెడ్డి ప్రకటించారు–తాను అధ్యక్షుడిగా, శ్రీనివాస్ కార్యదర్శిగా ఇంతకాలం కొనసాగామని, ఇకపై శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు.

18వ తేదీ ఉదయం జరిగిన సాహిత్య సభకు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, రచయిత ఎం.వి. రామిరెడ్డి 'తెలుగులో రైతు కవిత్వం' పై ప్రసంగించారు. 'తెలుగు కథలో సాంఘిక జీవనం' అనే అంశంపై ప్రముఖ కథారచయిత, విమర్శకులు విహారి ప్రసంగించారు. సాయంత్రం జరిగిన సాహిత్య సభలో ఆచార్య అయ్యగారి సీతారత్నం 'పోతన కవిత్వంలో స్త్రీ పాత్రలు', ఆచార్య మేడిపల్లి రవికుమార్ 'అభ్యుదయ కవిత్వంలో అస్తిత్వం' అనే అంశంపై ప్రసంగించి కవులు, రచయితలలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.

19వ తేదీ ఉదయం మహాసభల్లో విషాదం ఆవరించింది – ప్రరసం అధ్యక్షుడు బి.హనుమారెడ్డిగారికి తెల్లవారు ఝామున గుండెపోటు రావడంతో చికిత్సకోసం హాస్పిటల్‌లో చేర్చడం, ఆయన ఉదయం 8.30 ని॥లకు మరణించడంతో ఉదయం డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరగవలసిన 3వ సాహిత్య సభ హనుమారెడ్డి సంతాప సభలా మారింది. డా॥ సామల రమేష్‌బాబుతో పాటు డా॥ శిఖామణి, డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డా॥ చిల్లర భవానీదేవి, ఇడమకంటి లక్ష్మీరెడ్డి, అన్న నల్లూరి వెంకటేశ్వర్లు, పాటిబండ్ల ఆనందరావు, మాజీ శాసనసభ సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ప్రరసం నూతన అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, కోశాధికారి మత్తుపు కొండారెడ్డి, కార్యవర్గ సభ్యులు – హనుమారెడ్డిగారికి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులుగా సభలో పాల్గొంటున్న 500 మంది కవులు, రచయితలు ఊరేగింపుగా వెళ్లి హనుమారెడ్డి భౌతిక కాయాన్ని దర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.



క్రిందటిరోజు స్వయంగా ఫోన్ చేసి పలుకరించి, నా ప్రయాణాన్ని ఖాయపరచుకొని, రైల్వేస్టేషన్‌కు కారును పంపించిన మిత్రుడు హనుమారెడ్డిగారు, నేను ఒంగోలులో లాడ్జిలో దిగిన సమయంలోనే శాశ్వతంగా కన్నుమూశారట. నేనూ, మిత్రులూ సిద్ధమై సభకు బయల్దేరే సమయానికి ఈ వార్త అందింది. నేరుగా వారింటికి వెళ్లి ప్రాణం లేకుండా పరుండి ఉన్న ఆప్తుడిని చూచి చలించిపోయాను. ఇంతకంటె నాకేం శిక్షను విధించగలరు మిత్రమా?! మీ తోడు దూరమైన నాకు తెలుగు భాషోద్యమంలో ముందుకు సాగడం – కీలక నిర్ణయాల సందర్భాల్లో ఎంత కష్టమో మీకు తెలుసు. అంత తొందరపడాలా మిత్రమా....

మిమ్మల్ని మరువలేని – మీ   – సామల రమేష్‌బాబు

సంపుటి : 5 సంచిక : 12
అమ్మనుడి
ఫిబ్రవరి 2020

సంపాదకీయం

ఉద్యమాలతోనే అమ్మనుడుల సాధికారిత

మళ్లీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఎల్లనాడుల అమ్మనుడుల పండుగదినం) వచ్చేస్తున్నది. 1952లో తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీ భాషీయులు తమపై పెత్తనాన్ని చెలాయిస్తున్న పశ్చిమ పాకిస్తాన్ పాలకులను 'మా భాషలోనే మా బ్రతుకులు వికసించాలనీ, పరాయి భాషీయులు తమ మతస్తులైనా వారి పాలనను సహించబోమనీ' ప్రకటించి, వీధులలోకి వచ్చి నినదించిన ఫలితంగా కాల్పులకు గురై ప్రాణాలను కోల్పోయిన రోజు అది. తర్వాత 20 ఏళ్ళకు ఆ ఉద్యమం పరాకాష్ఠకు చేరుకొని స్వతంత్ర ప్రకటనకు దారితీసి, స్వతంత్ర దేశంగా 'బాంగ్లాదేశ్' ఏర్పడింది. ఇప్పుడా దేశంలో కూడా మతతత్వం ప్రబలి, ఇతర మతాల పౌరులకు భద్రతలేని స్థితి ఏర్పడుతున్న సంగతిని అలా ఉంచండి. అది వేరే విషయం. తమ మాతృభాషను మాత్రం నాటికీ నేటికీ వారు విస్మరించలేదు. మతానికీ, భాషకూ సంబంధం లేదని, బంగ్లాదేశ్ ఆచరణలో చూపించింది. ఇది అత్యంత సహజమైన విషయం. ప్రపంచంలోని ఎన్నో దేశాల, జాతుల, భాషల పరిణామాల్ని గమనిస్తే, చేతివేళ్లపై లెక్కించదగినన్ని మతాలను, రెండు వందలకు మించని దేశాలను, ఏడు వేలకు పైగా ఉన్న భాషలను లెక్కలోకి తీసుకోవాలి – ఇంతటి వైవిధ్యాన్ని మనం గుర్తించాలి. కనుక ఎక్కడ ఎటువంటి ఆధిపత్య భావజాల విస్తరణ, అణచివేత ప్రయత్నం జరిగినా సంఘర్షణ తప్పదు. కనుకనే భాషలకు – మతాలకు, మతాలకు – దేశాలకు, దేశాలకు – భాషలకు ఏర్పడే సంఘర్షణలేవైనా జాతుల పోరాటాలుగా విస్తరిస్తాయి. ఈ సంఘర్షణలను, పోరాటాలను నివారించడం కోసం అన్ని భాషల సమానత్వాన్ని మనం గుర్తించాలి. ఎక్కడా ఏ రూపంలోనూ ఎటువంటి ఆధిక్యతాభావమూ చోటు చేసుకోకూడదు. చిన్నచిన్న సంఘటనలైనా సమాజ శాంతిని, ప్రగతిని దెబ్బతీస్తాయి.

దేశంలోని వారందరూ ఒకటే జాతివారమని అంటూనే కులాల, మతాల, భాషల ఆధిపత్య భావజాల ప్రదర్శన నిరంతరం జరుగుతూనే ఉంది. జాతి, మతం అనే మాటలు ఎక్కువగా దుర్వినియోగమవుతున్నాయి. సహజంగా జాతి అంటే ఒక భాషాజాతి అని అర్థం. ఒకే ప్రాంతంలో విభిన్న భాషల వారు కలిసిమెలిసి బ్రతుకుతున్నప్పుడు వారంతా ఫలానా దేశీయులమనే ఐక్యతా భావాన్ని కలిగి వుంటారు. ఈ సందర్భంలో కూడా జాతి అనే మాట వినియోగంలో ఉండవచ్చు. భారతజాతి అనే మాటనే తీసుకొందాం. ఒక భౌగోళిక జాతిగా, అనంతమైన చరిత్ర కలిగి వున్న ఈ దేశంలో చరిత్రగతిలో ఎన్ని మానవ స్రవంతులు వచ్చి చేరినా, విస్తృతంగా ఈ ప్రజలందరినీ కలిపి భారతజాతి అని అనడం వాడుకలో ఉంది. అంతేకాదు, ఉత్తరభారతంలోనూ, తమిళనాడు వంటి చోటుల్లోనూ 'జాతి' కులాన్ని సూచించేమాట! జాతి అనే మాట ఇంత వైవిధ్యంతో వాడుకలో ఉన్నప్పుడు మనం దీన్ని వినియోగించేటప్పుడూ, విమర్శించేటప్పుడూ కొంచెం జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంటుంది. తెలుగుజాతి అనే పదానికి స్పష్టమైన అర్థం 'తెలుగు భాషాజాతి' అని. ఇది భారతదేశంలో అంతర్భాగం. తెలుగుభాష పుట్టుక, వికసించడం – అంతా ఇక్కడి జనవాహినిలోనే. అలాగే ఇతర దేశీయ భాషలూనూ.

ప్రపంచంలోని జనభాషలన్నిటిలో ఎక్కువ భాషలున్నది మనదేశంలోనే. వీటిని మాట్లాడేవారి జన సంఖ్యను బట్టి కొన్ని పెద్దవీ, అనేకం చిన్న చిన్నవీ ఉండవచ్చు. 22 భాషల్ని మన రాజ్యాంగం అధికారభాషలుగా గుర్తించింది. ఇంకా కొన్ని భాషలు గుర్తింపుకోసం పోరాడుతున్నాయి. రాజ్యాంగంలో గుర్తించబడిన భాషలన్నిటినీ జాతీయ భాషలుగా గుర్తించాలనే కోరిక బలంగా ఉంది. అయితే వీటి అభివృద్ధికి కేంద్రం ఎంత సహాయపడినా, ఆ భాషా జాతీయులు, రాష్ట్రాల ప్రభుత్వాలు తమ భాషలను ఆధునిక అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి పరచుకోవడం, వినియోగించడంపైనే వాటి వికాసం ఆధారపడి ఉంటుంది. అంతేగాదు, ఆధునిక సాంకేతికతను పూర్తిగా

వినియోగించుకొనే భాషలు మాత్రమే భాషల పోటీలో ముందడుగు వేయగలుగుతాయి.

. . .

అమ్మనుడుల వికాసంతోనే ఆయా భాషాజాతుల వికాసం ఉంటుంది. వికాసం అంతా వినియోగంపైనే ఆధారపడి వుంటుందని పదేపదే చెప్పుకోనక్కర లేదు. ఈ సత్యాన్ని గుర్తించక, తమ భాషను అన్ని విధాలా వినియోగించుకోవడం మాని, బానిసత్వ భావజాలంతో, ఆత్మ విస్మృతితో వ్యవహరిస్తున్న ప్రభుత్వాలు తమకున్న ప్రత్యేక రాజకీయ లక్ష్యాలకోసం, ప్రజల్ని మోసం చేయడానికే పూనుకొంటున్నాయి. ఇటువంటి ధోరణిలో ఉన్న ప్రభుత్వాల్లో మన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మొదటి స్థానంలో ఉన్నాయి. వాటిలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పట్టుదలగా ముందుకు సాగుతున్నదనడంలో సందేహమే లేదు. ఈ సంగతి ఇప్పుడిప్పుడే ప్రజలకు కూడా అర్థమవుతున్నది. ఈ విషయంలో జాతి ఉనికికీ, అభివృద్ధికీ, భవితకూ గొయ్యి తవ్వుతున్న మన రాష్ట్ర పాలకుల్లో గత ప్రభుత్వ నేతలు వెన్నుపోటు పొడిస్తే, నేటి పాలకులు ఎదురుపోటు పొడుస్తున్నారు. శాసనసభ చర్చల్లోనే మాజీ ముఖ్యమంత్రి, నేటి ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాలను, పరస్పర ఆరోపణలను గమనిస్తే ఆంగ్లసేవలో వారెంత పోటాపోటీగా పునీతులగుతున్నదీ అర్థం చేసుకోవచ్చు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేసి, పూర్తిగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడంపై ప్రజాహిత వ్యాజ్యాల విచారణ సందర్భంగా న్యాయమూర్తుల వ్యాఖ్యలను పరిశీలిస్తే మనకు పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.

కోర్టు తీర్పు ఫిబ్రవరి నెలలో – బహుశా అమ్మనుడుల పండుగకు లోపే వెలువడవచ్చునని అనుకొందాం. ఆ తీర్పు ఎలా వచ్చినా, మన రాజకీయ నేతలు బుద్ధి తెచ్చుకొని ప్రజా శ్రేయస్సును, జాతి శ్రేయస్సునూ తలపెడతారని మనం ఆశలు పెట్టుకోనక్కరలేదు. మనం గతంలోనే ప్రస్తావించుకొన్నట్లు – అమ్మ నుడులలో విద్యా బోధన, ప్రజలభాషల్లో పరిపాలన అనే అంశాలపై జాతీయ విధానాన్ని రూపొందించి అమలుకు తెచ్చే విధంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఉద్యమాలు చేయాలి. ఈ చైతన్యాన్ని ప్రజల్లో నిర్మించేందుకు సమాలోచనలు సాగాలి. అప్పుడే – ముఖ్యంగా మధ్య తరగతి, వెనుకబడిన వర్గాల ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఎక్కువ తక్కువ భావనలకు తావిచ్చే విద్యకు స్వస్తిచెప్పి అందరికీ సమానమైన విద్యను అందించాలి. పాఠశాల విద్య అంతా – ఉచితంగా అందరికీ అందించేందుకు నిర్ణయాలు జరగాలి. ఉద్యోగ, ఉపాధి కల్పనల్లో కూడా మాతృభాషల్లో చదువుల అవసరం పూర్తిగా ఉండాలి. భాషల్ని సమకాలీన అవసరాలకు తగ్గట్లు అభివృద్ధి చేసేందుకు కూడా చురుగ్గా పనిసాగాలి. సామాన్య ప్రజలు ప్రభుత్వాలను, వాటి నేతలను సమర్థంగా ఎదుర్కోవడానికి మాతృభాషల సాధికారిత తప్పనిసరి.

. . .

ఈసారి రానున్న 'ఎల్లనాడుల (అంతర్జాతీయ) అమ్మనుడుల పండుగ (మాతృభాషా దినోత్సవం)' మన ముందు కొత్త సవాళ్లను, ఆశలను ఉంచుతున్నది. దేశంలోని ప్రజాభాషలన్నిటి ముందు ఈ పరిస్థితి ఉంది. అయితే – ప్రత్యేకించి తెలుగు భాషాజాతీయులందరి ముందు ఇది అత్యవసరంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే – భాషా రాష్ట్రాల మనుగడను, ప్రజాభాషల అవసరాన్ని మన బిడ్డలే ప్రశ్నించే పరిస్థితి వస్తుంది. 'సరళీకరణ, ప్రయివేటీకరణ, అంతర్జాతీయకరణ' సిద్ధాంతాన్ని ఎదుర్కొని – స్థానిక, దేశీయ శ్రేయస్సు తర్వాతే ప్రపంచ శ్రేయస్సు అనీ, ప్రజల భాషల గౌరవంతోనే ప్రభుత్వాల అస్తిత్వం అనీ, మానవుణ్ణి గుర్తించడంతోనే సమాజ ప్రగతీ, దేశ ప్రగతీ, ప్రపంచ శాంతి నెలకొంటాయని అందరికీ తెలియాలి. ముఖ్యంగా పాలక వర్గాలకు అర్థంకావాలి.

అమ్మనుడుల భద్రతకూ, వికాసానికీ ఉద్యమాలే ఆధారం. ప్రజల భాషలను గుర్తించడం, గౌరవించడం అంటే మనిషిని గుర్తించడం. సొంత భాషతోనే కదా మానవ వికాసం! 'నన్ను నాకు యజమానిగా నిలబెట్టేదే నా భాష' అని కవి నినదిస్తున్నదందుకే.

తేదీ : 30-1-2020

సామల రమేష్‌బాబు

రమేష్ పట్నాయక్
9440980396

ప్రైవేటు రంగంలో కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలి!

గత మూడు నెలల కాలంలో పాఠశాలలలో బోధనా మాధ్యమంపై చాలా పరిణామాలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వం మండల మరియు జిల్లా పరిషత్ యాజమాన్యాలలో మరియు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న పాఠశాలలలో వచ్చే విద్యాసంవత్సరం నుండి మాతృభాషా మాధ్యమాన్ని పూర్తిగా తొలగిస్తూ ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ గత సంవత్సరం నవంబర్ 5వ తేదీన 'ప్రభుత్వ ఆదేశం' 81ని అలాగే అనంతరం చిన్న సవరణతో దాని స్థానంలో జి.ఒ 85ని తీసుకురావడంతో రాష్ట్రంలో పెద్ద చర్చ ప్రారంభం అయింది. ఇప్పుడు జి.ఒ 85 కు వ్యతిరేకంగా ఉద్యమాలు కూడా నడుస్తున్నాయి. ఆంగ్ల మాధ్యమం విషయంలో జి.ఒ ఇవ్వడమే కాక ఒక చట్టాన్ని కూడా తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. అధికార పార్టీకి ఉన్న సంఖ్యాబలం వలన శాసన సభలో సంబంధిత బిల్లు ఆమోదం పొందినా వామపక్ష యం.ఎల్.సిలు మరియు ప్రతిపక్ష యం.యల్.సిలు అధికంగా ఉన్న శాసన మండలి బిల్లును వెనక్కి తిప్పి పంపింది. అయితే. శాసన మండలి సవరణలను తిరస్కరిస్తూ శాసన సభ మరల బిల్లును ఆమోదించింది. ఏదేమైనా బిల్లు ఇంకా చట్టం కాలేదు.

ప్రభుత్వ జిత్తులు

మరొకవైపు జి.ఒ 85కి వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం నడుస్తున్నది. ఆంగ్ల మాధ్యమాన్ని బలవంతంగా రుద్దుతున్న జి.ఒ 85ని కోర్టు రద్దుచేయవచ్చునే ఆందోళన ప్రభుత్వానికి ఏర్పడింది. అందుకే ఆదరాబాదరాగా మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశాన్ని తల్లిదండ్రులకు ఇస్తూ వారిని మాధ్యమాన్ని ఎంచుకోమని కోరుతూ జనవరి 21న తమ ఎంపికను ఒక దరఖాస్తు ద్వారా తెలియజేయాలని ప్రభుత్వం ఒక మెమో విడుదల చేసింది. అయితే, ప్రభుత్వం రూపొందించిన నమూనా దరఖాస్తు ఆంగ్ల మాధ్యమం వైపు ఒరిగి ఉంది. దరఖాస్తు నమూనా రూపొందించడంలో ప్రభుత్వం చూపిన జిత్తులమారి తనాన్ని ప్రక్కన పెడితే అసలు ఆవిధంగా బాలల తరపున మాధ్యమాన్ని నిర్ణయించే అధికారం ఇటు **ప్రభుత్వానికి గాని అటు తల్లిదండ్రులకు గాని లేదు అనేది ప్రధాన విషయం. బాలల తరపున రాజ్యాంగమే ఈ విషయంలో నిర్ణయం తీసుకుంది. ఎలిమెంటరీ విద్యను మాతృభాషలో పొందడం బాలల హక్కు అని, అందించడం ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగం 351 ఎ అధికరణం చెప్తున్నది. తల్లి మరియు తండ్రి వేరువేరు భాషలకు చెందిన వారైనప్పుడు వారిలో ఎవరి భాషను వారి బాలలకు మాతృభాషగా పరిగణించాలో నిర్ణయించే పరిమిత అవకాశం మాత్రమే రాజ్యాంగం బాలల తల్లిదండ్రులకు కల్పించింది. మాతృభాషను ప్రక్కన పెట్టి బాలలకు ఆంగ్ల మాధ్యమాన్ని ఎంపికచేసే అవకాశం రాజ్యాంగం తల్లిదండ్రులకు కల్పించలేదు.** 2009లో వచ్చిన విద్యా హక్కు చట్టం కూడా 8వ తరగతి వరకు బాలలకు మాతృభాషలోనే విద్య అందించాలని నిర్దేశిస్తున్నది. విద్యాహక్కు చట్టం కూడా బాలల తరపున మాధ్యమాన్ని ఎంపికచేసే అధికారం ప్రభుత్వానికి గాని లేదా అటువంటి అవకాశం తల్లిదండ్రులకుగాని ఇవ్వలేదు. అయినా **రాష్ట్ర ప్రభుత్వం ఇటు రాజ్యాంగాన్ని గాని అటు విద్యాహక్కు చట్టాన్నిగాని పట్టించుకోకుండా ఆంగ్ల మాధ్యమ విధానాన్ని బలవంతంగా అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది.**

ఇక కోర్టు ముందున్న వ్యాజ్యం చాలా గందరగోళమైనది. ఈ వ్యాజ్యం మాతృభాషలో విద్యను పొందడం బాలల హక్కు అని దానిని ప్రభుత్వం అమలు చేయాలని కోరడం లేదు. బాలల తరపున మాధ్యమాన్ని నిర్దేశించే అవకాశం బాలల తల్లిదండ్రులకు ఉండాలని మాత్రమే జి.ఒ 85కి వ్యతిరేకంగా వ్యాజ్యం వేసినవారు కోర్టును కోరుతున్నారు. కోర్టు కేసును కొట్టివేస్తే జి.ఒ 85 అమలు అవుతుంది. కోర్టు జి.ఒ 85ను కొట్టివేసినా బాలల తరపున మాధ్యమాన్ని నిర్ణయించే అవకాశం తల్లిదండ్రులకు బదలాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రెండు సందర్భాలలో కూడా అది రాజ్యాంగానికి, విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగానే ఉంటుంది. కోర్టు సహజంగా వ్యాజ్యం పరిమితులలోనే తీర్పు ఇస్తుంది. ఈ తీర్పులో కోర్టు మహా అయితే జి.ఒ 85ను రద్దుచేస్తుంది కాని విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయమని నిర్దేశించదు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు అత్యధిక సంఖ్యలో ఆంగ్ల మాధ్యమాన్నే కోరుకుంటారనడంలో సందేహం లేదు. **హైకోర్టు సదరు జి.ఒ ని కొట్టివేసినా తల్లి దండ్రుల ఎంపికపై ఆధారపడి మాధ్యమ విషయాన్ని పాఠశాలల వారిగా ప్రభుత్వం అమలు చేయగలదు. ప్రభుత్వం తీసుకు వచ్చిన బిల్లు చట్టం అయినా కాకపోయినా, ప్రభుత్వం ఇచ్చిన జి.ఒ కొట్టి వేయబడినా ప్రభుత్వ విధానం అమలు జరిగే దురదృష్ట పరిస్థితి ఉంది. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలో విద్యాహక్కు చట్టం ప్రకారం మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయమని ఇంతవరకు కోర్టులో ఏ వ్యాజ్యం దాఖలు కాలేదు.**

అత్యధిక ప్రజలు ఆంగ్ల మాధ్యమాన్ని కోరుకోవడమే అసలు సమస్య. ప్రజలను ఆ విధంగా తయారు చేయడంలో ప్రైవేటు యాజమాన్యాలు మరియు అధికార పార్టీలు విజయవంతమైనాయి. కార్పోరేటు సంస్థలు ఆంగ్ల మాధ్యమాన్ని ఒక అదనపు ఆకర్షణగా

మధ్యతరగతి ముందు పెడితే అధికార పార్టీలు ఆంగ్ల మాధ్యమాన్ని బడుగు బలహీన వర్గాల ఓటర్లకు ఎరవేయడానికి ఉపయోగిస్తున్నాయి. గుర్తించవలసిన విషయం ఏమంటే, ప్రైవేటు పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమం ఉన్నన్నాళ్ళు ప్రభుత్వ పాఠశాలలపై ఆంగ్ల మాధ్యమ కత్తి వేలాడుతూనే ఉంటుంది. మధ్య తరగతి ఏది నాగరికత అంటుందో దానినే బడుగు మరియు బలహీన వర్గాలవారు నాగరికతగా భావిస్తారు. మాధ్యమం విషయంలో మధ్యతరగతి అవగాహన మారనిదే బడుగు, బలహీన వర్గాల అవగాహన మారదు. అవగాహనా రాహిత్యం వలన ప్రజలు, దురుద్దేశాలతో పాలక శక్తులు ఒకే వైపు నిలబడిన దురదృష్టకర సందర్భం ఇదని ముందుగానే చెప్పుకున్నాం.

ఆంగ్ల మాధ్యమానికి అనుకూలంగా చేయబడుతున్న వాదనలన్నింటినీ నేను ఇక్కడ పేర్కొనడం లేదు. ఒక్క విషయం మాత్రం ప్రస్తావిస్తాను. ఉన్నత విద్యలకు, ఉద్యోగాలకు ఆంగ్లం అవసరమేకదా అనే వాదన ఉంది. ఇది కొంతవరకు సహేతుకమైనదే. అయితే ఆంగ్ల మాధ్యమానికి మరియు ఆంగ్లం నేర్చుకోవడానికి ఎటువంటి సంబంధం లేదు. ప్రైవేటు రంగంలో లేదా ప్రభుత్వం రంగంలో బాలలకు ఆంగ్లాన్ని నేర్పడానికి ఆంగ్లాన్ని ఒక పాఠ్య విషయంగా బోధిస్తే చాలు. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలో ఒకటవ తరగతి నుంచి ఆంగ్లం ఒక పాఠ్య విషయంగా ఉంది. కాని ప్రత్యేక అర్హతలు మరియు శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు ఎక్కడా లేరు. అందుకే రాష్ట్రంలో బాలలకు వారు ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఏ పాఠశాలలో చదివినా ఆంగ్లభాష రావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యాహక్కు చట్టానికి అదనంగా ఆంగ్లభాషా బోధనకు ఒక ఉపాధ్యాయ పోస్టు ఇవ్వాలన్న విద్యారంగ ఉద్యమాల సూచనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిజానికి బాలలకు ఆంగ్లం నేర్పాలనే పట్టుదల ప్రభుత్వానికి ఉందని విశ్వసించడం కష్టం.

2019లో కస్తూరి రంగన్ కమిటీ ఇచ్చిన విద్యా నివేదికలో (జాతీయ విద్యావిధానం 2019 ముసాయిదా) ఎనిమిదవ తరగతి వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలలో మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయమని సిఫారసు చేసింది. అంతేకాదు 12వ తరగతి వరకు కూడా మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని, అయితే విజ్ఞాన శాస్త్రాలలో సాంకేతిక పదాలను సమాంతరంగా ఆంగ్లంలో కూడా 9వ తరగతి నుంచి పరిచయం చేయాలని, ఉన్నత విద్యలకు వెళ్ళినప్పుడు ఆంగ్ల మాధ్యమంలోనికి వెళ్ళవలసి వస్తే విద్యార్థికి ఎటువంటి ఇబ్బంది ఉండదని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదిక ఆధారంగా ప్రైవేటు పాఠశాలలో కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయవచ్చు. ఇక ఉద్యోగావకాశాలకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వగలిగే లక్షలాది ఉద్యోగాలకు, కల్పించగలిగే పదుల లక్షల ఉపాధులకు ఆంగ్లంతో సంబంధం లేదు. ఎ.పి.యస్.ఇ.బి మరియు ఎ.పి.యస్.ఆర్.టి.సి వంటి సంస్థలలో ఉద్యోగాలకు, అత్యధిక ప్రభుత్వ పాఠశాలలలో ఉద్యోగాలకు, పోలీసు శాఖలో ఉద్యోగాలకు ఆంగ్లంతో పనిలేదు. బ్యాంకు ఉద్యోగాలకు కూడా మాతృభాషా మాధ్యమంలో చదువు సరిపోవడమే కాదు అవసరం కూడా. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా తెలుగులో పోటీ పరీక్షలు వ్రాయవచ్చు. ఇక మిగిలినవి ఐ.ఐ.టిలు మరియు అమెరికా ఉద్యోగాలు. ఐ.ఐ.టిలలో సంవత్సరానికి 10 వేల సీట్లు ఉంటాయి. ప్రస్తుతానికి రాష్ట్రాలవారిగా కోటా లేదు కాబట్టి ఉభయ తెలుగు రాష్ట్రాలకు కలిపి సుమారు రెండువేల సీట్లు వస్తున్నాయి. కోటాలు విధిస్తే తెలుగు రాష్ట్రాలకు వచ్చేవి గరిష్టంగా వెయ్యి సీట్లు మాత్రమే. అమెరికా ఉద్యోగాలకు కావలసింది ఆరు మాసాల ఆంగ్ల వాక్చాతుర్య శిక్షణ మాత్రమే. అమెరికా లేదా పాశ్చాత్య దేశాలకు వెళ్ళవలసిన వారు అప్పటికే యల్.కెజి నుండి ఇంజనీరింగు వరకు సుమారు ఇరవై సంవత్సరాలు ఆంగ్ల మాధ్యమంలో చదివినా జి.ఆర్.ఇ కి ఆరు మాసాలు శిక్షణ తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఉన్నత విద్యలకు మరియు రాష్ట్రం బయట లేదా దేశం బయట ఉద్యోగాలకు పాఠశాలలో ఆంగ్ల మాధ్యమానికి ఎటువంటి సంబంధం ఉన్నట్లు కనిపించదు. ఆంగ్లాన్ని ఒక పాఠ్యాంశంగా నేర్చుకోవడం మాత్రం ఎంతైనా అవసరం. వ్యవహారిక భాషకే కాక ఆంగ్ల సాహిత్యంతో పరిచయం పెంచుకుంటే ఇంకా గొప్ప విషయం.

మన సమస్య తెలుగు భాషను రక్షించే విషయం మాత్రమే కాదు. అంతకన్నా ప్రధానంగా ఇది బాలలకు మాతృభాషలో చదువుకునే హక్కును, కష్టపడి కాకుండా ఇష్టపడి, సంతోషంగా, ఉత్సాహంగా, సృజనాత్మకంగా విద్యా విజ్ఞానాలను పొందే హక్కుకు సంబంధించిన విషయం. ఆంగ్ల మాధ్యమం విద్యార్థిని కుటుంబం నుండి సమాజం నుండి మాత్రమే కాదు తననుండి తనను కూడా పరాయీకరణ చేస్తుంది. ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థుల ఆత్మహత్యలు ఈ పరాయీకరణకు పరాకాష్ట కాక మరేమిటి? మాతృభాషా మాధ్యమం గురించి ఇప్పుడు ఏ వాదనా క్రొత్తగా పెట్టవలసిన అవసరం లేదు. కొఠారీ కమీషన్ మాతృభాషా మాధ్యమాన్నే సిఫారసు చేసింది. 1968 జాతీయ విద్యావిధానం, 1986 జాతీయ విద్యావిధానం, ప్రస్తుత ముసాయిదా విద్యావిధానం మాతృభాషా మాధ్యమాన్నే సిఫారసు చేసాయి. భారత రాజ్యాంగం అధికరణం 351(ఎ)లో మాతృభాషలో బోధన ప్రభుత్వాల విధి అని విద్యార్థుల హక్కు అని పేర్కొనబడింది. యునెస్కో మాతృభాషా మాధ్యమాన్నే గట్టిగా సిఫారసు చేసింది. మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేసిన దేశాలే – విద్యారంగంలో అలాగే ఆర్థిక రంగంలో అభివృద్ధి చెందుతున్నాయని నివేదికలు చెప్తున్నాయి.

ప్రైవేటులో ఆంగ్ల మాధ్యమం ప్రభుత్వ రంగంలో మాతృభాషా మాధ్యమం ఒక వైరుధ్యం, ఇది దీర్ఘకాలం కొనసాగడం సాధ్యం కాదు. ప్రభుత్వరంగంలో కూడా ఆంగ్ల మాధ్యమం అమలు కొరకు రాష్ట్ర ప్రభుత్వం దాడిపూరితంగా వ్యవహరిస్తున్నది. ప్రజాతంత్ర ఉద్యమం రెండు రంగాలలో మాతృభాషా మాధ్యమం కొరకు పోరాడాలి. మధ్యేయ మార్గం లేని స్థితికి పరిస్థితి చేరుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు అనుసరించిన విధానాలను పరిశీలిద్దాం. పది సంవత్సరాల క్రితం ప్రైవేటు పాఠశాలలో మొత్తం ఆంగ్ల మాధ్యమం ఉండింది మరియు ప్రభుత్వ పాఠశాలలో మొత్తం మాతృభాషా మాధ్యమం ఉండింది. ఆనాడు రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ముందు రెండు మార్గాలు ఉండినాయి. ప్రైవేటు పాఠశాలలో కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేసి ఒక శాస్త్రీయ విధానానికి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్య

'ఇంగ్లీష్ మీడియం' లో నిర్బంధించలేం



అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకూ నిర్బంధంగా ఇంగ్లీష్ మీడియాన్ని అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అమలుపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇంగ్లీష్ మీడియంలోనే చదువుకోవాలని విద్యార్థులను నిర్బంధించలేమని, అలా చేయడమంటే సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరించడమేనని స్పష్టం చేసింది. ఇంగ్లీష్ మీడియం అమలుకోసం పాఠ్యపుస్తకాల ముద్రణ, శిక్షణా తరగతుల నిర్వహణకు పాల్పడే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ వ్యవహారంలో అధికారులు ముందడుగు వేస్తే...ఆ ఖర్చును వారి నుంచే రాబడతామని పునరుద్ఘాటించింది. అవసరమైతే ఏసీబీ, సిబీఐ విచారణకు ఆదేశించి డబ్బును వెనక్కి రప్పిస్తామని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పాఠశాల విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్‌లను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయని పక్షంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి స్వయంగా హాజరు కావాలని పేర్కొంది. అంతేగాక ఇచ్చిన గడువులోగా కౌంటర్ దాఖలు చేయలేకపోతే ఇంగ్లీష్ మీడియం అమలుపై స్టే ఉత్తర్వులు ఇచ్చేందుకూ వెనుకాడబోమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎస్. జయసూర్యల ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 6 వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాంభొట్ల శ్రీనివాస్ సుధీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై సోమవారం మరోమారు ధర్మాసనం ముందు విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్. శ్రీరాం వాదనలు వినిపిస్తూ, విద్యార్థులు మాతృభాషలో చదువుకునేందుకు తాము అడ్డు చెప్పడం లేదని, ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు పది రోజుల సమయం కావాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున సహాయ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్ వాదనలు వినిపిస్తూ... విద్యాహక్కు చట్ట ప్రకారం కనీసం 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ...ఇంగ్లీషు మీడియంలోనే విద్యాభ్యాసం ఉండాలని విద్యార్థులను బలవంతపెట్టలేమని పేర్కొంది. పిటిషనర్ శ్రీనివాస్ తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ...ఇంగ్లీష్ మీడియం అమలు దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తూనే ఉందని, అధికారులు వివిధ రకాల సమావేశాలు నిర్వహిస్తున్నారని వివరించారు. దీంతో ధర్మాసనం అధికారులపై తీవ్రంగా స్పందించింది.

బాటలు వేయడం ఒక మార్గం కాగా ప్రభుత్వ రంగంలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టి సర్వ వినాశనానికి దారులు వేయడం రెండవ మార్గం. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రెండవ మార్గాన్నే అనుసరించింది. 2008లో ప్రైవేటు తోక పుచ్చుకుని ప్రభుత్వరంగ ఉన్నత పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశ పెట్టింది. ఇదే ఒరవడిని కొనసాగించిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం (2014-2019) సుమారు ఇరవై అయిదు శాతం ప్రభుత్వ రంగ ప్రాథమిక పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే **రాజశేఖర్ రెడ్డి మరియు చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు రెండూ ప్రభుత్వ పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాయి. అయితే, తెలుగు మాధ్యమాన్ని కనీసం సమాంతరంగా కొనసాగించాయి. ఇప్పటి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వరంగ పాఠశాలలలో మాతృభాషా మాధ్య మాన్ని మొత్తం నిషేధించింది. అందుకే చర్చ ఇంత తీవ్రంగా జరుగుతున్నది.** మాతృభాషా మాధ్యమమే విద్యావ్యాసంగానికి మంచిదని, ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలనే సలహా ప్రభుత్వానికి రుచించక పోవచ్చు. కార్పోరేటు ఒంటికి అసలు పడదు. అయితే **ప్రైవేటు పాఠశాలలను ప్రక్కన పెట్టి మాతృభాషా మాధ్యమం గురించి మాట్లా డడం ఎంత వరకు సమంజసం? ప్రైవేటులో ఆంగ్ల మాధ్యమం ఉండగా ప్రభుత్వరంగంలో మాతృభాషా మాధ్యమం నిలదొక్కుకోవడం కష్టం. ప్రభుత్వమే తన బాధ్యతను గ్రహించి ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని పాఠశాలలలో తప్పనిసరిగా మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయడం న్యాయమైనది, రాజ్యాంగబద్ధమైనది మరియు శాస్త్రీయమైన పద్ధతి అవుతుంది. అందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు కాబట్టి, ఓటు రాజకీయాలనే కొనసాగిస్తోంది కాబట్టి ప్రజా ఉద్యమమే పరిష్కారం అవుతుంది.**

రచయిత - ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్,
అఖిలభారత విద్యాహక్కు వేదిక అధ్యక్ష వర్గ సభ్యులు

అమ్మనుడుల
పండుగ ఫిబ్రవరి 21

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846



స్థానిక భాషలే అభివృద్ధికీ, శాంతిభద్రతలకూ సయోధ్యకూ మూలం

2020 సంవత్సరంలో, ఐరాస, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా "స్థానిక భాషలే అభివృద్ధికీ, శాంతిభద్రతలకూ సయోధ్యకూ మూలం" అనే ఏకవాక్యాన్ని ప్రధానాంశంగా స్వీకరించింది.

1952 ఫిబ్రవరి 21 న అప్పటి అవిభక్త పాకిస్థాన్ తూర్పు పాకిస్తాన్లో అమలు చేస్తున్న ఉర్దూ ఆధిపత్యానికి నిరసనగా బెంగాలీలు చేపట్టిన మాతృభాషోద్యమ పోరాటంలో పాకిస్థాన్ జరిపిన హత్యా కాండలో ప్రాణాలు కోల్పోయినవారి స్మృతికి గుర్తింపుగా ప్రతియేటా ఫిబ్రవరి 21న ప్రపంచ దేశాలు అన్నీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని 1999లో ఐరాస సూచించింది. 2000 సంవత్సరంలో మొదలై ఇప్పటివరకూ 20 మాతృభాషా దినోత్సవా లను జరుపుకున్నాం. వీటన్నిటికీ మూలం మాతృభాషలో ప్రాథమిక విద్య, తెలిసిన భాషలో చదువు, భాషావైవిధ్యం – మానవ మనుగడకు అనివార్యం అనే విషయాలే.

ఐరాస, భాషా వైవిధ్యం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, స్థిరమైన అభివృద్ధికి భాషా వైవిధ్యమూ పలుభాషల వాడకమూ అవసర మని గుర్తుచేసే విధంగా ప్రతి యేటా ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని వీలైనన్ని భాషలలో జరుపుకోవాలని సభ్య దేశాలను కోరుతోంది.

'యునెస్కో' డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందేశంలో ఇలా అన్నారు:

భాష ప్రసార సాధనం మాత్రమే కాదు, ఇది మనలో మిగిలిన మానవతా విలువలకూ, నమ్మకాలకూ ఇంకా మన ఉనికికి గుర్తింపు నిచ్చే వ్యవస్థ. భాష ద్వారానే మనం మన అనుభవాలను పంచు కుంటాం, అనూచానంగా వస్తున్న సంప్రదాయాలను కింది తరాలకు అందిస్తాం, వేల యేండ్లగా సంపాదించిన జ్ఞానాన్ని యువతరానికి ప్రసారం చేస్తాం. భాషావైవిధ్యం విశ్వవ్యాప్తంగా ఉన్న మానవ జీవన శైలిలో ఉన్న అమిత వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

విద్యలో మాతృభాషకు ప్రాముఖ్యత:

ప్రస్తుతం, ప్రపంచీకరణ పేరుతో రోజురోజుకూ కనుమరు గవుతున్న భాషలు ఎక్కువ అవుతున్నందున భాషా వైవిధ్యానికి ఎక్కువగా ముప్పు పొంచి ఉంది. ప్రపంచవ్యాప్తంగా జనాభాలో 43 శాతం మందికి వారి మాతృభాష లేదా వారు అర్థం చేసుకునే స్థానిక భాషలో విద్యను పొందలేకపోతున్నారు. కారణం, భాషలపట్ల అవగాహన కొరవడినవారి చేత అమలుచేస్తున్న భాషా ప్రణాళికలే. ఏదేమైనా, మాతృభాష ఆధారిత బహుభాషా విద్యలో దాని ప్రాముఖ్యతపై పెరుగుతున్న అవగాహనతో, ముఖ్యంగా ప్రారంభ పాఠశాల విద్యలో, ప్రజా జీవితంలో మాతృభాష అభివృద్ధికి మరింత నిబద్ధతతో పురోగతి సాధించాలి.

2020 సంవత్సరంలో, ఐరాస అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ ప్రధానాంశంగా "స్థానిక భాషలే అభివృద్ధికీ, శాంతిభద్రత లకూ సయోధ్యకూ మూలం" అని ప్రకటించి ప్రచారం మొదలెట్టింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ముఖ్యోద్దేశం, ప్రతి దేశం, ఆ దేశంలోని "మాతృభాషలను పరిరక్షించడం, అన్ని అల్పసంఖ్యాక వర్గాలవారి భాషలకూ రక్షణ కల్పించడం.

ఇందులో భాగంగానే, "మాతృభాషలలో విద్య మానవ జీవితా లను మార్చివేస్తుంది" అనే విషయమే ఐరాసవారి ప్రధాన ఆశయ సాధనంగా ఉంది. ఐరాసవారి వ్యూహంలో, ఇది పేదరికాన్ని పార దోలి బతుకుబాటను అభివృద్ధి దిశగా నడిపించే సాధనంగా ఉంటుం దనేది నిర్వివాదాంశం. ఇదే విషయాన్ని విద్య2030 విధానచర్య.

మాతృభాష ద్వారా విద్య సృజనాత్మకతను పెంపొందిస్తుంది సమాజంలో అసమాన ఆర్థిక అస్థిరతతో దెబ్బతిని అనూహ్య మార్పు లకులోనైన జాతులకు, భాషా వారసత్వ గుర్తింపు సమైక్యతకు ఆధా రంగా ఉంటుంది. దీనిద్వారా వచ్చిన సృజనాత్మకతే సంఘటిత, సమగ్ర బహుళ సమాజాలను నిర్మించడానికి దోహదం చేస్తుంది. వారసత్వం మరియు సృజనాత్మకత రెండూ శక్తిమంతమైన, వినూత్న సంపన్న జ్ఞాన సమాజాలకు పునాదులు వేస్తాయి.

బలమైన సాంస్కృతిక భాగస్వామ్యం లేకుండా ఎటువంటి అభివృద్ధీ స్థిరంగా ఉండదని ఐరాస నమ్ముతోంది. వివిధ జాతుల సంస్కృతుల మధ్య పరస్పర గౌరవం ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో సాగే చర్చల ఆధారంగా జరిగే అభివృద్ధికి మానవీయ కోణంతో సాగే విధానం మాత్రమే శాశ్వత, సమగ్ర సమాన ఫలితాలకు దారి తీస్తుంది. ఐతే, ఇప్పటి వరకూ, అభివృద్ధి ప్రణాళికలలో సంస్కృతికి తగినంత ప్రాధాన్యం లభించలేదు. కారణం, మాతృభాషల ప్రాధాన్యం గత కొద్ది కాలంగా తగ్గుతూ రావడమే. మాతృభాషలే సంస్కృతికి సేతువులు.

మీరు అర్థంకాని భాషలో ఎలా నేర్చుకొంటారు?

ఇంట్లో మాట్లాడే భాషలోనే నాణ్యమైన విద్యను అందించాలి. అయితే, ప్రస్తుత ప్రపంచంలో కోట్లాదిమంది ఈ కనీస అవకాశాన్ని పొందలేకపోతున్నారు. ఐతే ఇలా పరభాష ద్వారా సాగే చదువు

భవిష్యత్తులో వారి సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. అందరికీ సమాన జీవితకాల అభ్యాసానికి ప్రాధాన్యత ఇచ్చే ఐరాసవారి కొత్త విశ్వ విద్యా విషయక పత్రంలో, భాషా హక్కులను గౌరవించే విధానం చాలా అవసరమనీ, దానిపట్ల శ్రద్ధ అవసరమనీ పునరుద్ఘాటిస్తున్నారు.

ఐరాసవారు 2016లో విడుదల చేసిన విధాన పత్రం నుండి కొన్ని ముఖ్య సందేశాలు:

1. పిల్లలకు వారికి అర్థమయ్యే భాషలో బోధించాలి, వారు మాట్లాడని లేదా అర్థంకాని భాషలో విద్యను పొందలేరు.

2. తరగతి గదిలో పిల్లలు మాట్లాడని భాష వాడటం తరచుగా పిల్లల చదువులకు అడ్డుగోడగా తయారవుతుంది. ఇది ముఖ్యంగా పేదరికంలో వున్నవారి విషయంలో ఎక్కువ.

3. వివిధ స్థానిక భాషలను మాతృభాషలుగా మాట్లాడేవారికి కనీసం ఆరు సంవత్సరాల మాతృభాషా బోధన అవసరం.

4. బహుళ జాతి సమాజాలలో, పాఠశాల వ్యవస్థలో అభివృద్ధి పేరున ఆధిపత్య భాషను విధించడం తరచుగా సామాజిక సాంస్కృతిక అసమానతలవంటి విస్తృత సమస్యలతో ముడిపడి ఉండటంచేత అది మాతృభాషలకు తలనొప్పిగా మారింది. ఐతే ప్రాథమిక విద్యలో ఆధిపత్య భాష పైచేయికారాదు.

5. విద్యా విధానాలు మాతృభాష నేర్చుకోవడంలో ఉన్న ప్రాముఖ్యతను గుర్తించాలి.

6. భాషా వైవిధ్యం విద్యావ్యవస్థలో సవాళ్లను సృష్టిస్తుంది, ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకం, పాఠ్యాంశాల అభివృద్ధి ఇంకా బోధనా సామగ్రిని అందించడం మొదలైనవి. అయినాసరే, తరగతి గదిలో పిల్లలను వారి ఇంటిభాషనుండి దూరం చేయడం తగదు.

ఐరాసవారి విశ్వవ్యాప్త విద్యాశిక్షణా విధాన పత్రంలో ఒకరి స్వంత భాష కాకుండా ఇతర భాషలో బోధించడం పిల్లల చదువు నేర్చుకోవడంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది అని పేర్కొంటోంది. చాలావరకూ ముఖ్యంగా పేద దేశాలలో, పెద్ద సంఖ్యలో పిల్లలు వారి ఇండ్లల్లో మాట్లాడని భాషలలో చదువునేర్చుకొంటున్నారు. అలాగే పరీక్షల్లో రాస్తున్నారు. ఇవి పిల్లలకు ముఖ్యంగా చదవడం రాయడం మొదలైన నైపుణ్యాలను త్వరగా సంపాదించడంలో ఆటంకం కలిగిస్తాయి. వారి తల్లిదండ్రులకు అక్షరాస్యతా నైపుణ్యాలు గానీ పాఠశాలలో ఉపయోగించే అధికారిక భాషలతో పరిచయం గానీ లేనప్పుడు ఇవి తప్పనిసరి ప్రతికూల ఫలితాలనే ఇస్తాయి. ఇలాంటి ఆధిపత్య భాష మాధ్యమ విద్య అల్పసంఖ్యాక ఇంకా బహుళసంఖ్యాక భాషా సమూహాల మధ్య చదువుకొనే అవకాశాలలో అంతరాలను బలోపేతం చేస్తాయి. ఇంటిభాష బడిభాషలు వేరుగా ఉన్నప్పుడు పరీక్షల ఫలితాలు (ఉదా. 30-32% మార్కుల తేడాతో) తలకిందులయే అవకాశం ఎక్కువగా ఉంటోందని అంతర్జాతీయంగానూ ఇంకా ప్రాంతీయంగానూ నిర్వహించిన మూల్యాంకన అంచనాలు నిర్ధారిస్తున్నాయి. విశ్వవ్యాప్త విద్యాశిక్షణా విధాన పత్రం ప్రపంచ వ్యాప్తంగా విద్యలో అసమానతల

సమాచారం (WIDE) కూడా పిల్లలు ఇంట్లో తరగతిగదిలో వాడేభాష మాట్లాడుతున్నారా లేదా అనే దానిపై ఆధారపడి వుంటుంది అని సూచిస్తోంది.

ఇంటి భాషను బోధనా భాషగా ఉపయోగించడం సర్వత్రా చదువునేర్చుకోవడంపై సానుకూల ప్రభావాన్ని చూపుతోంది అని ఐరాసవారి విశ్వవ్యాప్త విద్యాశిక్షణా విధాన పత్రంలో పేర్కొన్నారు. ప్రతి సంస్థ సురక్షితమైన తాగునీరు, విద్యుత్తు, వేరుగాఉన్న మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడగలగటం, తగినంత సురక్షితమైన తరగతి గదులు తగిన అభ్యాస సామగ్రి సాంకేతికత అందుబాటులో ఉండాలి. అయితే అక్షరాస్యత, లెక్కలలో నైపుణ్యాలు మొదలైనవాటిని పిల్లలకు అర్థమయ్యే భాషలో పాఠశాలల్లో నేర్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నాయి.

మాతృభాషా బోధనకు సంబంధించి - తక్కువ వనరులు ఉన్నచోట ఎనిమిది సంవత్సరాలకు పెంచడం - మైనారిటీ భాష మాట్లాడేవారికి తరువాతి తరగతులలో మెరుగైన అభ్యాసాన్ని కొనసాగించడానికీ నేర్చుకొనడంలో అంతరాలను తగ్గించడానికి అవసరం (హ్యూ ఇంకా ఇతరులు, 2007, ఐరాస, 2011) అని పేర్కొంటోంది. అలాగే, మాతృభాషలో నేర్చుకునే ప్రాథమిక పాఠశాల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలలో చదువుకొనే విద్యార్థుల కంటే గణితం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం ఇంకా భౌతిక శాస్త్రంలో 8 వ తరగతిలో మెరుగ్గా రాణించారు (హ్యూ మరియు ఇతరులు, 2007) అని చెబుతోంది. ఇలా ఉదహరించుకొంటూపోతే, విద్యా విధానాలలో "భాష" చాలావరకు అనేక ఇబ్బందులకు మూలంగా ఉంటోంది అని తెలుస్తోంది.

అంతర్గతంగా ఉన్న సామాజిక హెచ్చుతగ్గులూ రాజకీయ కక్షలూ కార్పణ్యాలూ ఏమైనప్పటికీ, ఈ కింది సందర్భాలలో విద్యలో భాషా విధానం హింసాత్మక సంఘర్షణకు కేంద్ర బిందువుగా మారి ఆ తేడాలను ఎత్తిచూపుతోంది. బహుళ జాతి దేశాలలో, ఉదాహరణకు, పాఠశాలల్లో బోధనా భాషగా నిర్బంధ ఆధిపత్య భాషను విధించడం, అది అవసరార్థం అని సమర్థించుకోవడం, సామాజిక సాంస్కృతిక అసమానతల సమస్యలతో సతమతమవుతున్న దేశాలకు మరింత తలనొప్పికి మూలం అవుతున్నాయి. సమాజంలో ఉన్న అసమానతలకు తోడుగా విద్యలో భాషా విధానాలు సృష్టించే తేడాలు తరచుగా హింసాత్మక సంఘర్షణలకు దారి తీస్తూ వాటిని తీవ్రతరం చేస్తున్నాయి. భాషా వివాదాలు తరచుగా ఆధిపత్య, పరాధీన ఇంకా కొన్ని సందర్భాల్లో, పాత వలసవాదానికి తెరలేపే విధానాలను ప్రతిబింబిస్తున్నాయి.

జాతీయ విద్యా విధానాలు పిల్లలకు వారి ఇంటి భాషలో బోధించే ప్రాముఖ్యతను గుర్తించాలి. చాలావరకు విద్యా విధానాలు భాషా వైవిధ్యాన్ని అరుదుగా ప్రతిబింబిస్తాయి. 40 పైగా దేశాల విద్యా ప్రణాళికలను సమీక్షించగా, వాటిలో సగం కంటే తక్కువ దేశాలు మాత్రమే తమ ఇంటి భాషలో, ముఖ్యంగా ప్రారంభ తరగతులలో పిల్లలకు బోధించే ప్రాముఖ్యతను గుర్తించారని కనుగొన్నారు. అయితే ప్రధాన కారణాలు మాత్రం పేదరికం, గతకాలపు వలసవాద విధానాలూను. వాటినుంచి బైటపడటానికి 'మాతృభాషా మాధ్యమాన్ని' ప్రపంచీకరణ చేయక తప్పదని ఐరాస నివేదికలు సూచిస్తున్నాయి.

డా॥దాసరి రామకృష్ణ ప్రసాదు
9885051179

తెలుగు మాధ్యమ విద్య నాశనానికి కారణం ఎవరు?

ఎంతోమందిమి భయపడుతున్నట్లుగానే తెలుగు మాధ్యమానికి అంత్యక్రియలు జరగబోతున్నాయి. 'తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెప్పేశారు.

అట్లూరి పురుషోత్తంగారి పుస్తకం :

నా పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ తెలుగు మీడియంలోనే చదివాను. 1974 లో ఎం.బి.బి.ఎస్. లో చేరాను.

అక్కడ నా తరగతి సహచరులు 150 మందిలో ఇంగ్లీష్ మీడియం నుండి వచ్చినవారు 20 మంది లోపే. ఇంగ్లీష్ లో మాట్లాడటంలో మాత్రం ఇంగ్లీషు మీడియం నుండి వచ్చిన వారు మెరుగ్గా ఉండేవారు. తెలుగు మీడియం వారు ఆంగ్ల మాధ్యమంలో వైద్యవిద్యను అభ్యసించడంలో మొదటి మూడు నాలుగు నెలలు తప్పితే ఆ తరువాత ప్రత్యేకమైన ఇబ్బందులేమీ పడలేదు.

1978 లో అట్లూరి పురుషోత్తం గారు రాసిన 'మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఎందుకు'- అనే శీర్షిక క్రింద విశాలాంధ్ర ఆదివారపు సంచికలో వచ్చిన వ్యాసాల పరంపరను చదివాను. ఈ వ్యాసాలన్నింటినీ కలిపి ఆ తరువాత 'మాతృభాషలో ప్రాథమిక విద్య' అనే పేరుతో పుస్తకంగా ప్రచురించారు. "పిల్లలు తమకు తెలిసిన భాషలో('మాతృభాష' లేదా 'సొంత భాష') తెలియని విషయాలైన సైన్స్, సోషల్, లెక్కలను తెలుసుకోవడం తేలిక గానీ, తెలియని ఇంగ్లీషులో తెలియని సైన్స్, సోషల్, లెక్కలను ఎలా తెలుసుకుంటారు? అనేది పురుషోత్తం గారి ప్రశ్న. **ఇంగ్లీష్ మీడియం విద్య వలన బట్టీపట్టి అప్పచెప్పడం, రాయడం అలవాటవుతుంది. పోషణ లేని పసిబిడ్డ వలె ప్రశ్న చచ్చిపోతుంది. దాంతో ప్రతిభ కుంటుతూ ఉంటుంది. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివే తెలుగు పిల్లలు, అంతే వసతులుండి సమర్థవంతంగా నిర్వహింపబడే తెలుగు మీడియం పాఠశాలల విద్యార్థుల కంటే మేధాశక్తి లోనూ, విజ్ఞానం లోనూ వెనుకబడే ఉంటారు. సృజనాత్మకత తగ్గిపోయి మన సమాజానికి చాలా నష్టం జరుగుతుందని ఆ పుస్తకం ద్వారా నిరూపించారు.** ఇంగ్లీష్ మీడియంలో చదివి ఉన్నత స్థితిలో ఉన్న వారిని ఉదాహరణగా చూపించి అందరూ అలానే చదవాలనే మొండి వాదన కొంతమంది చేస్తుంటారు. విద్య, వైజ్ఞానికపరమైన ఆసక్తి, గ్రహణ శక్తి (Academic interest) గల మేధావులైన పిల్లలు కొద్ది శాతమే ఉంటారు. వీరు బలమైన గిత్తల్లాంటివారు. ఏటికెదురీద గలవారు. చక్రాలు లేని బండిని కూడా బలమైన గిత్తలు ఎలా లాగ గలవో అలానే వీరు ఏ మీడియంలో బోధించినా తమ ప్రతిభను చూపగలరు. ఆంగ్ల మాధ్యమంతో ఇబ్బంది పడని ఈ కొద్ది మంది ఐదారు శాతం పిల్లల కోసం మిగిలిన పిల్లలందరినీ హింసించడం సరికాదు.

మాతృభాష ద్వారా విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకుంటారు. పరభాషా మాధ్యమ పాఠశాలల్లో విషయం ద్వారా పరభాషను నేర్చుకుంటారు. ఇంగ్లీష్ మీడియం ద్వారా పిల్లలకు ఎంత హాని జరుగుతుందో లోతుగా ఆలోచిస్తే మాత్రమే బోధపడుతుంది. సామాన్యంగా ప్రతి వ్యక్తి తమ మాతృభాష లోనే ఆలోచిస్తాడు. ఇంగ్లీష్ మీడియం ద్వారా విద్య గరపినప్పుడు ఇంగ్లీష్ లో బోధించిన దానిని విద్యార్థి ముందుగా మనసులో తెలుగులోకి తర్జుమా చేసుకుని ఆలోచిస్తాడు. తరువాత ఆలోచించిన దానికి తిరిగి ఇంగ్లీష్ లోనికి తర్జుమా చేసుకుని సమాధానం చెప్తాడు. ఈ క్రమంలో ఎంతో శ్రమ, కాలం వృధా కావటంతో పాటు విజ్ఞాన సముపార్జన కూడా కుంటు పడుతుంది. ఆంగ్ల మాధ్యమం బడులలో చదివే విద్యార్థులకు వారికి తెలియకుండానే మాతృభాష మీద, మాతృదేశం మీద న్యూనత కలుగుతుంది. అమెరికా, ఇంగ్లాండ్ వంటివి మాత్రమే గొప్పవని, ఇంగ్లీష్ భాషే గొప్పదని మన భాష, మన దేశం ఎందుకూ పనికిరావనే చిన్న చూపు ఏర్పడుతుంది. మన భాష, మన దేశం మీద అభిమానం లేని బానిస మనస్తత్వం దేశాభ్యుదయానికి, స్వాతంత్ర్యానికి పెద్ద ఆటంకంగా తయారవుతుంది.

నా అనుభవం:

ఆడుతూ పాడుతూ కొత్త విషయాలను నేర్చుకోవలసిన బాల్యాన్ని బట్టీయం చదువులతో హింసించి నాశనం చేయడం బాధగా ఉండేది. అప్పటినుండి తెలుగు పిల్లలు తెలుగు మీడియంలోనే చదవాలని ప్రచారం చేస్తూ వచ్చాను.

1978 నుండీ ఈ రోజు వరకు ప్రతిరోజూ కనీసం ఒక్కరితో నన్నా ఈ విషయం మాట్లాడడం నియమంగా పెట్టుకుని పాటిస్తున్నాను. చల్లపల్లి లోని ప్రతి స్కూలుకూ ఇంగ్లీష్, తెలుగు రెండు మాధ్యమాలూ ఉండేవి. మా ఊర్లోనే కాకుండా చాలాచోట్ల ఉన్న స్కూలు యాజమాన్యాలను "పిల్లలు ఏ మీడియంలో బాగా చదువుతున్నారు" అని తరచుగా అడుగుతుండేవాణ్ణి. "తెలుగు మీడియం పిల్లలకే సబ్జెక్టు లపై అవగాహన పట్టు బాగా ఉంటుంది కానీ ఎక్కువమంది తల్లితండ్రులు ఇంగ్లీష్ మీడియమే కోరుకుంటు న్నారు కాబట్టి మేము ఇంగ్లీష్ మీడియం కూడా నడుపుతున్నాము" అని చెబుతుండేవారు. "మరి ఇంగ్లీష్ మీడియం పిల్లలకు వారికి అర్థమయ్యేటట్లు ఎలా నేర్పుతున్నారు?" అని అడిగితే – పాఠాన్ని తెలుగులోనే చెప్పి, ఇంగ్లీష్ లో నోట్స్ చెబుతాము అని చెప్పేవారు. ఏ మీడియంలో చేరడం అనేది తల్లితండ్రుల ఎంపిక తప్పితే పిల్లల ఎంపిక కాదు. కానీ **పల్లెటూరు పిల్లలు తల్లితండ్రుల మెప్పు కోసం, టీచర్ల మెప్పు కోసం ఇంగ్లీష్ మీడియంలో చదువుతూ ఎంతో కష్టపడి బట్టీబట్టి పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవలసి రావడం చాలా బాధాకరమైన విషయం.**

అందుకే తల్లితండ్రులకు అవగాహన కల్పించడానికి 1990 లో అట్లూరి పురుషోత్తం గారితోనూ, 2001 లో విశపు బాల సుబ్రహ్మణ్యం గారితోనూ బహిరంగ సమావేశాలను నిర్వహించాం.

బాల సుబ్రహ్మణ్యం గారి సభ తరువాత కొంతమంది తల్లితండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం నుండి తెలుగు మీడియంలోనికి మార్చారు కూడా. కానీ ఆ తరువాత వచ్చిన ఐ.టి.బూమ్, తద్వారా వచ్చే కొద్దిపాటి అమెరికా ఉద్యోగాలు తల్లితండ్రులు, తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో మాత్రమే చదివించే పరిస్థితికి బలంగా నెట్టాయి. అమెరికాలో ఉద్యోగం రావాలంటే ఇంగ్లీష్ బాగా రావాలని, ఇంగ్లీష్ బాగా రావాలంటే ఇంగ్లీష్ మీడియంలోనే చదవాలని తల్లితండ్రుల అపోహ! మీడియం ద్వారా కొత్త భాషను నేర్పించడం అనే ప్రక్రియ ప్రపంచంలో ఎక్కడా లేదని, భాషను భాష గానే నేర్పించాలని ఇంగ్లీష్ భాషను 3 వ తరగతిలో ప్రవేశపెట్టి పరభాష నేర్పే పద్ధతిలో నేర్పిస్తే 10 వ తరగతి సమయానికి మంచి ఇంగ్లీష్ నేర్పించవచ్చని చెబు తుండేవాళ్ళం. నేను, డా. పద్మావతి, వేంకటేశ్వరరావు, రామారావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వాసుదేవరావు మాస్టార్లు మరి కొంత మందితో కలిసి ప్రతి పల్లెలో తల్లితండ్రులతో సమావేశాలు నిర్వ హించాం. అమెరికాలో ఉద్యోగాలు అతి తక్కువని ఆ ఉద్యోగాల కోసం వెళ్ళే వారి కోసం ఇంగ్లీష్ నేర్పడం పెద్ద కష్టమైన పని కాదని చెప్తుండేవాళ్ళం.

మా పిల్లలు 10 వ తరగతి వరకు తెలుగు మీడియంలోనే చదివారు. మా అబ్బాయికి ఎంసెట్ లో తొలిసారే 2001లో 3 వ ర్యాంకుతో MBBS సీటు వచ్చినప్పుడు కొంతమంది ప్రత్యేకంగా నన్ను కలసి "మీరు నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపించారు, మీ అభిప్రాయం సరైనదేనని ఋజువైంది" అని చెప్పారు. కానీ మా అబ్బాయికి సీటు రాకపోయినా నా అభిప్రాయం సరైనదే. మా అమ్మాయి కూడా సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా దుబాయి లో పనిచేస్తోంది.

ఆమె తన వృత్తిలో పూర్తిగా ఆంగ్ల భాషలోనే వ్యవహరించాల్సి వస్తుంది. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడడానికి, తోటివారితో వ్యవహరించడానికి, రాత పూర్వకమైన వృత్తి పనులకు ఎప్పుడూ తను తెలుగు మీడియంలో చదవడం వలన ఇబ్బంది పడలేదు. ఇప్పుడు మా మనవళ్లు కూడా తెలుగు మీడియంలోనే చదువుతున్నారు.

మిత్రుల అనుభవాలు :

మా మిత్రులలో చాలామంది తమ పిల్లలను తెలుగు మీడియం లోనే చదివించారు. నా మిత్రుడు డాక్టర్ సాంబిరెడ్డి తెనాలిలో వాళ్ల పిల్లలను చేర్పించడానికి ఒక తెలుగు మీడియం స్కూల్‌కి వెళితే "ఈ స్కూల్ మీలాంటి పెద్ద వాళ్ల కోసం కాదు. మాది కేవలం తెలుగు మీడియం స్కూలు" అని ఆ హెడ్ మాష్టారు చెప్పారు. "నేను కావాలనే తెలుగు మీడియం స్కూల్ లో చేర్పించడం కోసం వచ్చాను" అని వాళ్ళను ఒప్పించి ఆ స్కూల్ లోనే చేర్చారు. ఆ పిల్లలిద్దరకు జీవితంలో స్థిర పడటానికి తెలుగు మీడియం వలన ఎప్పుడూ ఇబ్బంది కలగలేదు సరికదా వాళ్ళు తమ బాల్యాన్ని ఆనందిస్తూ చదువుకున్నారు. ఇంగ్లీషులో మాట్లాడగలగడం, వ్యవహరించగలగడంలో వారికి ఏ సమస్య లేదు. ఆ పిల్లలిద్దరూ ఇప్పుడు చక్కగా వారి వృత్తులలో స్థిరపడ్డారు.

చల్లపల్లిలోని నాగేశ్వరరావు మాష్టారి పిల్లలిద్దరూ 10 వ తరగతి వరకు తెలుగు మీడియంలోనే చదువుకుని మొదటిసారే MBBS సీటు తెచ్చుకుని ఇప్పుడు ఒకరు కార్డియాలజిస్ట్‌గానూ, ఇంకొకరు ఎండోక్రైనాలజిస్ట్ గానూ పనిచేస్తున్నారు. కోటేశ్వరరావు మాష్టారి పిల్లలిద్దరూ కూడా 10 వ తరగతి వరకు తెలుగు మీడియం లోనే చదువుకుని సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా అమెరికాలో స్థిరపడ్డారు. వేంకటేశ్వరరావు మాష్టారి కుమారుడు కూడా ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తమ పిల్లలను తెలుగు మీడియంలో చదివించిన మా మిత్రులు, వారి పిల్లలు ఉన్నత స్థితికి చేరి, సంతోషంగానే ఉన్నారు. ఇంగ్లీష్ భాషలో సాధికారత సంపాదించుకోవడంలో వారికి తెలుగు మీడియం ఏమీ అడ్డంరాలేదు. పైగా ఉపాధికోసం కావలసిన సబ్జెక్టు లలో అవగాహన మెరుగ్గా ఉండడం వారికి మరింత ఉపయోగ పడింది.

ప్రఖ్యాత ఆంగ్ల రచయిత – లంకా శివరామప్రసాదు నేటి ప్రఖ్యాత ఆంగ్ల రచయిత అయిన లంకా శివరామప్రసాదు వైద్యవిద్యలో నా సహచరుడు. అనేక ఇంగ్లీష్ క్లాసిక్ పుస్తకాలను తెలుగులోనికి అనువదించాడు. భగవద్గీత ను పద్యాలుగా ఇంగ్లీష్ లో రాయడమే కాకుండా అనేక తెలుగు పుస్తకాలను ఇంగ్లీష్ లోకి అనువదించాడు. **ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇంత గొప్ప ఆంగ్ల కవి హైస్కూల్ విద్య వరకు తెలుగు మీడియంలోనే చదివాడు.**

మరికొన్ని అనుభవాలు :

కొద్ది సంవత్సరాల క్రితం డా. రజనీకాంత్ అరోలీ అనే "రామన్ మెగసెసే" అవార్డు గ్రహీత (మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతంలోని 300 గ్రామాల ప్రజలలో కల్గించిన ఆరోగ్య అవగా హనకై యీయనకా బహుమతి వచ్చింది) పాల్గొన్నారు. ఆయనతో బాటు అదే సంస్థలో 'కృత్రిమ అవయవాల తయారీ' విభాగంలో పనిచేసే ఒక వ్యక్తి కూడ వస్తే నేనాతనని కలిశాను. ఆయన తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందినవాడు. తెలుగు మీడియంలో నాలుగో తరగతి చదువుతూ, ఇంటి నుండి పారిపోయి, బొంబాయి చేరి, కొన్నాళ్ళ తరువాత డాక్టరు అరోలి దగ్గర పనికి చేరాడు. తక్కువ ఖర్చుతో కృత్రిమ అవయవాలు తయారు చేయాలనుకున్న ఆ సంస్థ అతణ్ణి జైపూర్ పంపి శిక్షణ ఇప్పించింది. ఈయన కెన్యా, టాంజానియా వంటి విదేశాలలో కృత్రిమ అవయవాల తయారీ పాఠాలు బోధించేవారు.

"మీరు వాళ్ళకి పాఠాలు ఏ భాషలో బోధిస్తున్నారు?" అని ప్రశ్నించాను.

"ఇంగ్లీష్ లో" అని ఆయన సమాధానం.

"మీరు చదివిందేమో 4 వ తరగతి. అదీ ఒక మారుమూల పల్లెలో, తెలుగు మీడియం స్కూల్లో గదా! విదేశాల వారి కర్థమయ్యేలా ఆంగ్లంలో ఉపన్యాసాలెలా ఇవ్వగలుగుతున్నారు? ఇంగ్లీష్‌ను ప్రత్యేకంగా ఎన్నేళ్లు కష్టపడి నేర్చుకున్నారు?" అని మళ్ళీ అడిగాను.

"లేదు – నేను ప్రత్యేకంగా ఆ భాషను నేర్చుకోనేలేదు. మా సంస్థను చూడటానికి, శిక్షణ పొందటానికీ చాల మంది విదేశీయులు బొంబాయి వస్తుంటారు. వారి ఆంగ్ల సంభాషణలు వింటూ, తోటి వారితో ఆంగ్లంలో సంభాషిస్తూ క్రమక్రమంగా ఆంగ్లం మాట్లాడటం నేర్చుకొన్నాను. విదేశీయులిక్కడికి వచ్చినా, నేను విదేశాలకు పోయినా ఆ భాషలోనే మాట్లాడి తీరవలసి అవసరం వచ్చింది కనుక నానాటికీ

నా ఆంగ్లభాషా పరిజ్ఞానం పెరిగింది" అని ఆయన బదులిచ్చారు.

తెలుగు మీడియంలో నాల్గవ తరగతి కూడ పూర్తిగా చదవని ఒక పల్లెటూరి వ్యవసాయ కూలీ కుటుంబంలోని వ్యక్తి దేశ విదేశాలా లోని అపరిచితులకు ఇంగ్లీష్‌లో సాంకేతిక విషయాల మీద ఉపన్యాసా లివ్వడానికి భాషా పరమైన ప్రత్యేక శిక్షణే అవసరం లేకపోయింది! అతని చుట్టూ ఉన్న 'ఆంగ్ల భాషావాతావరణము, నేర్చుకోవలసిన అవసరమే' అతనికాభాషను నేర్పింది!

ప్రేమాయణం -ఆంగ్ల పారాయణం :

కొన్నాళ్ళ క్రిందట నాదగ్గరకు వైద్యం కోసం వచ్చిన ఒక గృహిణి చక్కటి ఇంగ్లీష్ మాట్లాడటం గమనించాను.

"మీకింత మంచి ఇంగ్లీష్ ఎలా అబ్బింది? ఏం చదువు కున్నారు? ఏ మీడియంలో చదివారు? " అని అడిగాను.

"డిగ్రీ వరకు నేను తెలుగు మీడియంలోనే చదివాను" అన్నది.

"అయితే ఇంత మంచి ఆంగ్లం ఎలా మాట్లాడగలుగు తున్నారు?"

ఈ ప్రశ్నకామె కొంచెం సిగ్గుపడుతూ ఇలా చెప్పింది. "డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నప్పుడు నేనొక తమిళ యువకుణ్ణి ప్రేమిం చాను. ఆయనకు ఇంగ్లీష్ బాగా వచ్చు గాని, తెలుగురాదు. నాకు తమిళం బొత్తిగా తెలియదు. ఏదో కొద్దిగా ఇంగ్లీష్ వచ్చు. మరి నా భావాలతనికి ఇంగ్లీష్ లోనే వ్యక్తీకరించవలసిన అవసరమేర్పడింది. తప్పని పరిస్థితి కనుక వెంటనే ఆంగ్లం నేర్చుకొన్నాను".


"ఇంత బాగా ఇంగ్లీష్ మాట్లాడటం నేర్చుకొనడానికి ఎంత కాలం పట్టింది?" అని మళ్ళీ అడిగాను.

"మూడు నెలలు" అని ఆమె సమాధానం. అంతేగాదు, మరో మూడు నెలలు తిరగకముందే తనకి తమిళం కూడా వచ్చిందని ఉత్సాహంగా చెప్పింది.

చల్లపల్లిలో ఒక సాధారణ ఆర్థికస్థాయిగల కుటుంబం నుండి వచ్చిన డా. నళినీ కుమార్, అమెరికాలోని "యేల్" యూనివర్శిటీలో సైంటిస్ట్ గా ఎదగడానికి కారణం - అతనికి జీవశాస్త్రం పట్ల ఉన్న అనురక్తి. ఇంటర్ వరకు తెలుగులోనే చదివిన ఆయన స్వీడన్ లో పరిశోధన చేయాల్సి వచ్చినప్పుడు అతి తక్కువ కాలంలోనే ఆంగ్లభాషలో ప్రావీణ్యం సంపాదించారు. ఏ కొత్త భాషనైనా అవసరం అయితే నేర్చుకోవడానికి 3 నుండి 6 నెలలు చాలు అని భాషా శాస్త్రవేత్తలు చెప్తున్నారు గదా!

10 భాషలలో మాట్లాడగలిగిన తెలుగు మాధ్యమ విద్యార్థి మాతంగి కోటేశ్వరరావు చల్లపల్లి మండలం, బొబ్బర్లంక దళితవాడకు చెందినవాడు. ఈయన 10 భాషలలో అనర్గళంగా సంభాషించ గలడు. అతడు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మాధ్యమం లోనే 9 వరకే చదువుకున్నాడు. అతను మంచి ఎలక్ట్రీషియన్. అతన్ని ఉద్యోగంలో పెట్టుకున్న కాంట్రాక్టరు ఏ ప్రదేశానికి వెళ్ళమంటే ఆ ప్రదేశానికి వెళ్ళేవాడు.

ఇంగ్లీషు కంటే ముందు అతనికి తన మాతృభాష తెలుగు కాక తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, హిందీ, బెంగాలి,



నైజీరియాలోని రెండు భాషలు వచ్చు. మేం అతన్ని ఇంటర్వ్యూ చేసే సమయానికి టాంజానియా వెళ్ళడానికి సిద్ధమౌతున్నాడు. అక్కడ భాష మీరు నేర్చుకొనే వెళ్తున్నారా అని అడిగితే, నవ్వి "అక్కడ ఏ భాషో నాకు తెలియదు, ఎక్కడకు వెళ్ళినా 3 నెలల్లో ఆ ప్రాంతపు భాష నేర్చుకోగలను" అని ధైర్యంగా చెప్పాడు. అతడు తన జీవితాన్ని గెలుచుకోవడానికి అతనికి ఉన్న ఎలక్ట్రికల్ నైపుణ్యం ఉపయోగపడిందే కాని ఇంగ్లీషు కాదు.

తమిళనాడు కార్ల డ్రైవర్ల హిందీ నైపుణ్యం :

తమిళనాడులోని పర్యాటక ప్రదేశాలలో కిరాయి కార్ల డ్రైవర్లు హిందీలో చక్కగా మాట్లాడటం గమనించాను.

తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం జరిగి హిందీని భాషగా స్కూళ్ళలో నుండి తరిమేసి చాలా కాలం అయ్యింది.

అయినా వారికి ఎలా అ భాష వచ్చింది అని అడిగితే "ఉత్తర భారతదేశ యాత్రికులతో సంభాషించాలి కదా అందుకని మాకు హిందీ వచ్చేస్తుంది" అని వారి సమాధానం. **అవసరమే వారికి కొత్త భాషను నేర్పింది.**

గడ్డం అనిత, గడ్డం జాషువా సునీల్ :

అమెరికా అధ్యక్షుడు హైదరాబాద్ వచ్చినప్పుడు ఆయనతో ఎంతో చక్కగా సంభాషించిన "గడ్డం అనిత" అవనిగడ్డ మండలంలో ఒక కుగ్రామంలో పుట్టి హైస్కూల్ స్థాయి వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నది.

ఐ.ఐ.టి. కాన్పూర్ లొ అద్భుతంగా రాణించిన "గడ్డం జాషువా సునీల్" హైస్కూల్ చదువంతా తెలుగు మీడియంలోనే సాగింది. ఇటువంటి ఉదాహరణలు మనం వందలు – వేలు చెప్పుకోవచ్చు. పై యదార్ధ సంఘటనల వల్ల మన కర్ధమయ్యేదేమంటే? బలమైన అవసరం ఏర్పడితే, పట్టుదల, శ్రద్ధ ఉంటే, ఎవరైనా, ఏ భాషనైనా మూడు నుండి ఆరు నెలల కాలంలో సునాయాసంగా నేర్చుకోగలరనే కదా! భాషను **భాషగా నేర్చుకోవడమే సులభమని కూడ పై ఉదాహరణల వల్ల మనం గ్రహించవచ్చు.**

మా ప్రచారంలో ఈ ఉదాహరణలన్నీ చెప్తూ తల్లిదండ్రులకు తమ పిల్లలను తెలుగు మీడియంలోనే చదివించమని ప్రచారం చేస్తూండే వాళ్ళం. 'ఇంగ్లీష్ భాషకు మేము వ్యతిరేకం కాదు' అని కూడా స్పష్టం చేస్తుండేవాళ్లం.

మానసిక వైద్య నిపుణులైన డా. పమిడి శ్రీనివాస్ తేజ రాసిన 'మాతృ భాష – ప్రాథమిక విద్య' పుస్తకంలో పిల్లలు ప్రాథమిక విద్యను తమ 'సొంత భాష' లోనే ఎందుకు చదువుకోవాలో శాస్త్రీయంగా నిరూపించారు. పిల్లలలో మెదడు, మానసిక ఎదుగుదల, భాషలను నేర్చుకునే విధానం మొదలుకొని ఎన్నో విషయాలను ఎంతో వివరంగా చర్చించారు. ప్రపంచంలో జరిగిన అనేక అధ్యయనాలను వాటి ఫలితాలను ఆ పుస్తకం లో వివరించారు.

చుక్కా రామయ్య గారు కొన్ని సంవత్సరాల పాటు దినపత్రికలలో విద్య పైన వ్యాసాలు రాస్తుండేవారు. వారు 'ఇంటి భాష' సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. ప్రాథమిక విద్యను ఇంటి భాషలోనూ, ఉన్నత పాఠశాల విద్యను ప్రామాణిక తెలుగు భాషలోనూ బోధించాలని వారి వాదన. మాతృభాషలోనే పాఠశాల విద్యను బోధించాలని బలంగా వాదించే రామయ్య గారు కె.సి.ఆర్. గారు తాము గెలిస్తే తెలంగాణాలో కె.జి. నుండి పి.జి. దాక ఇంగ్లీష్ మాధ్యమంలోనే బోధిస్తామని ప్రకటించినప్పుడు మాత్రం ఆ వాదనను ఖండించలేదు. 'రామయ్య గారూ! మీరు ఇలా మౌనంగా ఎందుకు ఉంటున్నారు? రాబోయే ప్రమాదాన్ని ఆపడానికి మీలాంటి వారు మాట్లాడకుంటే ఎలా?' అని వారి వ్యాసాలు ప్రచురించే దినపత్రిక లన్నింటికీ ఉత్తరాలు రాశాను. కానీ ఏ పత్రికలోనూ ఈ ఉత్తరం ప్రచురించబడలేదు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్యగారు ఆంగ్లంలో దిట్ట. ఆయన ఇంగ్లీష్ మీడియంలో చదువుకోలేదు. ఆసక్తితో ఇంగ్లీష్ ను అధ్యయనం చేసి అనేక పత్రికలలో వ్యాసాలు రాస్తున్నారు. ఇంగ్లీష్ లో అనేక పుస్తకాలు రాశారు. కానీ ఇప్పుడు మాత్రం అందరూ ఇంగ్లీష్ మీడియంలోనే చదువుకోవాలని ఆయన తన వ్యాసాలలో రాస్తున్నారు. ముఖ్యంగా బహుజనులందరూ ఉన్నత స్థితికి చేరాలంటే ఇంగ్లీష్ మీడియంలోనే చదువుకోవాలని గట్టిగా ప్రచారం చేస్తున్నారు.

ఐలయ్యగారి లాంటి మరికొంతమంది మేధావుల ప్రచారం వలన ఇంగ్లీషు మాత్రమే తమను ఉన్నత స్థితికి చేర్చే భాష అనే అభిప్రాయం శ్రామిక వర్గంలో బలపడింది. ఇంగ్లీషు భాషను నేర్చుకోవడానికి ఎవ్వరూ వ్యతిరేకం కాదు. కానీ 'మీడియం ద్వారా ఇంగ్లీషు నేర్చుకోవడం అశాస్త్రీయం' అనే విషయం మరుగున పడిపోయింది.

70 వ దశకం నుండి ఉన్నత, మధ్య తరగతి వర్గాల ప్రజలు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదివించుకోవడం మొదలయింది. ఇంగ్లీషు పై ఉన్న వ్యామోహం, భాషను భాషగా నేర్చుకోవడానికీ – మీడియం ద్వారా భాష నేర్చుకోవడానికీ మధ్య ఉన్న వ్యత్యాసం తెలియకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో దిగజారుతున్న ప్రమాణాలు – ఇవన్నీ ప్రైవేటు ఇంగ్లీషు మీడియం పాఠశాలల దినదినాభివృద్ధికి తోడ్పడ్డాయి.

ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను పెంచడానికి ఇప్పటివరకూ ఏ ప్రభుత్వమూ నిజాయితీ గా ప్రయత్నించలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో చదివించడం మొదలుపెట్టారు.

'బడి బాట' పేరుతో ప్రభుత్వ టీచర్లు వేసవి సెలవుల్లో ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసిందిగా ప్రచారం చేసేవారు. అతి తక్కువ మంది టీచర్లు మాత్రమే తమ పిల్లలను తాము పనిచేసే స్కూళ్లల్లో చదివిస్తున్నారు. మరి టీచర్ల పిల్లలు ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో చదువుతుంటే వీరి మాటలకు విలువేంఉంటుంది? చివరకు నాణ్యమైన విద్య అంటే ఇంగ్లీషు మీడియం విద్యే అనే అభిప్రాయం ప్రజలలోకి వచ్చింది. ప్రభుత్వాలు కూడా అవే మాటలు మాట్లాడుతున్నాయి. ఇక సినిమాల సంగతికొస్తే – తెలుగు మీడియంలో చదువుకున్న పాత్రలు ఆత్మన్యూనతతో ఉన్నట్లు, వాళ్లను హేళన చేస్తున్నట్లు చూపించడం జరుగుతోంది.

APTF మినహా మిగిలిన ఉపాధ్యాయ సంఘాలేవీ 'మాతృభాష లోనే ప్రాథమిక విద్య' జరగాలనే ప్రచారం గట్టిగా చేయలేదు.

జనసాహితి సాంస్కృతిక సంస్థ పట్టుదలగా ఈ విషయం పై కృషి చేస్తోంది. పాలక రాజకీయ పార్టీలేవీ ఏనాడూ విద్యా వ్యవస్థ పై సరైన దృష్టి పెట్టనేలేదు. కమ్యూనిస్ట్ పార్టీలన్నీ సైద్ధాంతికంగా మాతృభాషలో విద్యను నమ్మినా CPIML (జనశక్తి) పార్టీ తప్పితే మిగిలిన ఏ వామపక్ష పార్టీ కూడ పూర్తి స్థాయిలో ఈ సమస్యను తీవ్రంగా పరిగణించలేదు. ఈరోజు కమ్యూనిస్ట్ పార్టీల కార్యకర్తలు, అనేక మంది వామపక్ష అభిమానులు కూడా ఈ విషయం పై భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉండటం విషాదం. కమ్యూనిస్ట్ పార్టీలు బలంగా ఉన్న విజయవాడలోనైనా, వారిలో ఎంతమంది తమ పిల్లలను తెలుగు మీడియంలో చదివించారు? మరి ఇవన్నీ మిగతా సమాజంపై ప్రభావం చూపవా?

ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా 'తెలుగు మీడియమే శాస్త్రీయం కానీ తెలుగు మీడియంలో చదివినవారు ఇంగ్లీష్ లో సాధికారికంగా మాట్లాడలేకపోతున్నారు' అంటూ ఇటీవల తాను విడుదల చేసిన ఒక వీడియోలో ఇంగ్లీష్ మీడియంను సమర్ధించారు. తాను ఆదిలా బాద్ జిల్లాలో తెలుగు మీడియంలో చదువుకున్నానని అయినా ఆంగ్లంలో చక్కగా సంభాషించడమే కాక అనేక ఆంగ్ల పత్రికలలో వ్యాసాలు రాస్తుంటానని, ఇంగ్లీష్ టి.వి. ఛానల్స్ లో మాట్లాడుతుం టానని ఆ వీడియాలోనే చెప్పారు. తెలుగు మీడియంలో చదివినవారు ఆసక్తి, పట్టుదల ఉంటే ఇంగ్లీష్ భాషలో దిట్ట కాగలరనడానికి ఆయనే ఒక ఉదాహరణ. కానీ **అభ్యుదయ వాది, శ్రామిక వర్గ పక్షపాతి అయిన నాగేశ్వర్ గారు కూడా అసమంజసమైన వాదనను తీసుకు రావడం దురదృష్టం.** 'తిలాపాపం తలో పిడికెడు' అన్నట్లుగా తమ సొంత భాషలో తెలుగు పిల్లలు చదువుకోలేని దుస్థితికి ఎంతోమంది తలొక చెయ్యి వేశారు.

తెలుగు మీడియంలో తమ బిడ్డలను చదివించుకోవాలను కొన్న తల్లిదండ్రులకు చాలా కాలం నుండి ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. పట్టణాలలో మున్సిపల్ స్కూళ్లలో మినహా తెలుగు మీడియం లో చదివించుకొనే అవకాశం లేదు. కొద్దిగా ఆర్థిక స్తోమత కలిగిన వారెవ్వరూ ఈ స్కూళ్లలో చదివించడానికి ఇష్టపడటం లేదు.

పల్లెటూళ్లలో రెండు భాషా మాధ్యమాలలో పాఠశాలలు ఉండేవి. కార్పొరేట్ స్కూళ్లు పల్లెటూళ్లలోకి పాకిన ప్రస్తుత కాలంలో తెలుగు మీడియం బడులన్నీ కూడ దాదాపు అంతరించిపోయినాయి. మా ఊరిలో ఒకే ఒక ప్రైవేటు స్కూల్లో తెలుగు మీడియం ఇంకా మిగిలి ఉంది.

తెలుగు మీడియంను ఎవరు బలపరుస్తున్నారు?

ఆడుతూ పాడుతూ పిల్లలు విజ్ఞానాన్ని నేర్చుకోవాలని, శిక్షణ శిక్షగా ఉండకూడదని, పిల్లల సృజనాత్మకతను పెంచే విధంగా నాణ్యమైన విద్యను తెలుగు పిల్లలకు అందించాలని భావించే – బాల్యాన్ని ప్రేమించే వ్యక్తులు, తెలుగుభాష మీద అభిమానం ఉన్న వ్యక్తులు, తెలుగు భాషోద్యమ సమాఖ్యలాంటి సంఘాలు, మన సంస్కృతి నాశనమయిపోతుందని భావించే కొంతమంది గురువులు, బాబాలు! ఈ ఆధ్యాత్మిక గురువులు, బాబాలు మాట్లాడే మాటలు హిందూ మత ప్రచారం వలె ఉండి సాధారణ ప్రజానీకానికి ఇంకా విరక్తి కలుగుతుంది. శాస్త్రీయంగా ప్రచారం చేసే తెలుగు భాషోద్యమ సమాఖ్య లాంటి సంఘాలు, వ్యక్తులు ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చగలిగినంత బలంగా లేవు.

ప్రస్తుత పరిస్థితి :

జనంలో ఉన్న ఈ ఇంగ్లీష్ మీడియం కాంక్షను చూసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వచ్చే సంవత్సరం నుండి దశల వారీగా తెలుగు మీడియంని తీసేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం శాస్త్రీయంగా జరిగే చర్చను ఎవ్వరూ పట్టించుకోకపోగా ఇది కాస్తా భావోద్వేగాల సమస్యగా మారింది. "డబ్బున్న వాళ్ళందరూ ఇంగ్లీష్ మీడియంలో తమ పిల్లలను చదివించుకుంటే మేము చదివించుకోవద్దా? మాకు వచ్చిన ఈ అవకాశాన్ని కాలదన్నుతారా?" అని శ్రామిక వర్గం ప్రశ్ని స్తోంది. **ప్రభుత్వ పాఠశాలలలో చాలా కాలం నుండి ఇంగ్లీష్ మీడియం ఉంది. ఇప్పుడు కొత్తగా జరిగింది – తెలుగు మీడియంను తీసివే యడం. తమ పిల్లలను తెలుగు మాధ్యమంలో చదివించాలను కొనే తల్లిదండ్రులకు ఈ తెలుగు రాష్ట్రంలో ఇంక అవకాశం లేదు.**

ముగింపు:

ఇంగ్లీషు మీడియంలో ప్రాథమిక విద్యను బోధించడం వలన సైన్సు, లెక్కలు నేర్చుకోవడంలో తమ పిల్లలు వెనుక బడినట్లు కొన్ని ఆఫ్రికా దేశాలు గ్రహించాయి. అంతే కాకుండా వారి సాంస్కృతిక మూలాలకు కూడా దూరమైనట్లు వారి అధ్యయనంలో తేలింది. ఆ తరువాత మళ్ళీ పిల్లల సొంత భాషలో బోధించడం మొదలుపెట్టిన తరువాత అదే విద్యార్థులలో ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పం, సామాజిక నైపుణ్యాలు పెరిగి వారు ఎక్కువ ప్రతిభను కనబరిచారు. ఇది ఐక్యరాజ్య సమితి వారి అధ్యయనం. శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధించిన అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, రష్యా, కొరియా, చైనా వంటి ఏ దేశంలోనైనా ప్రాథమిక విద్య మొదలుకొని, పరిశోధనా స్థాయి వరకు వారి మాతృభాషలోనే జరగడం నేడు కళ్ళకు కట్టుతున్న వాస్తవం. పరభాషా మాధ్యమంలో బోధన వలన సేవా రంగంలో కొన్ని ఉద్యోగాలు దొరుకుతాయి కానీ కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుకే పోయినట్లు విద్యార్థుల సృజనాత్మకత నశించి 'ఉత్పత్తి రంగం' కుంటుపడుతుంది.

మన రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్ళన్నింటిలో ప్రాథమిక విద్య మాతృభాష లోనే బోధించాలనే నిబంధన చేయాలి. ఉన్నత పాఠశాల విద్యలో రెండు మాధ్యమాలు ఉండాలి. అప్పుడు ఎవరి ఇష్టప్రకారం వారు తమకు కావలసిన మీడియంలో తమ పిల్లలను చేర్చడానికి అవకాశం ఉంటుంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థేనని నమ్మకం కలుగుతుంది.

(వ్యాసరచయిత డా॥ రామకృష్ణప్రసాద్ కృష్ణాజిల్లా చల్లపల్లిలలో ప్రముఖ వైద్యులు. జనశ్రేయస్సు లక్ష్యంగా ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మెప్పు పొందిన వైద్యునిగా, ఆదర్శ జీవనాన్ని గడుపుతున్న డా॥ ప్రసాద్, డా॥ పద్మావతి దంపతులు అనేక ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.)

దివికుమార్
9440167891

సృజనాత్మకశక్తులు వికసించేది మాతృభాషలోనే!!

మాతృభాషా మాధ్యమ ఆవశ్యకతను నొక్కి వక్కాణించాల్సిన పరిస్థితులు దాపురించిన కారణాన మమ్ములను కొందరు ఇంగ్లీషు భాషా ద్వేషులు అనుకుంటున్నారు. అది నూటికి నూట యాభై పాళ్ళు అబద్ధం. ఎవరైనా తమకు సాధ్యమైనన్ని భాషలు నేర్చుకోవడం చాలా మంచిది. అసలు సమస్య ఇతర భాషలు నేర్చుకోవటంలో లేదు. ఎలా నేర్చుకోవాలి అని తెలుసుకోవడంలోనే ఉంది.

ఏ పరాయి భాష అయినా మాతృభాష ద్వారానే సులువుగా, బాగా నేర్వవచ్చు!! ప్రపంచ దేశాలన్నీ పాటిస్తున్న, పాటించిన నియమం ఇదే. ఐక్యరాజ్యసమితి పదే పదే వక్కాణిస్తున్న, ప్రపంచ దేశాలకు సందేశం ఇస్తున్న భాషా సూత్రం ఇదే. 70 ఏళ్ళ క్రితపు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ కమిషన్ నుండి ఇటీవల విడుదలయిన కస్తూరి రంగన్ విద్యా కమిషన్ వరకు నివేదికలు చెప్పినది కూడా ఇదే!

1964-66ల నాటి కొఠారి విద్యాకమిషన్ అయితే, అత్యంత స్పష్టంగా, మాతృభాషా మాధ్యమంలోనే చదువులు అని మాత్రమే కాక అందరికీ ఒకే తరగతి గది లోనే చదువులు అని కూడా నివేదించింది. దానర్థం కలిగినవారి సంతానం-లేనివారి సంతానం, పెద్ద కులాలు-చిన్న కులాలు అనే భేదం లేకుండా అందరూ ఒకే తరగతి గదిలో మాతృభాషలో చదువుకుంటే నూతన తరాలలో పెంపొందవలసిన జాతీయ సమైక్య భావన, సమగ్రతను సంతరించుకో గలుగుతుందని ఎంతో ఆశతో చెప్పారు. కానీ తరగతిగదులు వేరైన నాటినుండి, విద్యా ప్రైవేటీకరణ పేరుతో రెండు 'గ్లాసుల' చదువులు మొదలైన నాటినుండి నూతన తరాలలో, మరీ ముఖ్యంగా ఉన్నత విద్యావంతులలో కుల, మత ప్రాంతీయ విభేదాలు విద్వేషాలు పెచ్చరిల్లిపోవడం అత్యంత నీచరూపాల్లో నేడు చూస్తున్నాం. ఒక మనిషిని ద్వేషించాలన్నా ప్రేమించాలన్నా "కులం" ప్రాతిపదిక కావటం కన్నా నైచ్యం, సాంస్కృతిక పతనం మరి ఏముంది?

దీనంతటికీ ఒక ముఖ్య కారణం-'మాతృభాషలో, ఒకే తరగతిగదిలో అందరికీ విద్య' లేకపోవటమే!! ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పై రెండింటిని, 1. మాతృభాషలో విద్య 2. ఒకే తరగతి గదిలో విద్య - లేకుండా చేయడమే!!

మాతృభాషలో విద్యా బోధన అన్నది ఒక సెంటి మెంట్- అంటే భావోద్వేగాల- సమస్యగా చాలా మంది భావిస్తు న్నారు. అది అంటే మాతృభాషలో విద్యాబోధన శాస్త్రమే కానీ సెంటిమెంట్ కాదు. ఒక ఉదాహరణ చెప్తాను.

గ్యాస్‌స్టవ్‌లు వాడుతున్న నేటి కాలంలో మనందరం నీళ్లు కాచుకోవడానికి స్టీలుపాత్రలు వాడుతున్నాం. మనలో ఎక్కువమందిమి చిన్నతనంలో పొంత కుండలు వాడిన వాళ్ళమే అయి ఉంటాం. ఇప్పుడు నీళ్లు కాచుకోవడానికి మట్టికుండలు ఎందుకు వాడుకోవడం లేదు? మనందరికీ తెలుసు. మట్టికుండతో అయితే ఎక్కువ గ్యాస్ ఖర్చు అవుతుందని. అదే స్టీలు పాత్రలో అయితే తక్కువ గ్యాస్ తో సులువుగా పని జరిగిపోతుందనీ!! ఆ సులువుకు మూల కారణం సెంటిమెంటు కాదు. శాస్త్రం! ఏమిటది? ఉష్ణానికి విద్యుత్‌కి మంచి వాహకాలు చెడ్డ వాహకాలు ఉంటాయి. విద్యుత్తు ఇనుప తీగలనుండి కూడా ప్రవహిస్తుంది. కానీ రాగితీగలువాడితే (వెండి తీగలు అంత కన్నా మంచివి అనుకోండి) తక్కువ నష్టంతోనూ, ఇనుప తీగలు వాడిదే ఎక్కువ నష్టంతోనూ విద్యుత్ ప్రసరణ జరుగుతుంది. వాటినే మంచి వాహకాలు చెడ్డ వాహకాలు అంటారు. భాషకూడా ఒక వాహకమే. సజీవ వాహకం కనుక దాని చెడు ఫలితాలు చాలా తీవ్రంగానూ విస్తృతంగానూ ఉంటాయి.

తెలిసిన జ్ఞానం ద్వారా తెలియని జ్ఞానాన్ని, తెలిసిన భాష ద్వారా తెలియని భాషను నేర్చుకోవడమే శాస్త్రం!! తెలుగు భాషకు ఎంతో సేవచేసిన సి.పి.బ్రౌన్ తెలుగుభాషని తెలుగుద్వారా నేర్చుకోలేదు. తన మాతృభాషపై ఇంగ్లీష్ ద్వారా నేర్చుకున్నాడు. ఆయనే కాదు సాధారణంగా బాగా సులువుగా నేర్వాలంటే ఎవరైనా చేసేది అదే.

తెలుగునాట ఆంగ్లమాధ్యమం చదువులు ముమ్మరంగా మొదలై 40 ఏళ్లు గడిచిపోయింది. సుమారు 17 లేక 18 ఏళ్ళపాటు ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకున్నప్పటికీ నూటికి తొంభైమంది తప్పులు లేకుండా సెలవుచీటీ కూడా ఆంగ్లంలో రాయలేని పరిస్థితులున్నాయి. అందుకు విద్యా వ్యవస్థ వైఫల్యం కూడా ఒక కారణం. ఫలితంగా జరిగింది ఏమిటి? గడిచిన 40 ఏళ్లుగా ఇటు తెలుగూ రాని, అటు ఇంగ్లీషూరాని మూడు తరాలను మనం సృష్టించుకున్నాం. ఈనాడు తెలుగులో కథ, వ్యాసం, నవల లాంటివి రాస్తున్న వారిలో నూటికి 99 మంది తెలుగు మాధ్యమంలో చదివినవారయి ఉంటారు. రచయితలు అంటే తమ ఆలోచనలను అక్షరబద్ధం కావించే సృజనాత్మకజీవులు. ఎవరికైనా ఆలోచనలు ఆంతరంగిక భావ సంఘర్షణలు మాతృభాషలోనే కదా జరిగేది!! గడిచిన 40 ఏళ్లుగా ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్న తెలుగువారు కోటిన్నర మందికి పైగా ఉంటారు. వారిలో లక్షకొక్కరి నయినా ఆంగ్లంలో రాసే రచయితలను చూపించగలమా? ఎందుకు సాధ్యపడటం లేదు? వారికి తాము చదువుకున్న ఇంగ్లీషు సరిగా రాక, మాతృభాషపై తగినంత పట్టు లభించక విషయ పరిజ్ఞానము, భావ వ్యక్తీకరణ సామర్థ్యమూ తరిగిపోయినందువల్లే. సారాంశం ఏమిటి? సృజనాత్మక శక్తులు వికసించేది మాతృభాషలోనే!! సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు లొంగిపోయిన పాలకులకు, వారిని వారి విధానాలను ప్రశ్నించే సొంత ఆలోచనా తత్వంకల తరాలు పెరగ కూడదనే అనుకుంటారు. వారి పాలనా వైఫల్యాలను ప్రశ్నించేవారు పుట్ట కూడదనే అనుకుంటారు. ఇక ఆలోచించుకోవలసింది మనమే. భవిష్యత్తు తరాలను, వారి సృజనాత్మకశక్తిని పెంపొందించుకుందామా, విధ్వంసం కావించుకుందామా??

(మాతృభాషా మాధ్యమ వేదిక నిర్వహణలో10 జనవరి 2020 నాడు విజయవాడ పుస్తక మహోత్సవ ప్రధాన వేదికపై నిర్వహించిన సభలో జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ చేసిన ప్రసంగ సారాంశం)

'ప్రపంచ తెలుగు భాషా పరిరక్షణ పార్టీ' ని స్థాపించిన కోటిపల్లి సుబ్బారావుగారు



పదేళ్లుగా తెలుగు భాషోద్యమంలో చురుకుగా పాల్గొంటున్న శ్రీ కోటిపల్లి సుబ్బారావు మాతృభాష తెలుగుకోసం ఎంతటి కృషి చేయడానికైనా సిద్ధపడే పట్టుదల గల వ్యక్తి. 'నాబార్డు'(జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు) లో డెప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసి, ప్రజాహిత కార్యరంగంలో తక్కిన జీవితాన్ని తనను తాను అంకితం చేసుకొన్నారు. విశేషంగా అధ్యయనం చేసిన విద్యాధికుడు బి.ఎస్‌సి, ఎల్.ఎల్.బి, ఎం.ఎ. ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి మరియు ఆర్కియాలజీ), ఎం.ఎ (తెలుగు), ఎం.ఎ(జ్యోతిషం) – ఇవీ సుబ్బారావుగారి విద్యార్హతలు. వాస్తు రంగంలో గ్రంథరచయిత. తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్వహణలో జరిగే అన్ని కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలబడుతున్నారు.

ఒక రాజకీయ పార్టీని స్థాపించి పోరాడితేనే తప్ప, మన ప్రభుత్వాలు పట్టించుకోవనే ఆలోచనతో ఆయన ఇప్పుడు 'ప్రపంచ తెలుగు భాషా పరిరక్షణ పార్టీ'ని స్థాపించారు. భాషా ప్రాతిపదికపై విశాల తెలుగు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండీ మన నాయకులు ఏ విధంగా పాలనలో, విద్యారంగంలో తెలుగును పట్టించుకోకుండా ఎంత ద్రోహం చేస్తున్నారో ఆయన పూసగుచ్చినట్లు చెప్పగలరు. ఇప్పుడు ఈ రాజకీయ పార్టీని స్థాపించడంలో కూడా ఆయన ప్రధాన లక్ష్యం – విద్యా, పాలనా రంగాల్లో తెలుగును అత్యంత ఉన్నత స్థితికి తీసుకువెళ్ళాలనే. ఇందుకోసం ప్రజల్లో స్వాభిమానాన్ని, పట్టుదలను పెంచాలని ఆయన కోరుతున్నారు. తగిన వ్యూహాల్ని, కార్యక్రమాన్ని చేపట్టి రాజకీయ రంగంలోని వివిధ పార్టీలకూ, వాటి నేతలకూ కదలికను కలిగించి, వారి గుండెల్లో గుబులు పుట్టించే పరిస్థితుల నిర్మాణానికై తమ పార్టీ పని చేస్తుందనీ కోటిపల్లి సుబ్బారావుగారు ప్రకటిస్తున్నారు. ఆయనలోని నైతిక బలం తిరుగులేని శక్తిని ఆయనకు కలిగిస్తున్నది. ఆయన ఆలోచనలను తెలుగు ప్రజలు సమర్థించాలి. మద్దతునివ్వాలి. సుబ్బారావు గారికి విజయాన్ని కాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

–సంపాదకుడు

వేమనను 'తెలుగుజాతి కవి'గా ప్రకటించాలి



ప్రసంగిస్తున్న ముఖ్య అతిధి ఎం.ఎల్.సి. శ్రీ పి.వి.ఎన్. మాధవ్

ప్రజాకవి వేమనను 'తెలుగుజాతి కవి'గా ప్రకటించాలి అని తెలుగుభాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు విశాఖపట్టణంలో జనవరి 2018న సమైక్యభారతి ఆధ్వర్యాన జరిగిన ఒక సభలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హేతువాది, తెలుగువారిని అభ్యుదయ మార్గంలో నడుపడానికి తేట తెలుగులో అందరి నోళ్లలో నడయాడే విధంగా పద్యాలను అందించిన ప్రజాకవి వేమన అని అన్నారు. ఆయనను తెలుగుజాతి కవిగా ప్రభుత్వం ప్రకటించి పొరుగు భాషల వారివలె మనమూ ముందడుగు వేయాలని ఆయన అన్నారు. 2006 లోనే తిరుపతిలో జరిగిన తెలుగు బ్రహ్మోత్సవాలలో తాను ఈ విన్నపాన్ని వేలాదిమంది పాల్గొన్న సభలో ప్రకటించగా అందరూ సంతోషంగా ఆమోదిం చారని, దీనిని నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీ.శే. రాజశేఖరరెడ్డి గారికి తెలుగుభాషోద్యమ సమాఖ్య సంస్థాపక అధ్యక్షుడు కీ.శే. సి.ధర్మారావుగారి ఆధ్వర్యంలో సమాఖ్య ప్రతినిధి బృందం నివేదిం చిందని సభకు తెలియజేశారు.

విశాఖపట్టణం కేంద్రంగా రాష్ట్రంలోని పలు తావుల్లో తరచూ సభలు నిర్వహిస్తూ తెలుగుభాషా సంస్కృతుల ప్రచారానికై పని చేస్తున్న సామాజిక చైతన్య సంస్థ 'సమైక్యభారతి' పి.కన్నయ్య మాట్లాడుతూ జనవరి 18న వేమన జయంతితోపాటు శ్రీకృష్ణదేవ రాయల పట్టాభిషేకం, నందమూరి తారకరామారావు నిర్యాణం కూడా ఆ రోజున కలిసి వచ్చినందున, మూడు సందర్భాలనూ కలిపి 'తెలుగు మహనీయుల స్మరణీయ మహోత్సవం' పేరిట నిర్వహిస్తున్నామని ప్రకటించారు. సభకు రచయిత శ్రీ మేడా మస్తాన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిధిగా ఎం.ఎల్.సి. శ్రీ పి.వి.ఎన్. మాధవ్, విశిష్ట అతిథులుగా మాజీ ఎం.పి.డా॥ డి.వి.జి. శంకరరావు, ప్రముఖ మానసిక వైద్యులు డా॥ మోపిదేవి విజయ గోపాల్, ఆచార్య సి. మంజులత పాల్గొని ప్రసంగించారు.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

తెలుగు, తెలుగేతర గిరిజన తెగల భాషా సాహిత్య నిర్మాణ విశేషాలు

భాషాశాస్త్రజ్ఞులు మధ్యద్రావిడంలో తెలుగేతర భాషలమీద పనిచేస్తే, సాహిత్యవేత్తలు తెలుగు మాండలికం మాట్లాడే తెలుగు తెగలమీద పనిచేశారు. మానవ శాస్త్రవేత్తలు అన్ని తెగలమీద ఎత్నోగ్రాఫ్‌లు తయారు చేసారు. ఈ మూడు విభాగాలలో జరిగిన కృషికి సమగ్రరూపం ఇస్తే, తెలుగు భాష ప్రాచీనతతో పాటు, విస్తృతి కూడా వెలుగు చూస్తుంది. మధ్యద్రావిడ భాషల పదసంపదతో కూర్చిన తెలుగు వ్యుత్పత్తి పదకోశం తులనాత్మక అధ్యయనాన్ని సుగమం చేస్తుంది.



'ఒక కొత్తభాషను కనుక్కోవటం, దానికి వ్యాకరణం రాయటం, ఒక పద్యం రాసిన దానికన్నా మంచిది' అని తోచి, భద్రిరాజు కృష్ణమూర్తి, తెలుగు భాషకు ఎంతో సేవచేసిన ఉన్నతాధికారి జాన్ గ్విన్ ద్వారా లభించిన ప్రభుత్వ సహకారంతో, విశాఖ జిల్లా అరకు లోయలో కొండదొర కుబి భాష మీద పరిశోధన చేసారు. ఈ కుబి మధ్య ద్రావిడ భాషలలో ఒకటి.

మధ్య ద్రావిడ భాషలు

ద్రావిడ భాషా పరివారాన్ని దక్షిణ, మధ్య, ఉత్తరభారత దేశంలోగల మూడు పెద్ద ఉప కుటుంబాలుగా విభజించవచ్చు. మధ్య ద్రావిడంలో పదకొండు భాషలున్నాయి. తెలుగు, ఆదిలాబాదు జిల్లాలో, దానికి పొరుగు రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలలో గోండి (కోయ దీని మాండలికం) నాయకీ' కొలామి (కొలామి మాండలికం నాయక్డి); ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలోని సుకమలో పర్జి; ఆంధ్ర, ఒడిసా రాష్ట్రాల సరిహద్దులోని పెంగో, మండ, గదబ (ఒల్లరి, సాలూరు మాండలికాలు), కూయి, కువి భాషల, వాటి మాండలికాలు మొత్తం 24 ఉన్నాయి. ఇవి కాక ఆంధ్రప్రదేశ్‌లో గల సవర, జాతాపు, ఎరుకల తెగలకు వారి భాషలు వారికున్నాయి. ఇరు రాష్ట్రాలలో గల బంజారాలు వేరే భాషా కుటుంబానికి చెందినవారు.

తూర్పు కనుమలు, కొండ భాషలు-మాండలికాలు, భాషా సాహిత్యాలు

'కొండభాషలకు మాండలికాలు ఎక్కువ' అని భాషావేత్తల

నిర్ధారణ. వాటిని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతపై 'సమగ్రము, నిర్దుష్టమూ అయిన ద్రావిడ భాషా చరిత్ర రాయడానికి అనాగరిక భాషా సామగ్రి అవసరం. **కొండ భాషా పదానికి అర్థం తెలుగు పదం వల్లనే చాలావరకు తెలుస్తుంది.** సాహిత్యం విషయంలో ఈ భాషలకు ప్రాధాన్యం లేకపోయినా, భాష పారిశ్రామిక సమాజాలలో వలె వేగంగా మారదు. అన్ని ద్రవిడ భాషలలో జారిపోయిన ర, బండి ఱ అక్షరాల ఉచ్చారణ భేదం కొండభాషలో నిలిచి ఉండటం దీనికి తార్కాణం' అని భద్రిరాజు పేర్కొన్నారు. 'లిపి లేకపోయినా గోండి భాష చాలా పరిపుష్టమైన సుందర భాష' అని సుబ్రహ్మణ్యం అభిప్రాయం. భాష ముందు, లిపి తరువాత. భాషతో పాటు సాహిత్యం కూడా ఉంటుంది. అవి పరిశోధకుడి కృషిని బట్టి లభిస్తాయి. మానవ శాస్త్రవేత్త హైమెండర్ఫ్, మైకేల్ యార్క్ గోండి సాహిత్యం రికార్డు చేసినందువల్ల గోండి 'సాహిత్యం విషయంలో ప్రాధాన్యత గల' 'పరిపుష్టమైన భాష' అని తెలిసింది. అదే హైమెండర్ఫ్ చెంచులను, కొండరెడ్లను అధ్యయనం చేసినా, వారి సాహిత్యం సేకరించలేదు. అంటే ఈ తెగలకు 'పుష్టి' గల సాహిత్యం లేదని కాదు. భద్రిరాజు గురువు ఎమనోవ్ నీలగిరి తోడా తెగవారి పాటలు కూడా సేకరించారు.

తెలుగు గిరిజన భాషా మాండలికం

భద్రిరాజు కొండదొరల కువి భాషను అధ్యయనం చేసిన అరకు ప్రాంతం పక్కనే గల పాడేరు, చింతపల్లి గూడెం ప్రాంతాలలో కొండదొరలు, బగతలు, వాల్మీకులు, కొండ కమ్మరులు తెలుగే మాట్లాడతారు. కొండ కుమ్మరులు తెలుగే మాట్లాడతారు గాని ప్రభుత్వం వారిని తెగగా గుర్తించలేదు.

సేకరించిన కథల నుండి నెలలు, పండుగలు, వివాహ పద్ధతులు భద్రిరాజు పేర్కొన్నారు. ఈ పండుగ గేయగాథలు, సాహిత్యం ఈ తెలుగు ప్రాంతాలలో దొరికాయి. విశాఖ మన్యం పక్కన గల తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కొండ ప్రాంతాలలో కొండరెడ్లు, వాల్మీకులు, కొండకమ్మరులు నన్నయ యుగం తెలుగు మాట్లాడతారు. వీరిమధ్య, పొరుగున ఉన్న కోయలది గోండి మాండలికం. నల్లమలలో చెంచులు, ఆ మలలకింద ఉండే యానాదులు మాట్లాడేది, తెలంగాణంలో గల నాయకపోడు తెగ మాతృభాష తెలుగే.

'దుర్గమాలైన మహానదులు, పర్వత పంక్తులు, అరణ్యాలు, రెండు భాషా ప్రాంతాలను వేరుచేస్తూ ఆయా వ్యవహర్తల రాకపోకలకు ఆటంకాలుగా ఉన్నంత వరకు, అవి కూడా భాషా మండలాలకు సరిహద్దులౌతాయి. ఇటీవల రాకపోక సౌకర్యాలు పెరిగి పరిస్థితి కొంత మారినా, పూర్వచరిత్రలో ఏర్పడ్డ మాండలిక భేదాలు అంత తొందరగా మాసిపోవు' అని నిర్వచించిన శాస్త్రజ్ఞులు, కొత్త భాష మోజులో ఈ తెగ తెలుగుమీద దృష్టి సారించలేదు. మాండలిక వృత్తి పదకోశాలు తయారు చేసేటప్పుడు కూడా ఈ తెలుగు తెగల ప్రస్తావన లేదు. ఆ ప్రాంతాలకు పోలేదు. ఇటీవల మాతృభాషలో విద్యాబోధన కోసం వాచకాలు తయారు చేసినప్పుడు కూడా తెలుగు మాండలికం మాట్లాడే తెగలను పట్టించుకోలేదు.

భాషా పరిశోధకులు - సాహిత్య సేకరణ విశ్లేషణ

కానీ ఆ తెగల సాహిత్యం సేకరించిన పరిశోధకులు తమకు చేతనైనంతవరకు భాషా విశేషాలు కూడా పేర్కొన్నారు. భాషా శాస్త్రం కుదురు నుంచి రూపుదిద్దుకున్న సాహిత్య నిర్మాణ విధానం (`structuralism) లోని జ్ఞానం, సంజ్ఞానం (cognition), అర్థ పరిణామం (semantic domain), నమ్మకాల దొంతరలు (belief system) వంటి వివిధ కోణాలను ఆవిష్కరించి, ఈ తెగలు తెలుగు సంస్కృతి పునాది శిలలని నిరూపించారు. కొండరెడ్లు, చెంచులలో యువతరం సంప్రదాయ సాహిత్యాన్ని సేకరించి ప్రచురించారు. అంతేకాదు భాషా శాస్త్రవేత్తలు కూర్చిన వృత్తి పదకోశాలను శాస్త్రజ్ఞులకు సంప్రతింపు గ్రంథాలుగా, పాఠ్యపుస్తకాలుగా తీర్చిదిద్దుతున్నారు.

భాషా శాస్త్రజ్ఞులు మధ్య ద్రావిడంలో తెలుగేతర భాషల మీద పని చేస్తే, సాహిత్యవేత్తలు తెలుగు మాండలికం మాట్లాడే తెలుగు తెగల మీద పనిచేసారు. మానవ శాస్త్రవేత్తలు అన్నితెగల మీద ఎత్నోగ్రఫిలు తయారు చేసారు. ఈ మూడు విభాగాలలో జరిగిన కృషికి సమగ్ర రూపం ఇస్తే, తెలుగు భాష ప్రాచీనతతో పాటు, విస్తృతి కూడా వెలుగు చూస్తుంది. మధ్యద్రావిడ భాషల పదసంపదతో కూర్చిన తెలుగు వ్యుత్పత్తి పదకోశం తులనాత్మక అధ్యయనాన్ని సుగమం చేస్తుంది.

విశాఖ, ఉభయ గోదావరి జిల్లాలలో తెలుగు గిరిజన భాషా మాండలికం మాట్లాడే కొండదొర, బుగత, కొండరెడ్డి, వాల్మీకి, కమ్మరి, కొండకాపుల మాండలికంలో విశేషాలను, సాహిత్య నిర్మాణంలో సూత్రాలను వారిమీద ఈ రచయిత అధ్యయనం 'తెలుగు గిరిజన గీతాలు' పరివర్ధిత ముద్రణ 'కొండకోనలో తెలుగు గిరిజనులు' ఆవిష్కరించింది. 'కొండ (తెలుగేతర) భాషా పదాకి అర్థం తెలుగు పదం వల్లనే చాలావరకు తెలుస్తుంది' అన్న భద్రిరాజు పరిశీలన ఈ అధ్యయనం అవసరాన్ని నొక్కి చెప్పింది. అలాగే తెలుగు పదాలు / వాడుకలు తెలుగేతర భాషలు, ఆచారాలు తెలిస్తే బాగా బోధపడతాయి.

విశాఖ, ఉభయ గోదావరి జిల్లా తెగల తెలుగు మాండలికం తీరు తెన్నులు

గిరిజన ప్రాంతాల తెలుగు మాండలికపు తీరుతెన్నులను నాలుగు భాగాలుగా పరిశీలించవచ్చు.

వర్ణసంబంధి : ప్రమాణ భాషకు గల వ్యాప్తి గిరిజనుల వ్యవహారంలో అధికంగా కనిపించదు. మాండలిక ప్రభావం తెగలవారీగా మారుతుంటుంది. ఉదాహరణకు కొన్ని మాత్రమే ఇక్కడ స్వీకరించడం జరిగింది. వీటిని ధ్వని మార్పులు, ఉనికి ఉచ్చారణ మార్పులుగా విడదీసి చూడవచ్చును.

1) ఉభయ గోదావరి జిల్లాల్లో కొండరెడ్ల మాండలికంలో ధ్వని మార్పు :

అ   అయి (ఐ)

ప్రమాణ భాష - గిరిజన భాష

వస్తాను - వైతాను

బస్తా - బైత

బస్తరు - బైతరు

సంయుక్తాలు అసంయుక్తాలుగా మారడం.

కుండాడ నుండి ఉప్పునపల్లి గట్టు వరకు (గోదావరి) ఈ రూపాలు వినిపిస్తాయి. తాడేపల్లి ప్రాంతంలో వినిపించేవి సమీకరణ చెందిన ద్విత్వరూపాలు. వత్తను, బత్తా, బత్తరు.

2)ఉనికి ఉచ్చారణ మార్పులు : గిరిజనుల వ్యవహారంలో ప్రమాణభాషకు భిన్నంగా కొన్ని ప్రత్యేక క్షణాలు కనిపిస్తున్నాయి.

ఉదాహరణకు కొన్ని : సాధారణంగా తెలుగు భాషలో ప్రథమాక్షరం మీద ఊనిక ఉంచడం సహజం. దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కొన్ని అధిక లయగల రూపాలు వినిపిస్తున్నాయి.

ఏల - సూత్తువేమో

ఊనికను రెండవ అక్షరంపై మార్చే ప్రయత్నం ప్రచురం.

దిగువవారు గెద్దాడ అంటే కొండరెడ్లు గెడ్డవాడ అంటారు.

అలాగే కుండాడ - కొండవాడ

ఇలా కాలక్రమంలో కలిసిపోకుండా ఉండడమేకాక - వారికి ఒక ప్రత్యేకమైన ఊనిక ఉండడం గిరిజన భాషలో ప్రచురం.

సాగరాంధ్రంలో వలె పదాల చివర దీర్ఘాలు తీయడం గిరిజనులలో వినిపించదు. ఈ పలుకు తీరులోనే కాక, పదజాలంలో కూడా తెలంగాణం మాండలిక రూపాలని పోలి ఉండడం గమనించ దగిన విశేషం.

తెలుగు భాషకు ప్రాచీన లక్షణమైన అర్థానుస్వార రూపాలను, పూర్ణానుస్వారంతో పలకడం ఇప్పటికీ తమిళనాడు, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలోనే కాదు గిరిజన వ్యవహారంలోనూ ఉంది.

కోంతి (కోతి), ఆంపు (ఆపు), తాణ్ణేపల్లి (తాడేపల్లి), నూరుపూణ్డి (నూరుపూడి) ఇవేగాక తెలుంగు, వెలుంగు, పెండ (పేడ) వంటివి మాత్రమే కొండరెడ్లలో వినిపిస్తాయి.

పదసంబంధిత : ప్రమాణ వ్యవహారానికి భిన్నంగా కొన్ని ప్రయోగాలు కనిపిస్తున్నాయి. వ్యతిరేకక్త్వార్థక రూపాలకు బదులు యకార రూపాలు కనిపిస్తున్నాయి.

ధాతువు	వ్యతిరేకక్త్వార్థకం	గిరిజనులు
ఊడ్చు	ఊడ్వక	ఉడియక
జడుపు	జడవక	జడియక
విడుచు	విడువక	విడియక

అనునాసికాంత ధాతువులలో (అను, విను, కను, కొను) కాలప్రత్యయం చేర్చేటప్పుడు మూర్ధన్యీకరణం జరుగకుండానే రూపాన్ని సాధించడం.

ధాతువు	ప్రమాణ భాష	గిరిజన భాష
అను	అంటాము	అంతాము / అంతిమి
తిను	తింటాము	తింతాము / తింతిమి
కొను	కొంటాము	కొంతాము / కొంతిమి

3)మూర్ధన్యాక్షర రూపాలు తెలుగు భాషకు గల ప్రాచీన లక్షణాల్లో ఒకటి. గిరిజనుల వ్యవహారంలో ఈ క్షణాన్ని నింపుకోవడం కద్దు.

ప్రమాణ భాష	గిరిజన భాష
తంగేడు	టంగుడు
దోకి	డోకి
దిప్ప	డిప్ప
దాగు	డాగు

4)తద్భవాలుగా శబ్దరూపాలు మారేటప్పుడు కొన్ని ఆసక్తికరమైన మార్పులు వినిపిస్తాయి.

జూదం	జూజం	: ద	జ		
ఓగిరం	ఓరెం	: గ	ం		
ఉహ	ఉగ	: గ	హ		
కన్యకు	గన్నికు	: క	గ	న్య	న్న
జధి	జల్డి	: వర్ణచ్యుతి			
ఉద్యోగి	ఉద్దెగాడు	: ద్య	ద్దె		
కొయ్యలు	కయ్యలు	: ఇవి అచ్చ తెలుగు పదాలు			
లంకెలు	లెంకలు	: కాని వాని ఉచ్చారణ మారింది			

5)పదాదానం : పరిసర భాషలైన ఒరియా, కోదు, కోయభాషల పదాలు చాలా ఈ మాండలికంలో జొరబడ్డాయి.

కరవడి	: చివరి (విశాఖ)
జుగుడి	: చిరుతిండి (విశాఖ)
జువతబాబు	: చిన్న నాయన
మోరి	: అడ్డాకులతో కుట్టిన కోటు (విశాఖ)
మోర్ద	: పందికొక్కు (గోదావరి)
ఘూటు	: 15-16 ఏండ్ల కుర్రవాడు (గోదావరి)
సొండ	: పెదవు
జియ	: యొడువాడు

6)బాంధవ్య పదాలు :

వదినకు పాప. తమ్మ అనగా బావమరది.

మనుమలు చేయడం - పెండ్లికూతురును చేయడం.

7)సమాస నిర్మాణం : కొండసంత మండువ, నూనెకొప్పుల పొన్నచిలుక, దిప్పె మక్కలకొరువ, దొప్పసేసలు, కోనేటిపళ్ళేలు, తూరురాయికట్టువ, వేలుబుంగలవేపి, పులిబరుకుడుమానువంపు, కత్తురాళ్ళఘాటి, పండుమక్కలబొట్టె, కిందోకి (కన్నెదోకి) లోతుగడ్డ, కన్నెఘాటు, పోతబూరం, ఆడకట్టు (ఆడమళయాళం), అడవికట్టు, మాయరతం (విమానం), టెంకగిడుగు, తోకగిడుగు' ఉండవిలుబద్ద (ఉండేలు) నారవిలుబద్ద.

ఇరుబలపన్నె = దువ్వెన' గుమ్మాలవాడు = మలేరియా వర్కర్'

గుమ్మం వద్ద కాగితం మీద తను వచ్చినట్లు సంతకం పెడతాడు. వాడే ఆకురాత వాడు, మచ్చలు (టీకాలు) వేయువాడు. అతనిని తనిఖీ చేయడానికివచ్చే సూపర్‌వైజర్ చేసేపని కనిపించలేదు కాబట్టి వాడికి సొంత పలుకుబడిలో పేరులేదు. సూపులేరు అంటారు. కణుసుమొరకలఎండ = మొరక (చెవి) జన్నెలు (వరుగులు) కణుసు చెవులవలె ఎండిపోతాయి.

ఎర్రగాయరొండి = మామిడికాయను ఎర్రపరిచే (పండానికి ముందు) రోహిణి. (రొండి రోహిణిగా సంస్కృతంలోకి చేరినదా లేక రోహిణి-రొండిగా మారినదా!)

8) శబ్ద పల్లవాలు :

కొండపెట్టడం = కొండకు అగ్గిపెట్టడం

పొట్లంపెట్టడం= పొట్లం పెట్టి వండడం. పొట్లంవేయడం

కబురుకట్టడం= టపా తీసుకుపోవడం,

పులిదెంగింది= కర్మ కాలింది.

తులుసూరు పలిగినపుడు= తులుసూరు చిగురించినపుడు, కొన్ని చిగుళ్ళు పగిలినట్లే విచ్చుకుంటాయి.

సామిపిట్టలు వెలిసినపుడు = అవి దేవుని పిట్టలు కాబట్టి అవి కనిపించడం - వెలువడడం.

అడవికి పారడం = రజస్వల కావడం, ఇప్పుడు రజస్వల అయిన కన్యను అడవికి పంపకపోయినా ఈ శబ్దపల్లవం వ్యవహారంలో ఉంది.

చెయ్యిలు వార్చుకోవడం= భోజనానికి రమ్మని పిలవడం.

9)జీవన విధానం, సంస్కారంతో పాటు నుడికారం, ఆచారం కూడా మారుతుంది. గోదావరిలో కొత్తలు కలపడం. విశాఖలో వెన్నులు ముంపడం.

10) తద్ధిత ప్రత్యయాలు క్రియలో లోపించడం. దొంగతనం చేయడం అని మనము, దొంగసేయడం అని గిరిజను' ఇల్లు సేయడం, తప్పుచేయడం, గౌరవ సేయడం. గౌరవతనం అనే స్వతంత్ర ప్రయోగం కూడా ఉన్నది.

వడిసెల, సెలయేరు, సెకపడం, సెలమళ్ళడం.

సెల= రాయి (ఈసెల సంస్కృతాన శిలగా మారినదా!)

దాయం మూటకూడు : సోపువేట వెళ్లినవారు మునసబుకు ఇచ్చే మాంసంవాటాదాయం (దాయాదులనగా పాలివారు). గ్రామపెద్ద అయిన మునసబు, గ్రామంలో తక్కినవారు ఒకనాడు పాలివారని ఊహించడానికి ఈ దాయం పదం అవకాశం ఇస్తున్నది.

11) తరచుగా వినిపించే పదాలు :

చెల్ల = మొత్తం, పల్లక = మాడక;

పల్లకాయిడి = నోరు మూసుకున్నాడు

(వేలో 'శిపశీలన' అనగా నిశ్శబ్దం అని హెచ్చరిక)

మోయుమి= తీసికొనిపో, ఏరుకొని = తీసికొని

జల్లివేయడం= పారజల్లడం' కొండతేలడం= దాటిరావడం

డెక్కడం= తీయడం 'తిన్నమ్మ తినిపోతే తలుపు డెక్కినవాడికి తంటా'

దసులు= తారసపడడం' తగులు =వెంటపడు, తరుము

దాచిడుకున్నడు= దాచిపెట్టుకున్నాడు

ఈడబెట్టిరమ్మీ = దించిరా, తీసి తెచ్చుకున్నాడు

నెత్తి దూసుకోవడం, పదును పూసుకోడం.

క్రియకు చేసిడి, వచ్చిది ఈ విధంగానే ప్రయోగం.

12) యడాగమం : నయ్యిది, మయ్యిది' నాది, మాది.

13) జననిరుక్తి : తబిసికొండ = తబిసి చెట్లున్న కొండ.

కాని అక్కడ శ్రీరామరాజు తపస్సు చేయడంవలన తపసుకొండ అయింది. వాలి కొండ ప్రక్క గ్రామంపేరు ఇప్పటికీ వాలగూడెమే. కాని వాలకొండ సంస్కృతీకరణంలో వాలికొండ అయి - ఇది వాలిసుగ్రీవు రాజ్యం - ముక్కుల, మూతులతో తేడా ఉండే ఇది వానరజాతి, ఇలా కథలు పెరిగాయి. ఇది దండకారణ్యంలో కిష్కింధరాజ్యం అనే అనాది భావనలకు ఊడలుదించాయి.

3. వాక్యసంబంధమైన విశేషాలు= కారకపరమైనవి. ప్రత్యేకంగా పేర్కొనదగినది. 'నిన్ను పిలుస్తున్నారు' అనే ప్రమాణభాషా ప్రయోగానికి బదులుగా 'నీకి పిలువడమట' విం ప్రయోగాలు - భావార్థంలో వర్ణకం. ద్వితీయకు షష్టిరావడం నన్నయనాటి ప్రయోగాలు.

4. అర్థ విపరిణామం= చేవడిబస అనగా నేడు కల్లు బస అని అర్థం.

వెనుక గ్రామ నౌకరులైన వాల్మీకులు కల్లు అమ్మేవారు. ఆ నౌకరు కచేరీ చావడి బసన ఉండేవాడు కాబట్టి వాడు చేవడు. చివరకు చేవడి బస కల్లు బసగా దిగిపోయింది (అర్థ సంకోచం).

వేట అనగా మనలో సాధారణంగా జంతువుల వేట అని మాత్రమే స్ఫురిస్తుంది. కాని దుంపలవేట, మొయ్యలవేట (చేప, ఎరక, ఎండ్రికల వేట). ఇలా ఆహార సేకరణ పరంగా విస్తృతమైన అర్థంలో వేట అనే పదానికి ప్రయోగం. ఎవరు ముందుగా పట్టుకుంటే, ఎవరు తవ్వితే, అమ్ముమేస్తే వారిదే అది అనే వేట నియమాలే వీటన్నిట వర్తిస్తాయి (అర్థవ్యాకోచం).

సాధు ప్రయోగం :

జరిగిపోయిడి = కాలం చేశాడు.

ఉపవాసం తీర్చారు = ఉపవాసం తరువాత భోజనం చేశారు.

కడుపు కదిలింది = బయలుకు వెళ్ళాలి.

సంస్కృతి పరిణామాన్ని, వాఙ్మయంలో ఇముడ్చుకున్న గిరిజనుల ప్రయోగాలను సేకరించి, వాటి జీవశక్తిని ఆకళించు కొన్నప్పుడే మన తెలుగు తనం వృద్ధి చెందుతుంది.

ప్రకృతి - సంస్కృతి' మనోమయ ప్రపంచంలో వేదిక' వర్గీకరణం

విశ్వప్రపంచాన్ని ప్రకృతి అనీ సంస్కృతి అనీ విభజించ

వచ్చు.ఈ సంస్కృతిలో కొంతభాగం విశ్వజనీనమైనా,ఒకో సమాజం ఒకోవిధంగా తన సంస్కృతిని మలచుకుంటుంది.'

ప్రకృతిలో మానవుని కృషి, సంస్కృతిగా రూపు దిద్దుకుంటుంది. మానవుడు శాస్త్రం ద్వారా ప్రకృతిలోకి ప్రవేశిస్తాడు. ప్రకృతి కళద్వారా మానవునిలోకి ప్రవేశిస్తుంది. మనిషి తన సంకల్పాలను, ఆకాంక్షలను పదాడంబరంతో, అభినయంతో, చిత్రాలతో కళాత్మకంగా వ్యక్తం చేస్తాడు. ఈ కళలలో సాహిత్యానిది ప్రముఖపాత్ర. ప్రతి శాస్త్రానికి ఒక పరిభాష ఉంటుంది. కాలానికి గంటలు, గడియలు' సంగీతానికి సరిగమలు' భూగోళానికి అక్షాంశ, రేఖాంశాలు మొదలుగా గల ఉహాజనిత పరిభాషను ఏర్పరచుకున్నట్లే, ప్రకృతిలో అడవి కొండరాజులది. నీరు జలకన్యది. సంస్కృతిలో పంట భాగ్యాలు పాండవులవి అని స్థూలంగా మనసు అధిదేవతలతో, మనోమయ ప్రపంచంలో ఒక వేదికను సంస్కృతి సిద్ధం చేసుకుంది. వారికి ఆయా భాషలలో, వాటి మాండలికాలలో వేరు వేరు పేర్లుండ వచ్చు. కాని మనో వ్యాపారం ఒక్కటే.

సంస్కృతి - సాహిత్యం - నమ్మకాలు × న్యాయాలు

ఈ వనరులను వాడుకునే ముందు వారికి మొక్కాలి. నివేదించాలి. హెచ్చరించాలి. కొండంత దేవుడికి కొండంత పత్రి పెట్టలేము. అద్దంలో చందమామను చూపి పసిపిల్లను బుజ్జగించినట్లు, ఇచ్చిన దానితో తృప్తిపడమని నచ్చచెప్పాలి. భాషలో పదాలు ఆయా వస్తువులను, భావనలను తలపుకు తెస్తున్నట్లే, కర్మకాండలో చెట్టూ, చేమా, వస్తువులు వాటి వాటిలో సామ్య-వైషమ్యాలను బట్టి ఆయా అధిదేవతలకు ప్రతినిధులౌతాయి. ఆయా వస్తువులను సేకరించి, సమర్పించి, ప్రకృతి-సంస్కృతి అంటే కొండరాజులకు-పాండవ రాజులకు మధ్య ఘర్షణ నివారిస్తున్నట్లు, చివరకు తాము అంటే పాండవులు గెలిచినట్లు, ద్రవరూపంలో ఉన్న కల్లును కన్యలనుండి తప్పించినట్లు, కవితలల్లి, ఆయా దేవతల వేషాలు వేసుకుని, ఆట పాటలతో సుఖాంతంగా అభినయించి, వారు అనుగ్రహించినట్లుగా విశ్వసిస్తారు. ఈ తతంగం ఆచారంగా, నమ్మకంగా కొనసాగుతుంటుంది. సామ్య వైషమ్యాలను బట్టి విస్తరించే ఈ నమ్మకాల వ్యాప్తిలో అందదుకులను' బీరకాయ పీచు, శాఖా చంక్రమణం, కాకతాళీయం, బాదరాయణ సంబంధం, బోడిగుండుకు మోకాలికి ముడివేయటంగా జానపదులు ఎంచుతూ తగువులు చేసేటప్పుడు బూటకపు చుట్టరికాలుగా తీసిపడేస్తారు.

తూర్పు కనుమలలో అధిక వర్షపాతం, సారవంతమైన మట్టి గల ఉత్తర భాగంలో పోడు వ్యవసాయం ఎక్కువ. దక్షిణాన గల నల్లమలు వర్షచ్ఛాయా ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడి తెగలు చెంచులకు ఆహార సేకరణ ప్రధాన జీవనాధారం. అందువల్ల పంట భాగ్యాలతో ముడిపడిన పాండవరాజులు వారి తంతులో కనిపించరు. అలాగే దేశ కాలాలతో ముడిపడిన కవిసమయాలు, ఉదాహరణకు చలిదేశాలో warm welcome, pure as wine ఉష్ణ దేశాలైన మనకు నప్పవు.

రేయింబగళ్ళు, క్రూర జంతువులు-సాధుజంతువులు, పచ్చి-పండు, వేడి-చలువ' పచ్చిది-కాల్చినది

ప్రకృతిలోగల ఈ ద్వంద్వాత్మక వైరుధ్యాన్ని (binary), కుడి-ఎడమ' శుభం-అశుభం' మంచి-చెడ్డలుగా సంస్కృతి వర్గీకరిస్తుంది.

విధానం, సంకేతాలు, వస్తువులు

కుడి × ఎడమ; శుభం × అశుభం; బొట్టు × వాత; ప్రదక్షిణం× అప్రదక్షిణం; సవ్యం × అపసవ్యం; అక్షతలు(పసుపు) × అక్షతు (తెలుపు) దేవతలు; నల్లనువ్వు (పితృదేవతలు) ; నివ్వాళి × కొంగుపతికడబ్బు ; నేరేడు × పరిమి ; పూజ × చెడుపు ; పీనె × పాడె ;

చెట్లు, జంతువు, దేవతలు

పరిమి- పెతరలు, వేగిస - మావెలి, నేరేడు - భూదేవి, సంకుదేవుడు, జీలుగు - పాండవు, కన్నెజీలుగు - కన్నెలు, అరి పువ్వు కేసరాలు - హనుమంతుపగడ (సత్తెవిత్తనాలు), రెల్లపూలు-గంగాలమ్మ, దేవగుమ్మడి - దేవతలు, మంచిగుమ్మడి - మానవులు, సరితేనె -మల్లమ్మగడ్డ, ఒంటరికణుసు - అడవి రాజులు, పుట్టకూడు - జాంబవంతుడు, రివ్వబెత్తులు - శివసార్లు, చేప, తాబేలు, కప్ప, ఎంద్రిక - జగన్నికలు, తొండ, బల్లి, డొక్కి, ముంగిస - గురువులు, అడవి జంతువులు - అడవి గొల్లలు, క్రూర జంతువులు - దానుగుడు, ఆరెమాను - అర్జునుడు, కొండగొర్రె - రాజుల కోలగాడు, వేంత - పక్షులలో కోలగాడు, తిత్రికపిట్ట - చెడుపు ముండ, వేటగుంజి (గుడ్లగూబ) - పక్షులలో రాజు, బింగిరాజు (మైనా) - బ్రాహ్మణుడు, రాచెలుక (శాకాహార అడవిజంతువు) - దానుగుడు , (సాధుస్వరూపం) చెదలు - నందమ్మ, దేవరిపిట్ట (వడ్రంగి) - మంచి శకునం, అన్నుగోగిద్ద (తేనెల తెరవడు) - దుశ్శకునం, ముహూర్తగాడు - మోర్ధ (పందికొక్కు), దోసం - పండుగ, ప్రకృతి - సంస్కృతి, నిషేధం - అనుమతి, దానుగుడు (అడవి రాజులు) - పాండవ రాజు, అమ్మతల్లి - జాంకరి, మావెలి - గొంతెమ్మ, నందమ్మ, బాసలు - కొత్తలు, ఉడికించడం - వేయించడం, మారుపేర్లు (నిందాస్తుతి) - స్తుతినింద, రూపకం - రూపకం,

నమ్మకాల దొంతరలు :

1. నూలు పోగు నూరు వరహాలు - పన్నెండు రాటల పందిరి చుట్టూ బిళ్ళనూలు చుడతారు, మిడతరూపున వచ్చిన పెతరకు దినకార్యం జరిపిస్తామని నూలుపోగు కడతారు (పెతర)

2. నేరేడు (సంకుమాను) - ఇరికి తొలిరాట, నేరేడు కింద దేవుడు బస, శుద్ధికోసం నేరేడు మండతో నీళ్లు జల్లుకుంటారు, వధూవరులు నేరేడు బల్లమీద కూర్చుంటారు, నేరేడు కర్రతో పెళ్లికానివారు పలుకర్ర చేయకూడదు.

3. పందుపిల్లికి జీలుగు కల్లు ఇష్టం -పందుపిల్లి, జీలుగ స్నేహితులు, పందుపిల్లి చంపినవాడు చెట్టెక్కితే కల్లు తగ్గిపోతుంది

4. మనుషలను తినేది మావెలి - వేగిస చెట్టు నరికితే ఎర్రగా జిగురు వస్తుంది, వేగిస బొండల మీద బోనం.

5. కోలగాడు ఎదురురావడం దుశ్శకునం, కోలగాడు మాలవాడు, మాలవాడు ఎదురురావడం దుశ్శకునం, కొండరాజుల కోలగాడు కొండగొర్రె, కొండగొర్రె అరిస్తే దుశ్శకునం.

6. పరిమి – పరిమి ఆకుల్లో రాజులకు పెతర్లకు మాంసం నైవేద్యం పెండతారు, చచ్చినవాడి దయ్యం వెంటరాకుండా స్మశానం దారిలో పరిమి ముల్లు వేస్తారు.

7. తిత్రికపిట్ట రెట్టలో విత్తనానికి రణం మొలుస్తుంది. అసలు చెట్టు క్షీణిస్తుంది, తిత్రిక పిట్ట పక్షి ప్రపంచంలో 'చెడుపు' ముండ. 'చెడుపు' ద్వారా శరీరంలో, భూమిలో 'తాపడం' ప్రవేశపెడతారు, గొరవలు, వెజ్జులు శివసారులు ఈ 'తాపడం' తీస్తారు.

8.సంస్కారాలు :

ప్రకృతి : భూమికి బొద్దు – ఆకసానికి అద్దు...చేమదుంప, చేమ ఆకు, ఇసుకను మప్పినవాడు – చెద, పచ్చిమాంసం పచ్చినీళ్ళ స్నానం పచ్చి బద్దలు.

సంస్కృతి : అద్దుగుడ్డ కట్టిన ఆడది మొలతాడు కట్టిన మగవాడు, ఇల్లు సేయడం, కుండన వండినది అంబలి (ఉడికించడం), పెంకన వేపింది సురువులు (వేయించడం), గోరు కోసిన కోడి (ముడుపు కట్టడం) అడిగిన పిల్ల కడిగిన ముఖం కాల్దొక్కి కంకణం కట్టవాలె (కన్యాదానం)

అర్ధవిపరిణామం వంటి భాషా శాస్త్ర సూత్రాలే సంస్కృతికి కూడా వర్తిస్తాయి. నమ్మకాలుగా స్థిరపడతాయి. వాటి గతిశీలం తెలుసుకుంటే' శాస్త్రాలలో, లెక్కలను మెట్రిక్ పద్ధతిలోకి, నాణేలను, అణా, బేడలనుండి పైసలలోకి, రాతకోతలను టైపు, కంప్యూటరులోకి మార్చుకుంటున్నట్లు' సంస్కృతిలో దేశ, కాలానుగుణమైన మార్పులు చేసుకోటం సులభమౌతుంది. లేకపోతే నమ్మకాలు, మూఢనమ్మకాలుగా మారి ముందరి కాళ్ళకు బంధమేస్తాయి. తెలుగు సంస్కృతి నమ్మకాల వర్గీకరణ, విస్తరణలను గిరిజన సాహిత్యం, కర్మకాండ, సాధన సామగ్రి స్పష్టం చేస్తాయి. అనేక భాషలలో విస్తృతిని, కృత్రిమ మేధ సహకారంతో సాంకేతిక భాషలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్న నేటి తరుణంలో, సంస్కృతి నిర్మాణంలో క్రమాన్ని ఆవిష్కరించే ఈ ప్రయత్నాలు చాలా అవసరం.

సుస్థిర అభివృద్ధి, సతత హరిత విప్లవం, సేంద్రియ వ్యవసాయం, అంటూ అభివృద్ధి దిశ మార్చుకుని సంస్కృతి వైపు మళ్ళుతూ, అడవులు. భూములు, బీళ్ళు-తరతరాలుగా వీటిపై బతుకుతున్న జాతుల వాడుకలను, వారి మేధోజనిత హక్కులు గుర్తించటానికి చట్టాలు చేస్తున్న ఈ తరుణంలో, భాషా సాహిత్య వేత్తలు ఈ కృషిలో ప్రముఖ పాత్ర వహించాలి.

'భాష ఉపకరణంగా మనవిజ్ఞానం ఎంత పెరిగితే ,భాష అంత పెరుగుతుంది.వర్ధమాన భాషలో ప్రమాణభాషను మాండలిక సమ్మేళనంతో సులభగ్రాహ్యం చేయటం అవసరం.'

'తెలుగు రచనల్లో సాహిత్యమైనా శాస్త్రమైనా అంతర్జాతీయ స్థాయికి రాదగిన గుణం ఉంటేనే తెలుగు భాష అంతర్జాతీయ భాష అవుతుంది.' మన పెద్దల ఒకనాటి (1960)ఈ సంకల్పాలకు ఇప్పుడైనా ప్రాణం పోయాలి.

అ

కవిత

గురజాడ


తెలుగు పద్యాలు ముత్యాల పందిరేసి
అమ్మభాషకు అలరారు పూలు పూయించి
మాటకూ పాటకూ సొగసులు చిందించిన
వ్యవహారిక భాషా ఝరి గురజాడ
ఆయన తెలుగు భాషకు కొత్త ఊపిరి
అందుకే తెలుసు ఆయన పేరు మనందరికీ
భాషా సాహిత్యాలు జాతి జీవాలు
ఎటు చూసినా తెలుగు భాషా కిరణాలు
తెలుగు పుడమిపై అస్తమయం లేని
భాషాశాస్త్ర సాహితీ సూర్యుడు గురజాడ
ఆయన తెలుగు భాషకు కొత్త ఊపిరి
అందుకే తెలుసు ఆయన పేరు మనందరికీ
అమ్మ కడుపులోంచే
అమృత సరాలు నేర్పి
ఆకాశం పలకమీద వ్యవహారిక భాషా
అఆలు రాయించిన సంస్కర్త గురజాడ
ఆయన తెలుగు భాషకు కొత్త ఊపిరి
అందుకే తెలుసు ఆయన పేరు మనందరికీ
తల్లిభాషను పుట్టుకతోనే
పాలమీగడల పాయసంగా తినిపించి
వ్యావహారిక భాషకో దిదుబాటు చేసిన
పండిత పామరుల బంధుమిత్రుడు గురజాడ
ఆయన తెలుగు భాషకు కొత్త ఊపిరి
అందుకే తెలుసు ఆయన పేరు మనందరికీ

జి.నరసింహమూర్తి
8977987266

డా॥సిరి

అక్షర ప్రవంతి


ఘనీభవించిన హిమనీనదం ఒక్కొక్క నీటి చుక్కగ కదిలి, మేఘాల మేనాపై తరలి వచ్చిన చినుకుల్ని కలుపుకుని, ఏరులుగా మారి, ప్రవాహమై కదిలినట్టు -, దరిచేర్చు దారి తెలియక, మెదడు పొరల్లోనే దాగిపోయిన ఘనమైన ఆలోచనలన్నీ, మేఘాలై మనసు గగనాన తేలిపోతున్న భావనలన్నీ, కాస్త వెన్ను తట్టగానే, అక్షర చినుకులుగా, తడి నీటి చుక్కలుగా మారి, కథల ఏరుగ ప్రవహిస్తున్నాయి. హోరెత్తిన ఈ ఏరులో, గుండెని తడిసేసే, మనిషి లోని చెడుని కడిగేసే కెరటాలెన్నో – ఒక్కో కెరటం ఒక్కో కథ చెబతుంది. ఒక్కో కథ పిల్లల ఆలోచన స్థాయిని, తెలుగు భాషపై వారికున్న ప్రేమని, వారి ఊహాశక్తిని, కల్మషం ఎరుగని వారి స్వచ్ఛమైన మనసుని, మనముందుంచుతుంది. ఈ కథలు చదువుతుంటే, 'అసలు పిల్లలేనా ఇలాంటి గొప్ప కథలు వ్రాసింది'– అని అనిపించక మానదు. అవును మరి, మనకు పిల్లలంటే ఆటపాటలే, అల్లరే. మనం చెప్పేది వారికర్థమైతే చాలనుకుంటాం. వారి స్థాయికి దిగి మాట్లాడుతున్నాం అనుకుంటాం. కానీ పిల్లల మనసులో ఎన్ని గొప్ప ఆలోచనలుంటాయో, ఎన్ని లోతైన భావనలుంటాయో, వారి భావోద్వేగాలూ, వారిలో దాగున్న ప్రతిభ, తపన – వీటన్నింటిని అంచనా వేయడంలో మనం చాలా వరకు వెనుకబడే ఉంటాం. కానీ పిల్లల్లో ఎటువంటి భేషజాలు ఉండవు. మనము వారిని గుర్తించలేదన్న కోపమూ ఉండదు. వారు, తాము నవ్వినంత హాయిగా, స్వచ్ఛంగా తమ భావనలను వ్యక్త పరుస్తుంటారు. ఆ భావాలకు అక్షరరూపాలే, పుస్తక సంకలనాలుగా వెలువడిన పది జిల్లాల బడి పిల్లల కథలు. ఒక్కో జిల్లా కథా సంకలనాన్ని పలకరిస్తే, ఎన్నో ముచ్చట్లని మనతో చెబుతాయి. కథలై మనల్ని అల్లుకుంటాయి.




ఏ చెట్టుకి ఆక్సిజన్ అనే పదం తెలుసు? కానీ అది నిరంతరాయంగా అందిస్తూనే ఉంటుంది, మన ప్రాణం లో ఆయువై నిలుస్తూనే ఉంటుంది. అటువంటి సహజత్వంతోనే పిల్లలు సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. ఎదురేదీ ఆశించకుండా గట్టి ప్రయత్నం చేస్తు న్నారు. ఆ ప్రయత్నానికి రూపమే, "రంగారెడ్డి జిల్లా బడి పిల్లల కథలు". బోయిని అజయ్ వ్రాసిన 'బాలవాక్కు', ఎన్.ప్రవళిక వ్రాసిన 'ధరిత్రి కాలుష్యం', సి.హెచ్. దీక్షిత వ్రాసిన 'పొదుపు' తాను పెంచు కున్న గేదె గురించి యజమాని ఆలోచించే తీరు, వారిద్దరికీ ఒకరిపై ఒకరికున్న ప్రేమను తెలుపుతూ, ఎం.డీ.ఇర్ఫాన్ వ్రాసిన 'రాముడు', వ్యవసాయం గురించిన ఒక ముఖ్యమైన విషయాన్ని చక్కగా వివరిస్తూ, కె.వరుణిక వ్రాసిన 'వేపచెట్టు', ఎస్. మానస వ్రాసిన 'తల్లిదండ్రుల ప్రేమ', బి. కల్పన వ్రాసిన 'కుటుంబ విలువలు', ఇలా ఒక్కో కథ, ఒక్కో అంశాన్ని మన ముందుంచుతుంది.


✶

పిల్లలకి పశు పక్ష్యాదులంటే ఎంతో ప్రేమ. జంతువుల పట్ల మమకారం, ఇష్టం. వాటిని తమ స్నేహితుల్లాగే భావిస్తుంటారు. ఆ ప్రేమను అణువణువునా నింపుకున్న కథలు, "మెదక్ జిల్లా బడి పిల్లల కథలు" పుస్తకంలో దర్శనమిస్తాయి. పాలేటి అంకిత వ్రాసిన 'కోతిలో వచ్చిన మార్పు', ఎం.డి.అఫ్రిన్ వ్రాసిన 'యువరాణి జాలి గుణం', తెలిసిన విషయాన్నే కొత్త కోణంలో ఆవిష్కరించిన బి. మానస వ్రాసిన 'కృతజ్ఞత', సర్కార్ బడి (ప్రభుత్వ పాఠశాల)గొప్పతనం చెప్పే, మమత వ్రాసిన 'తండ్రిమార్పు', నేత్రదానం ఆవశ్య కతను తెలుపుతూ, కె.భవాని వ్రాసిన 'నేత్ర దానం', సందిల శ్రీలత వ్రాసిన 'స్ఫూర్తి'– నిజంగానే ప్రతీ మనసులో స్ఫూర్తిని నింపుతాయి.



పిల్లల వెనుకటిలా లేరు. చెప్పిన ప్రతీకథకల్లా ఊ కొట్టే రోజులు పోయా యి. వారి ఆలోచనా విధానం మారింది. విషయాన్ని చూసే తీరు మారింది. "అస లీ కథ ఇలాగే ఎందుకుండాలి? మనలో మార్పు వస్తే, కథలో కూడా మార్పు వస్తుంది" అనే దృక్పథంతో ఆలోచిస్తున్నారు. అందుకే, ఎదుటివారిని బాధపెట్టే ముగింపులను మార్చి, మానవత్వానికి మంచి ఆలోచనకి జై కొడుతూ, తాము విన్న కథలకే కొత్త ముగింపు నిస్తున్నారు. అందుకు ఉదాహరణే, "హైదరాబాద్ జిల్లా బడి పిల్లల కథలు" పుస్తకంలో కొలువైన ఎం. ఊర్వశి వ్రాసిన 'ఆదర్శం' అనే కథ. రేష్మ వ్రాసిన 'టీ రాము' కృషితో నాస్తి దుర్భిక్షం అని చెబితే, ఎన్.శివకుమార్ వ్రాసిన 'ఓపెన్ చదువు' ప్రభుత్వం నడిపించే ఓపెన్ స్కూల్, కాలేజీల గురించి చెబుతుంది. బహుశా ఇటువంటి అంశం మీద ఇంత వరకూ ఎవరూ కథ వ్రాసి ఉండక పోవచ్చు. యు.బాల్‌రాజ్ వ్రాసిన






'పిచ్చుక పిల్ల', డి.శిరీష వ్రాసిన 'సమానత్వం', పూర్తిగా సంభాషణలతోనే సాగిన, పూజమంగాదేవి వ్రాసిన 'ఎవరు గొప్ప' కథలు వేటికవే గొప్పవి. ఐతే ఇవన్నీ ఒక ఎత్తైతే, డి. కళ్యాణి వ్రాసిన 'ప్రతిభ' కథ మరో ఎత్తు. పిల్లల్ని అర్థం చేసుకోవడంలో మనమెంత వెనుకబడి వున్నామో, వారి మనసుని అర్థం చేసుకోవాలంటే మనం ఎంత ఎత్తుకి ఎదగాలో చెప్పే ఈ కథ, ఎందరో తల్లిదండ్రుల ఆలోచనా విధానాన్ని మారుస్తుందని నా నమ్మకం.

★

ఒక కథకు మొదలు ఎంత ముఖ్యమో, ముగింపూ అంతే ముఖ్యం. తెలిసిన కథలకు తమదైన కొత్త ముగింపునిస్తూ, కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారీ పిల్లలు. అయితే, వాస్తవాలకతీతంగా వెళ్ళి, కృత్రిమతను చొప్పించే ప్రయత్నం చేయలేదు. ఉన్నది ఉన్నట్లు, సమాజంలో జరుగుతున్నది జరుగుతున్నట్లు వ్రాశారు. నిజాన్ని నిర్భయంగా చెప్పడంలో ఏనాడూ వెనుకడుగేయని వీరు, ఆ నిజాన్ని కథల రూపంలో మన ముందుకు తెచ్చారు. సయ్యద్ సలీం వ్రాసిన 'ఆదిత్య కథ' ఆ నిజానికి నిలువుటద్దం. "నిజామాబాద్ జిల్లా బడి పిల్లల కథలు" లో దర్శనమిచ్చే ఎన్నో కథలు ఈ కోవలోకే వస్తాయి. ఎ.వైష్ణవి వ్రాసిన 'అవయవదానం', యస్. స్వాప్నిక వ్రాసిన 'పరిష్కారం' బి.శరణ్యదేవి వ్రాసిన 'చదువు ప్రాముఖ్యత', ఎన్.సాకేత్ వ్రాసిన 'విజయమా – నైపుణ్యమా', కె.చిన్మయి వ్రాసిన 'అన్నం పరబ్రహ్మం', ఇలాంటి చక్కని కథలెన్నో ఈ పుస్తకంలో కొలువై ఉన్నాయి. బి.శ్రీముఖి వ్రాసిన 'కానుక' చదివాక, **పిల్లలు కథలు ఎందుకు వ్రాయాలి అనే ప్రశ్నకి చాలా మందికి సమాధానం దొరుకుతుంది. ఎందుకంటే, ఇటువంటి కథలు పిల్లలు మాత్రమే వ్రాయగలరు.**

★


కలుపుకోవడం, కలిసిపోవడం వీటి లక్షణం. పిల్లల మనసు కూడా అలాంటిదే. ఒక్క చిరునవ్వు నవ్వితే చాలు, ఎదుటివాళ్లను తమ వాళ్లుగా భావిస్తారు. ఎవ్వరి మనసులోతుల్లోకి తొంగి చూడకుండా, అందరినీ సమానంగా ప్రేమిస్తారు, ప్రేమగా తమలో కలుపుకుంటారు. ఆ కలుపుకుపోయే లక్షణమే పిల్లలు వ్రాసిన ఈ కథల్లో కనిపిస్తుంది. ఐదవ తరగతి చదువుతున్న పి.ఎస్.ఎస్. అక్షిత వ్రాసిన 'జాలి మనసు' కథ ఈ కోవలోకే వస్తుంది. కమల్ నాథ్ వ్రాసిన 'ఓ అమ్మకథ', గోదా లిఖిత్ కుమార్ వ్రాసిన 'రెండు కళ్లు', నాల్గవ తరగతి చదువుతున్న డి.అదితిజ వ్రాసిన 'మంచి మిత్రులు' – ఇలాంటి చక్కని కథలెన్నో కనిపిస్తాయి, "ఖమ్మం జిల్లా బడి పిల్లల కథలు" కథల సంకలనంలో.



★

పిల్లల్లో సహజంగా ఉండే గుణాలు, అమాయకత్వం, అల్లరితనం. పైకి ఎంత అల్లరి మాటలు మాట్లాడినా, పిల్లల్లో లోలోన బెరుకు దాగే ఉంటుంది. ఒక్కోసారి ఎంతో ధైర్యంగా మాట్లాడినట్లు కనిపించినా, వారిలో ఉన్న అమాయకత్వం అలాగే, సముద్రంలో అలలాగే ఉంటుంది. అయితే, ఆ అమాయకత్వం చాటున దాగున్న విశాలమైన ఆలోచనలు, ఆ అల్లరితనం వెనుక మన ఊహకందని లోతైన భావనలు ఎన్నో ఉంటాయి.

ఆ భావనలు అక్షర రూపమెత్తి కథలై కదిలాయి "కరీంనగర్ జిల్లా బడి పిల్లల కథలు" పుస్తకంలో, పిల్లలు సమాజాన్ని ఎంత బాగా గమనిస్తున్నారో, సమాజహితం కోసం ఎంత తాపత్రయ పడుతున్నారో, వాసరవేణి విజ్ఞశ్రీ వ్రాసిన 'సీస వక్కలు', శ్రీ వివేక్ వ్రాసిన 'మూఢ నమ్మకాలు', బత్తిని భవాని వ్రాసిన 'నీరు' కథలు చదివితే అర్థమవుతుంది. ఇక మాచర్ల శివాణి వ్రాసిన 'భూమి' సహజ ఎరువులు వాడడం వల్ల జరిగే మేలుని చెబితే, నీరటి కీర్తన వ్రాసిన 'రైతన్న', రైతు గొప్పతనాన్ని చెబుతుంది. ' ప్రపంచంలో ప్రతి ఒక్క జీవికి బ్రతకడానికి సమాన హక్కు ఉంటుంది" అంటూ డి. లయ వ్రాసిన 'ఎలుక – పిల్లి', కె. జ్యోతి వ్రాసిన 'అపురూప కానుక', యం.ప్రతిభ వ్రాసిన 'కష్టం–దాని ఫలితం', ఇలా ఎన్నెన్నో కథలు మనల్ని చేయి పట్టుకుని మంచి మార్గంలో నడిపిస్తాయి.



★


రామాయణ మహాకావ్యం మొదలు, పంచతంత్ర కథలు, వేమన పద్యాలు, సుమతీశతకం ఇలా మన సాహిత్యమంతా నీతినే బోధిస్తుంది. మానవాళిని **'మంచి' వైపు నడిపిస్తుంది. 'మంచి' అనేది మానవ మనుగడకి ఊతం లాంటిది. అది కనుమరుగై పోయిన రోజున ఈ భువిపైన మన ఉనికి ప్రశ్నార్థకమైపోతుంది. అవును మరి, మంచిని మించినదేముంటుంది?** అయితే, ఎనిమిదవ తరగతి చదువుతున్న ఆర్.రేణుకను అడిగితే, 'మంచి' గురించి ఒక మంచి మాట చెబుతుంది. 'మంచి ఉద్దేశ్యంతో చేసిన ఏ పనైనా అభినందింపబడుతుంది' అంటుంది. తను వ్రాసిన 'శుభ్రత విద్య నేర్పుతుంది'. అనే కథలో. స్వచ్ఛత దిశగా మన దేశం అడుగులేస్తున్న ఈ తరుణంలో, ఇటువంటి కథల అవసరం ఎంతైనా ఉంది. ఈ కథలోని పాత్రలేవీ ఎవ్వరికీ శుభ్రత, స్వచ్ఛత గురించిన పాఠాలు చెప్పవు. స్వయంగా ఆచరించి చూపిస్తాయి. అలాగే, 'ప్రతీవృత్తి గొప్పదే, వ్యవసాయం మరీ గొప్పది' అని చక్కని మాటను చెబుతుంది, గుండా చరిత, తను వ్రాసిన 'సాగినం సాయం' కథలో. ఈ కథ, రైతు ఆవేదనను చూసి చలించి వ్రాసినట్లు ఉంటుంది. కావేరి వ్రాసిన 'స్నేహబంధం' గంట ప్రశాంతి వ్రాసిన 'పశ్చాత్తాపం', ఎం. కళ్యాణి వ్రాసిన 'తెలివైన ఉమా', ఇలా ఒక్కో కథ, మనిషిలోని ఒక్కో కోణాన్ని



చూపిస్తుంది. 'నల్గొండ జిల్లా బడిపిల్ల కథలు" పుస్తక సంకలనంలో పొదగ బడిన ఈ కథలు నిక్కమైన 'మంచి' నీలాలు.

★


'స్ఫూర్తి' మొలకెత్తే విత్తనంలా ప్రతీ నిత్యం, ఏ మస్తిష్కపు నేల నుంచో, ఏ గుండెతడి నుండో కొత్తగా, పచ్చగా పుడుతూనే ఉంటుంది. తాము పొందిన స్ఫూర్తిని గుండెలో నింపుకుని ముందడు గేయడమే కాదు, తమ చుట్టూ ఉన్న వారిలో కూడా ఆ స్ఫూర్తిని నింపాలన్న తపనతో, దాని చుట్టూ ఒక అర్థవంతమైన, నేటి సమాజానికి అత్యవసరమైన కథని అల్లడమే కాదు, దాన్ని అందంగా, సౌమ్యంగా చెప్పారీ పిల్లలు. అవునుమరి, లేకపోతే ఎక్కడో ఆస్ట్రేలియాలో ఉండే నిక్‌పూజిసిక్, ఎనిమిదవ తరగతి చదువుతున్న నిత్యసాయి వ్రాసిన 'లక్ష్యం' కథలో పాత్ర ఎలా అవుతాడు? ప్రేరణ చుట్టూ అల్లిన ఈ కథ, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతీ ఒక్కరు చదవాల్సిందే. ఎందుకంటే ఇది ఆలోచనని మార్చే కథ. ఒక్క ఈ



కథేనా, చుంచు కళ్యాణి వ్రాసిన 'అతిధి', ఆర్. అపూర్వ వ్రాసిన 'దయగల పులి', ఓ . శ్రేయ వ్రాసిన 'కష్టేఫలి', 'ఆలోచన కంటే ఆచరణ గొప్పది' అంటూ వర్షిత వ్రాసిన 'రాజ్యాటన', బద్ధకం గురించి ఇందుశ్రీ ఇప్ప వ్రాసిన 'మంచి అలవాట్లు', బొమ్మెల్ల లక్ష్మణ్‌కుమార్ వ్రాసిన 'అమ్మ', ఎ.శ్రావ్య వ్రాసిన 'పెరుగుతున్న వృద్ధాశ్రమాలు', ఇలా ప్రతీ కథ ఆలోచనల దారులు మార్చేదే. అందుకే ఈ కథా సంకలనాన్ని "ఆదిలాబాద్ జిల్లా బడిపిల్లల కథలు" అనే బదులు, చక్కని ఆలోచనల నిధి అనడం బాగుంటుందేమో.

★

'ఈ కాలం పిల్లలకు పెద్దల పట్ల ఉండాల్సిన గౌరవభావం తగ్గిపోయింది. అసలు వాళ్లను లెక్కే చేయడం లేదు' – ఈ మధ్యకాలంలో, ఎందరో పెద్దల నోటి నుండి ఇటువంటి మాటలు వినిపిస్తున్నాయి. కానీ ఇది పూర్తిగా నిజం కాదేమో. 'మాటల్లో చెబితే నమ్ముతారో లేదో, మేం వ్రాసే కథలు చదవండి, మాకు మీ పట్ల ఉన్న ప్రేమెంతో అర్థమవుతుంది" అంటున్నారు పిల్లలు. ఆ ప్రేమకు అక్షర రూపమే. కె. మాధవి వ్రాసిన 'మానవత్వం' అనే కథ. 'అవ్వ వాళ్లు దేవుళ్ళు. దేవుడు ఎక్కడో ఉండడు. అవ్వల రూపంలో ఉంటాడు' అనే వాక్యాలు పిల్లలకు పెద్దవాళ్లు పట్ల ఉన్న ప్రేమని తెలుపుతుంది. తరంగిణి వ్రాసిన 'శిక్షతో మార్పు' టీ.వీల్లో దొంగతనాల గురించి వచ్చే సీరియల్లు, కొందరిపై ఎంతటి దుష్ప్రభావం చూపు తాయో చెబితే, 'ప్రాణ స్నేహితులు' కథలో 'ఆడపిల్ల చదువు అవనికి వెలుగు' అంటుంది హిందు. అంతేకాదు, సావి త్రీబాయి పూలే జీవిత గాధను చెప్పి, ఆమెను ఆదర్శంగా తీసుకోమని చెబుతుంది.




'నెమలి' అనే పేరు వినగానే అందమే గుర్తుకొస్తుంది, అక్షరాల్లో పొదగమనగానే వర్ణనే మొదలవుతుంది. కానీ, జి. అర్చన తను వ్రాసిన 'నెమలి' కథలో ప్రేమ, బాధ్యత, శిక్ష, మార్పు ఇలా ఎన్నో కనిపిస్తాయి.

'తికమక' తో మొదలై, చెరప కురా చెడేవు వరకు మనసుకి హత్తుకునే కథలు ఎన్నో కనిపిస్తాయి. "మహబూబ్ నగర్ జిల్లా బడి పిల్లల కథలు" పుస్త కంలో...

★

ఇప్పుడంతా స్మార్ట్ యుగం. ప్రపంచమంతా 'టెక్నాలజీ' చుట్టే పరిగెడుతోంది. ఒక రకంగా, ప్రదక్షిణలు చేస్తోంది. ప్రతీ విషయానికి దాని మీదే ఆధారపడుతోంది. ఈ మధ్య వార్తా పత్రికల్లో ప్రచురితమైన వార్త ఏమిటంటే, త్వరలో సజీవరోబోలు రాబోతున్నాయట. ఇదే గనుక ఇలాగే సాగితే, మనిషి పూర్తిగా రోబోల మీద ఆధారపడితే ఎలా ఉంటుందో ఊహించడం కష్టం. మన ఊహకందని ఆ దృశ్యాన్ని ఊహిం చి, దాన్ని సజీవ చిత్రంగా మన కళ్ళ ముందుంచుతుంది. ఎన్. లిఖితశ్రీ వ్రాసిన 'మా 'నవ' 'సృష్టి' కథ. ఈ కథను మొదలుపెట్టిన విధానమే ఆశ్చర్యపరు స్తుంది. ఒక కథలోని ఒక్కో పదం కది లించి వేస్తుంది. సాంకేతికత చుట్టూ పరిగెడుతున్న మనం, మన పరుగులు చాలించకుంటే, మన అడుగులు ఆగేది ఎక్కడో, ఆగిన చోట మనకు మిగిలేదేమిటో కళ్ళకు కట్టినట్లు చెబుతుంది. మనిషి మేధకు పరాకాష్టగా నిలిచిన ప్రతి సృష్టితో మొదలయ్యే ఈ కథ, కన్నీళ్ళతో అంతమవుతుంది. **ఇది పిల్లలు వ్రాసిన కథ అంటే, నమ్మడం అంత సులువుకాదనిపించేలా ఉంటుంది.**

ఈ మధ్య పర్యావరణం గురించి ఎవరు మాట్లాడినా, 'గ్రేటా' అనే పేరు లేకుండా ముగించడం లేదు. ఆమెలా నిజానికి ఆమెలాంటి వారెందరో! మన మధ్యే ఉన్నారు. కొందరి వాణి – విశ్వానికి వినిపించదు. ఎందుకంటే అందరికీ ఆ వేదికపై నిలిచే అవకాశం రాదు. అయితే, 'మంచి మాట్లాడడానికి, మార్పుని తేవడానికి ఏ వేదిక అవసరం లేదు. అక్షరాలను ఆయుధాలుగా చేసుకున్న వాళ్ళం, ఉన్నచోటు నుండే మా పోరాటాన్ని సాగిస్తాం' అంటున్నారు ప్రకృతి గురించి 'ప్రకృతి వాళ్ళు', ఈ వాళ్ళు–పసివాళ్ళు. అవును మరి, ఈ కథను వ్రాసింది, ఐదవ తరగతి చదువు తున్న మామిడాల శ్రీ చరణ్.



టి.శ్రీవేద వ్రాసిన 'దెయ్యం చేసి న నయం' ప్రేమతో మాట్లాడే నాలుగు మాటల గొప్పతనాన్ని చెబితే, ఎస్. చైతన్య వ్రాసిన 'దేశభక్తి' నిజంగా దేశం పట్ల భక్తి భావాన్ని, గౌరవాన్ని పెంచు తుంది. ఇలా, "వరంగల్ జిల్లా బడి పిల్లల కథలు" పుస్తకంలో ఉన్న ప్రతీ కథ, కథ స్థాయిని పెంచుతుంది. కథకు

కొత్తందం తెస్తుంది.

★

సాహిత్యరంగంలో సృజన ఊట అయితే, భాష ఊతం వంటిది. 'భాష' భావ వ్యక్తీకరణకు ఆయుధం వంటిది. అయితే, ఆ భాష మాతృభాష అయితే, భావ వ్యక్తీకరణ నారికేళంలో నీరులాగా స్వచ్ఛంగా ఉంటుంది. 'భాష' నే ఆయుధాన్ని ఎలా, ఎప్పుడు ఉపయోగించాలో ఈ పిల్లలకు బాగా తెలుసు. వారు వ్రాసిన కథల్లో, సందర్భోచితంగా వారు ప్రయోగించిన భాషాస్త్రాలే ఇందుకు సాక్ష్యాలు. ఎక్కడ చక్కని భాషను వాడాలో, ఎక్కడ హత్తుకు పోయే యాసను వాడాలో వారికి బాగా తెలుసు. అలా రెండింటినీ సమన్వయం చేస్తూ వ్రాసిన కథలెన్నో...

ఆకాశం నుండి భూమి వరకు, అనగనగా నుండి 2090 సంవత్సరం వరకు, రాజు నుండి రైతు వరకు, ప్రాణమున్న జంతువుల నుండి కదలలేని బెంచీ వరకు, ప్రకృతి నుండి పగిలిన సీస వక్కల వరకు – ఇలా ఊహకందని వైవిధ్యమైన కథా వస్తువులెన్నో – ఈ కథలకు రంగులద్దమంటే, ఇంద్రధనస్సు చేతులెత్తేసి వెళ్లి పోతుందేమో...! ఊహాశక్తికి రెక్కలిచ్చిన ఈ బాలలు, వాటితో అనంత దూరాలకు, కొత్త లోకాలకు వెళ్లారు కానీ, పొరపాటున కూడా కృత్రిమ తీరాలకు వెళ్ళలేదు. నేల విడిచి సాము చేయలేదు. సామాజిక స్పృహతో, బాధ్యతతో, మంచి ఉద్దేశ్యాలతో వ్రాసిన ఈ కథలన్నీ చాలా మంచిగా, మండు వేసవిలో వేపచెట్టు గాలంత చల్లగా ముగుస్తాయి. ఉన్నత ఆలోచనల్ని, మనసు లోతుల్నీ తాకిన ఈ రచనలు పిల్లల మనసుకి అద్దాలు.

బాలల్ని, వారి మనసులోని ఆలోచనలను వారే అక్షరాలుగా ఆవిష్కరించే దిశగా వారిని ప్రోత్సహించి, వారి వికాసమే ధ్యేయంగా గత ముప్పై సంవత్సరాలుగా కృషి చేస్తూ, నేడు ఒక గొప్ప ప్రయత్నానికి నాంది పలికిన మణికొండ వేదకుమార్‌గారు అభినందనీయులు. వారు చేస్తున్న కృషి, పిల్లల వికాసం కోసం ముందడుగు వేస్తున్న వారందరికీ ఆదర్శనీయం.

★

అక్షరాలై ప్రవహించిన ఈ ఆలోచనల ఏరులు– అలసత్వపు ఎండసోకి–బీడుగా మారిన హృదయ నేలల్లో– తిరిగి చైతన్యపు పచ్చదనాన్ని నింపుతాయని ఆశిస్తున్నాను.

స్పందనను వ్రాయండి

'అమ్మనుడి'లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520 004.
ఇ–మెయిల్ : *editorammanudi@gmail.com*

కవిత

ఋతం

మాతృభాషా యేటి నీటిని
వాడకుండా నిల్వజేస్తే...
మరపు నాచు ప్రబలి
మనసు నుండి మాయమగుట సత్యం!
మక్కువగ చెంతజేరి
నిత్యం దోసిళ్ల త్రాగిన
తేట నీటితో ఉరకలెత్తుతూ
జాతి ఉనికికి జీవమగుట సత్యం!

మాతృభాషా పెరటి మొక్కను
పరధ్యాసన బడి వదిలేస్తే...
పసిదనానే వదలి
కాలగతిన ఎండిపోవుడ సత్యం!

కర్తవ్యం మరువక
కంచె వేసి, నీరు పోసిన
సంస్కృతీ ఆమ్ర వృక్షమై
అస్తిత్వ ఫలాల నందించుట సత్యం!
సత్యమే కాదిది...
అర్వాచీన ఋతం!

ఎస్.కాశింబి
90522 16044

గజల్

భాష

రోజురోజుకు అమ్మభాష ఒరిగిపోతా వున్నది
తెలుగు వెలుగు జాతి నుండి తరిగిపోతా వున్నది

మాతృభాషా వాదులెంత తపన చెందుతా వున్నా
రాజు చూపుకు అక్షరమ్ము కరిగిపోతా వున్నది

తెలుగు తనమును చూచి జనులు మెచ్చుకొందురు
కీడు తలచిన చాలు వారె నొచ్చుకొందురు

సొంతలాభము యెంచి కొందరు కూలదోసిన
తెలుగుపూలను వలచి కురుల గుచ్చుకొందురు

పదవియున్న చోటుకు దోమల్లాగ దూరిపోదురు
పెదవిమీద మధువుకు మల్లే ఊరి, చేరిపోదురు

ఆశ పూవులాగున పరిమళించగ ఓ పృథ్వీ!
ఘనతగొన్న పాదముల చెప్పులవలె మారిపోదురు!!

ఎస్.ఆర్.పృథ్వి
9989223245

నవల

డి.పి. అనూరాధ
9010016555



(జరిగిన కథ)

ఆస్ట్రేలియా వెళుతోన్న సూర్యవర్మకి బ్యాంకాక్లో ఓ అపరిచితుడితో పరిచయం – అతడి జీవిత గమ్యాన్ని పూర్తిగా మార్చేస్తుంది. కాలాలకు అతీతంగా అతడి ప్రయాణం సాగుతుంటుంది. సువర్ణభూమిని చేరుకుంటాడు. ఆగ్నేయాసియాలోని ప్రాచీన తెలుగు రాజ్యాలైన హంసావతి, హరిపుంజాయిలలో సంచరిస్తాడు. ప్రాచీన తెలంగాణతో సంబంధమున్న మయన్మార్ మూల జాతీయులైన మన్ తెగవారిని బర్మా, థాయిలాండ్లలో కలుసుకుంటాడు. ఘనమైన తెలుగు జాతి కీర్తికి అచ్చెరువొందుతాడు. ఆ రెండు దేశాల తరవాత సూర్యవర్మ మజిలీ ఎక్కడో?

ఏవో పెద్ద ఆలయ సమూహాల మధ్య నడుస్తున్నా....

విశాలమైన ప్రాంగణాలు...అన్నీ రాతితో నిర్మించినవే...

పెద్ద తటాకాలు...వాటినిండా ఎర్రని... తెల్లని కలువ పూలు...

వేలల్లో టూరిస్టులు...చాలా మంది విదేశీయుల్లా కన్పిస్తున్నారు...

రంగురంగుల గొడుగులు చేత్తో పట్టుకుని విహరిస్తున్నారు.

ఆకాశాన్నంటేలా పెరిగిన పెద్ద మాను నీడలో ఓ వ్యక్తి ఆలయ ప్రాకారాన్ని చిత్రిస్తున్నాడు... చూస్తే విదేశీయుడిలా ఉన్నాడు.

ప్రింట్ తీసినంత కచ్చితత్వంతో చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాడు. పెయింట్ చేస్తున్న అతడి వేళ్లను చూస్తూ అలాగే ఉండిపోయాను.

30 లోపు వయసు ఉంటుంది....

రంగుల బ్రష్షులు...బ్యాక్ ప్యాక్...కొన్ని పుస్తకాలు పక్కనే నేలమీద ఉన్నాయి. అవన్నీ అతడివే అనుకుంటా. ఓ పుస్తకం దగ్గర నా చూపు ఆగిపోయింది. 'స్కల్ప్చర్ ఫర్ అమరావతి ఇన్ ది బ్రిటిష్ మ్యూజియం'... పెద్ద అక్షరాలు నన్ను ఇట్టే ఆకర్షించాయి. ఎప్పుడో వేటపాలెం గ్రంథాలయంలో ఈ పుస్తకాన్ని చూసిన గుర్తు.

ఈ పుస్తకం ఇతడి దగ్గర ఎందుకు ఉంది. ఏం చేస్తున్నాడు... అసలు ఇతడు ఏ దేశస్థుడు... అతడినే అడిగి తెలుసుకుంటే – అన్పించింది.

'హాయ్...' అంటూ పలకరించాను.

'హే, ఇండియా' అని ప్రశ్నించాడు.

'అవునని తలూపాను'..

పశ్చిమ దేశీయులకు ఇండియా అంటే ఎందుకో చాలా అభిమానంలా ఉందని మనసులో అనుకున్నా.

'ఏ నగరం' తను అడిగాడు.

నాకు కాస్త ఆశ్చర్యంగా అన్పించింది. నా స్వస్థలం గురించి ఇతడికి ఎందుకు ఆసక్తి? అయినా చెబుదామని అనుకున్నాను.

'స్కల్ప్చర్ ఫర్ అమరావతి ఇన్ ది బ్రిటిష్ మ్యూజియం' పుస్తకాన్ని తీసుకుని అందులోని అమరావతి పదంపై వేలితో చూపిస్తూ .. 'ఇదే మా ఊరు..' అన్నాను.

'నిజంగా.. అమరావతి మీ ఊరా... నమ్మశక్యంగా లేదు' ఎంతో సంభ్రమంగా నా చేయి గట్టిగా పట్టుకున్నాడు.

అతడి వాలకం చూసి ఆశ్చర్యపోవడం నా వంతైంది.

'నేను అమరావతి శిల్పం పై రీసెర్చ్ చేస్తున్నాను. ఇక్కడి నుంచి నేరుగా విజయవాడ సమీపంలోని అమరావతే వెళ్తున్నా' అని హుషారుగా చెప్పాడు.

'నా పేరు పీటర్. లండన్ లోనే పుట్టి పెరిగాను. చిన్నప్పుడు నాన్న ప్రతినెలా లండన్ మ్యూజియం తీసుకెళ్లి చరిత్రంతా



అర్థమయ్యేలా చేసేవారు. ఆ మ్యూజియంలోని అమరావతి గ్యాలరీ నా ఫేవరెట్ ప్లేస్...ఆ శిల్పాలను చూస్తూ చిత్రించడం నేర్చుకున్నాను. ఆ అభిరుచే నన్ను హిస్టారికల్ ఆర్కిటెక్ట్ ను చేసింది.

ఆంగ్‌కార్ వాట్ 'అప్సర కన్జర్వేజన్ ప్రాజెక్టు'లో భాగంగా ఇక్కడికి వచ్చాను.'

'ఈ ఆలయం కాంబోడియాలోని ఆంగ్‌కార్ వాట్' ఆశ్చర్యంతో గట్టిగా కేకేసినంత పని చేశాను.

ప్రపంచంలో అతి పెద్ద హిందూ దేవాలయం ఆంగ్‌కార్ వాట్ ఇదే అన్నమాట. ప్రపంచ ఏడు వింతల్లో ఒకటి ఈ ఆలయం. అందుకే లక్షల మంది టూరిస్టులు!. నా మనస్సు వేగంగా మరో విషయాన్ని కూడా గ్రహించింది. మయన్మార్, థాయిలాండ్ల తరవాత నా మజిలీ కాంబోడియా అయిందన్న మాట. ఇక్కడ కూడా తెలుగు జాతి ఆనవాళ్లు ఏవో ఉన్నాయన్న మాట. **అసలు తెలుగు నేలతో ఆంగ్‌కార్ వాట్ ఆలయానికి ఏమిటీ సంబంధం...**నా ఆలోచనలకు అడ్డు తగిలాయి పీటర్ మాటలు...

'నువ్వు ఆ అద్భుతమైన అమరావతి... అలనాటి ధాన్యకటకం... అదే ధరణికోట.. ఆ అత్యద్భుతమైన నేల మీద పుట్టావు... ఎంత అదృష్టవంతుడివి. నీ గురించి నాకు ఎంతో తెలుసుకోవాలని ఉంది, నాలో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించిన అమరావతి గురించి తెలుసుకోవాలని ఉంది'...ఎంతో ఉద్వేగంతో ఉన్నా నిజాయితీగా అన్పించాయి అతడి మాటలు.

'అమరావతికి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే విజయవాడ మా సొంతూరు. చిన్నప్పుడు ఓ శివరాత్రికి ఆ ఊరుకి వెళ్లి అక్కడి అమరలింగేశ్వర స్వామి గుడిలో పూజలు చేశాం. అమరావతి స్తూపం అంటూ మా అమ్మ చూపించింది. అదో పెద్ద మట్టి దిబ్బలా ఉంది. నాకేమీ ఆసక్తి కలగలేదు. ఓసారి హైస్కూల్లో దే టూర్‌కి అమరావతి తీసుకువెళ్లారు. కృష్ణా నది...గుడి...చూపిస్తూ మ్యూజియంకి తీసుకు వెళ్లారు. ఈ పాలరాతి శిల్పాలు ఒకప్పుడు అమరావతి స్థూపంపై ఉండేవి. కొన్ని వందల సంఖ్యలో. ఇప్పుడు వాటి నకిలీలు మాత్రమే మిగిలాయి అని అక్కడి గైడ్ చెబుతుంటే, మా పిల్లలందరం ఏదో అలా అలా విన్నాం. ఆ రాతి శిల్పాలపై ఎలాంటి ఆసక్తి కలగలేదు. ఆ తరువాత చదువుల్లో మునిగిపోయాను. మేం హైదరాబాద్‌కి వచ్చేశాం. మళ్లీ అమరావతికి ఎప్పుడూ వెళ్ళలేదు.'

'అయ్యో ... నిజమా నువ్వు చాలా దురదృష్టవంతుడివి. మీకు హిస్టరీ పుస్తకాల్లో ఆ మాన్యుమెంట్ గొప్పతనం లేదా' అని నిరాశతో అడిగాడు పీటర్.

'అమరావతి కథలు అని తెలుగులో ఒక పాఠం ఉంది కానీ చరిత్ర పాఠాల్లో అమరావతి గురించి ఎక్కడా లేదు పీటర్ ' అంతే నిరాశగా బదులిచ్చాను.

'దక్షిణ భారతదేశంలో అతి పెద్ద బౌద్ధ విజ్ఞాన కేంద్రం ధరణికోట. అశోకుడి సమయంలోనే ఇక్కడ స్థూపం ఉండేది. రెండు వేల ఏళ్ల నాడు ఎందరో విదేశీయులు ఇక్కడికి వచ్చి బౌద్ధ అధ్యయనం చేశారు. ఈ స్థూపానికి మరమ్మత్తులు చేయడమే కాక అందమైన శిల్ప ఫలకాలతో తీర్చిదిద్దారు ఆచార్య నాగార్జునుడు, ఆయనని రెండో బుద్ధుడిగా పేర్కొంటారు. వివిధ దేశాలలో నిత్యం భగవానుడిగా పూజలందుకుంటున్న మహనీయుడు ఆయన. నాగార్జునుడు పుట్టిన నేల నుంచి నువ్వు వచ్చావ్. ఆయన గురించి నాకన్నా నీకే ఎక్కువగా తెలియాలే. ' పీటర్ ఏవో ఏవో చెబుతున్నాడు.


నాకవన్నీ అర్థం కావడం లేదు. ఆచార్య నాగార్జునుడి పేరు మాత్రమే తెలుసు. అంతకుమించి ఎక్కువగా తెలియదు.

'హిస్టరీ గురించి మీ దేశంలో పట్టించుకోరా.... మన చరిత్ర తెలిస్తేనే కదా వర్తమానంలో మరిన్ని గొప్ప పనులు చేస్తూ భవిష్యత్తు తరాలవారికి స్ఫూర్తి కలిగించగలం' అన్నాడు.

'మా దేశంలో అలాంటి స్ఫూర్తి తక్కువ. తమ పిల్లలు ఇంజనీర్లో, డాక్టర్లో అవ్వాలని తల్లిదండ్రులు చూస్తారే కానీ, మిగతా సబ్జెక్టుల గురించి పట్టించుకోవడం లేదు.

ఇక హిస్టరీ పేరెత్తితే అస్సలు ఊరుకోరు. నువ్వు చెప్పినట్టుగా ఈ విషయంలో మేం దురదృష్టవంతులమే.' నా స్థితిని పీటర్ కు వివరించాను.

'నేను అమరావతి స్థూపం పైన స్పెషలైజేషన్ చేశాను. 3డి టెక్నాలజీలో ఈ స్థూపాన్ని పునర్నిర్మించాను. దానికి నాకు యూనివర్సిటీ లో ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. ఆ డాక్యుమెంటరీ నా దగ్గరే



ఉంది ...' అంటూ బ్యాక్ ప్యాక్ లోంచి లాప్టాప్ తీసి ఆన్ చేసాడు.

'ది గ్రేటెస్ట్ స్తూప ఆఫ్ అమరావతి' అనే పేరుతో డాక్యుమెంటరీ మొదలైంది.

435 అడుగుల చుట్టుకొలత...100 అడుగుల ఎత్తుగల స్తూపం...20 అడుగుల ఎత్తుతో ప్రదక్షిణపథం....

చుట్టూ నాలుగు వైపులా సింహ ద్వారాలు... పోర్టికోలు ... ప్రదక్షిణపథం చుట్టూ పాలరాతి శిల్ప ఫలకాలు...

ఒకటి కాదు రెండు కాదు....వందలు ...

పాలరాతి కొండల్లో రాళ్లను తొలిచి...వాటిని చదును చేసి పలకలుగా కోసి...స్కెచ్ గీసుకుని...శిల్పాలు చెక్కినట్టుగా చూపిస్తున్నాడు....

బుద్ధుడి జీవిత కథలను కొంతమంది నిలుచుని వర్ణిస్తుంటే ... శిల్పులు రాళ్లపై ఆ కథలను చెక్కుతున్నారు..

అమరావతి శిల్పంలో మూడు దశలు....మొదటి రెండు దశల్లో త్రిరత్నాలు...

స్థూపం...బోధివృక్షం...ధర్మచక్రం...పాదాలు మాత్రమే ఉండేవి. మూడో దశలో ఆచార్య నాగార్జునుడు స్థూపాన్ని పునరుద్ధరించి...అభివృద్ధి పరిచి అందమైన శిల్పాలతో ప్రాకారాన్ని తిరిగి నిర్మించాడు.

ఆచార్య నాగార్జునుడి చొరవతో మహాయానం రూపు దిద్దుకుంది...బుద్ధుడికి రూపం వచ్చింది ... ప్రతి జాతక కథను దృశ్య కావ్యంగా శిల్పంపై రూపుదిద్దారు...ఆ శిల్పాలు నటించాయి... శరీరం ఎన్ని మలుపులు తిరుగుతుందో అన్ని వంపులూ అమరావతి శిల్పాలలో కనిపిస్తాయి...

మనుషులు...జంతువులు...వస్తువులు...సందర్భాన్ని బట్టి వెనక్కి తిరిగి ఉన్నట్టు చెక్కి వాటిలో ఫోర్త్ డైమెన్షన్ చూపెట్టారు... అంతేకాదు, ఈ శిల్పాల్లో యానిమేషన్ వంటిది కూడా ఉంది...

ఒక్క అంగుళం స్థలం కూడా వదలకుండా శిల్పాలను చెక్కారు...

తెరమీద శిలాఫలకం కదులుతోంది ... బ్యాక్‌గ్రౌండ్ లో వివరిస్తున్నాడు పీటర్..

'ప్రాచీన భారతంలో గొప్పగా చెప్పే శిల్పరీతులు రెండే రెండు.





ఒకటి గాంధార శిల్పం, మరొకటి అమరావతి శిల్పం. 2000 ఏళ్ల నాడే తెలుగువాడు సాధించిన ఘన కీర్తి అమరావతి స్థూపం.... భారతదేశంలో అతి పురాతన స్థూపం అశోకుడి కాలం నాటిది సాంచి లో ఉంది. ఆ స్తూపానికి ఎటువంటి శిల్ప ఫలకాలు లేవు ... తరవాత శాతవాహన కాలంలో ద్వారతోరణాలకు శిల్పాలను చెక్కారు. ఇంచుమించు అదే సమయంలో అంటే రెండవ శతాబ్దిలో అత్యద్భుత శిల్పఫలకాలు వెలిశాయి అమరావతిలో... అంటే 1800 ఏళ్ళ క్రితమే అక్కడ ప్రజలు ఎంతో సృజనాత్మక ఆలోచనలను కలిగి ఉండి ఉండాలి.

లియొనార్డో డావిన్సీ, మైకేలాంజెలోలా వాళ్ల పేర్లు మనకు తెలియదు. వాళ్లు తమ పేరు కన్నా కూడా పనికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆ పనే నేడు అజరామరం అయింది. కాలానికి అతీతమైనది వాళ్ల సృజన....' ముగించాడు పీటర్.


నన్ను నేనే మైమరచిపోయాను. గట్టిగా చప్పట్లు కొడుతూ అతడిని కౌగలించుకున్నాను. అమరావతి డాక్యుమెంటరీ అత్యద్భుతంగా ఉందని ప్రశంసించాను. 'విదేశీ గడ్డపై పుట్టి మా స్థూపం గురించి నువ్వు చేసిన దాంట్లో ఇసుమంతైనా మేం చేయలేక పోయాం. అసలు ఇదంతా మా తెలుగునేల మీదే జరిగిందా! నాకు నమ్మబుద్ధి కావట్లేదు. అంతటి మహాద్భుతాన్ని ఎందుకు పట్టించుకోకుండా విడిచిపెట్టాం...' అంటూ సంజాయిషీ ఇస్తున్నట్టుగా మాట్లాడాను.

లండన్ మ్యూజియంలో మా అమరావతి గ్యాలరీ ఉన్నట్టుగా నాకు తెలియదు.

'నువ్వు విచారపడాల్సిన అంశమే ఇది. కాకపోతే కాస్త ఊరట కలిగించే విషయం చెప్పనా.. అమరావతి శిల్పానికి పొడిగింపుగా ఆంగ్‌కార్ వాట్ ఆలయ శిల్పాన్ని చెబుతారు. ఇక్కడి గోడలపై ఉన్న శిల్ప ఫలకాల్లో అమరావతి కళ కొట్టొచ్చినట్టుగా కన్పిస్తుంది. అవి వెతుకుతూ, వాటిని కుంచెలో బంధిస్తూ ఇక్కడ గడుపుతున్నాను' అన్నాడు.

నా మనసు బరువెక్కింది. నేను విజయవాడ లో పుట్టి పెరిగినా అమరావతి శిల్పం గొప్పతనం గురించి-లండన్ వాసి నుంచి తెలుసుకోవడం సిగ్గేసింది...చరిత్రను ఒదిలేశామా...అంత గొప్ప శిల్పం గురించి ఇసుమంతైనా మనకెందుకు అవగాహన లేదు. ఎక్కడా అమరావతి శిల్పం కటౌట్లు ఎందుకు కన్పించవు అన్న ఆలోచనలో ఉండిపోయాను.

'నీకు పూర్తిగా అర్థమయ్యేలా చెబుతా...రా...అంటూ పీటర్



ఆలయం లోపలికి నన్ను తీసుకు వెళ్ళాడు...

పెద్ద ప్రహరీ గోడ...ప్రహరీలోనూ కొన్ని ఆలయాలు ఉన్నాయి. ప్రవేశ మార్గం పక్కనే ఓ గుడి ఉంది. అందులోకి వెళ్లాం. మూడున్నర మీటర్ల ఎత్తున్న విష్ణుమూర్తి విగ్రహం గర్భగుడిలో కన్పించింది....

భారతీయ టూరిస్టులు కొందరు ఆ నిలుచున్న విష్ణుమూర్తి విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి హారతులు ఇస్తున్నారు. అందులో ఓ వ్యక్తి తెల్లని సిల్కు పంచె కట్టుకుని ఉన్నాడు. సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాడు. విదేశీ యాత్రికులు వారినంతా విచిత్రంగా చూస్తున్నారు.

'భూమ్మీద అతిపెద్ద హిందూ ఆలయంగా ఆంగ్‌కార్ వాట్ పేరు తెచ్చుకుంది.

12వ శతాబ్దిలో ఈ ఆలయాన్ని సూర్యవర్మ అనే ఖ్మేర్ జాతికి చెందిన చక్రవర్తి 500 ఎకరాలలో నిర్మించాడు.... ఆనాడు ఈ ప్రాంతాన్నంతా యశోధరపురం అని పిలిచేవారు.... కాంబోడియా దేశానికి పెద్ద చిరునామా ఈ ఆలయం. ఈ దేశ జాతీయజెండాలో కూడా ఆంగ్‌కార్ వాట్ ఆలయ చిహ్నాన్ని చూడవచ్చు...' ఓ గైడ్ టూరిస్టులకు వివరిస్తున్నాడు.

'ఆ ఖ్మేర్ చక్రవర్తి పేరు విన్నావా ? సూర్యవర్మ.. నీ పేరే ఆయనది కూడా ... మీ తెలుగునేలకు చెందిన విష్ణుకుండినులు... పల్లవులు....శాలంకాయనులు రాజుల పేర్లు చివరలో వర్మ అనే ఉంటుంది.... వాళ్లలో ఎవరో ఒకరు ఇంత దూరం వచ్చి ఉండాలి.

కాంబోడియాలోనే కాదు వియత్నాంలోని ప్రాచీన రాజ్యమైన చంపా రాజుల పేర్ల చివర కూడా వర్మ అనే ఉంటుంది...కాకపోతే వాళ్లని చామ్ జాతీయులని అంటారు. ఖ్మేర్లకు, చామ్ లకు అస్సలు పడదు. ఎన్నో సార్లు ఒకరిపై ఒకరు దండయాత్రలు చేసుకున్నారు... వీళ్లిద్దరిపై ఆధిపత్యం సాధించారు ఇండోనేషియాకు చెందిన శ్రీవిజయ చక్రవర్తులు...' తను పరిశోధించిన విషయాలన్నీ పీటర్ చెబు తున్నాడు. నాకు అసలు ఏమీ అర్థం కావటం లేదు. సాఫ్ట్‌వేర్లో ప్రోగ్రాములు రాసుకుంటూ ఉండే నన్ను ఈ హిస్టరీ టాపిక్ ఎందుకు చుట్టుకుందో ?!

'రెండో సూర్యవర్మ కంటే ముందు చక్రవర్తులు శివారాధన చేసేవారు. సూర్యవర్మ వైష్ణవాలయం నిర్మించాడు. ఆ తరువాత ఈ ఆలయం బౌద్ధాలయంగా మారింది. ఆగ్నేయాసియాలో అలనాటి ఖ్మేర్.. చంపా.. రాజ్యాలని హిందూ వలస రాజ్యాలని అంటారు .... ఇలాంటి హిందూ సంప్రదాయపరమైన ఆలయాలు చంపాలోనూ కన్పిస్తాయి. కానీ భారతీయ నేలల నుంచి ఇక్కడికి వచ్చి వలస రాజ్యాలను స్థాపించారా లేక వ్యాపారాల కోసం వచ్చిన వర్తకులు స్థానికులపై మెరుగైన స్థితిలో ఉండడం వల్ల రాజ్యాలను స్థాపించారా అనేది ఖచ్చితంగా తెలియట్లేదు. తెలుగు రాజులు వాడిన ఇంటి పేరుని వీళ్ళు ఎందుకు పెట్టుకున్నారు.. ఆ శిల్ప రీతుల్ని ఇక్కడికి ఎందుకు మోసుకువచ్చారు. ఈ విషయాలు తెలుసుకోవడానికే నేను అమరావతి వెళ్తున్నాను' పీటర్ ధోరణి పీటర్ ది.

తన మాటలు నాలో ఆలోచనల ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తెలుగు నేలకు ఇంత దగ్గరగా ఉన్న ఈ రాజ్యాల గురించి మన పాఠ్యపుస్తకాల్లో ఎందుకు చర్చించలేదు...

ఇవన్నీ నాకింతకాలం ఎందుకు తెలియలేదు.. అమరావతి... అమరావతి.. అని ఎంతో ఆశపడుతున్నాడు. అసలు అక్కడ ఏం మిగిలిందని! నాలో నేనే అనుకున్నా.

ఇలా అనేక ఆలోచనల మధ్య విష్ణువాలయం వెనుక భాగం నుంచి మెట్లు దిగి లోపలికి వచ్చాం. ఒక్కసారిగా నా ఆలోచనలు ఆగిపోయాయి. మూడు వందల మీటర్ల దూరంలో మరో ప్రాకారం. మధ్యలో రాళ్ల దారి నిర్మించారు. అటూ ఇటూ కొలనులు.. ఆ ప్రాకారం లోపల ఎన్నో ఆలయ గోపురాలు.. అది కేవలం ఆలయం కాదు మరో ప్రపంచం...రాళ్లతో నిర్మించిన ఆలయాలు.. ఎన్నో



ప్రాకారాలు..

మండపాలు....ప్రధానాలయం శిఖరం ఆకాశంలోకి చొచ్చుకు పోయినట్టుగా ఉంది...దానికి నాలుగు వైపులా నాలుగు శిఖరాలు ... పద్మం విచ్చుకున్నట్టుగా ఉంది. రెండో ప్రాకారంలోని ప్రవేశ ద్వారంలోంచి లోపలికి వచ్చాం.

ఈ ఆలయ సముదాయాన్ని చూస్తే సామర్లకోట ఆలయానికి వంద రెట్లు పెద్దగా అనిపిస్తోంది ... ప్రధాన ఆలయంలోకి వెళ్లేందుకు నాలుగు వైపుల నుంచి మెట్లున్నాయి. ఇవన్నీ ఎంతో నిటారుగా ఉన్నాయి. దాదాపు 50 దాకా ఉంటాయి.

తాళ్ల సహాయం లేకుండా ఎక్కడం అసాధ్యం. అప్పట్లో రాజులు ఆజానుబాహులై ఉండాలి ... పైకి వెళ్లేసరికి ప్రధాన ఆలయ ద్వారం మూసి ఉంది. అక్కడ ఓ పెద్ద బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్టించారు.

'లోపల రాజు సమాధి ఉందట.' పీటర్ రహస్యం చెబుతున్నట్టు చెవిలో చెప్పాడు.

'అవునా'.. ఆశ్చర్యపోయా. మెట్లు దిగి కిందకి వచ్చేశాం.

గోడ దగ్గర ఆగిపోయాడు పీటర్..

గోడలనిండా శిల్ప చిత్రాలే... ఓ క్షణం వాటిని చూస్తూ నా కేసి తిరిగాడు... 'ఈ శిల్పఫలకాలను సున్నపురాయితో రూపొందించారు. అమరావతి శిల్పఫలకాలు కూడా సున్నపురాయివే. అయితే అక్కడ అన్నీ బుద్ధుడి కథలే కానీ ఇక్కడ రామాయణ ... మహాభారత ఇతిహాసాలు ఎక్కువ.

అప్సరసలు ... మానవులు... జంతువులు ఇలా అన్నీ ఉన్నాయి. గోడలు... స్థంభాలు ... పైకప్పులపై కూడా శిల్పాల కథలే.. అమరావతిలో కూడా అంతే.

అంగుళం కూడ ఖాళీ ఇవ్వకుండా శిల్పాలు చిత్రించారు . ఆనాడు అమరావతి పెద్ద వాణిజ్య కూడలి. భారీ స్థాయిలో వర్తకవ్యాపారాలు జరిగేవి. వివిధ దేశాల వర్తకులు వస్తూ పోతూ ఉండేవారు. వ్యాపారస్తులతో పాటు శిల్పులు, కళాకారులు కూడా వలసలు వచ్చారా? లేక అక్కడి శిల్పాలను చూసి అదే తరహాలో ఇక్కడ నిర్మించారా? ఇవన్నీ చరిత్రకారులు తేల్చాల్సిన ప్రశ్నలు!





దీర్ఘాలోచనలో మునిగాడు.

ఒకటి మాత్రం నిజం... ఆంగ్‌కార్ శిల్పానికి స్ఫూర్తి మాత్రం అమరావతే. ఆ పోలికలు ఎంతో స్పష్టంగా కన్పిస్తున్నాయి...' అని ఆగాడు.

నేను విస్తుపోతూ అతడి మాటలు వింటున్నా.. ఓ అనిర్వచనీయమైన అనుభూతి ఆ శిల్పదారుల మధ్య ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

చాలామంది టూరిస్టులు ఆ పరిసరాల్లో తమని తామే మర్చిపోతున్నారు. గైడ్ చెప్పే సంగతులు వింటూ వేరే లోకాల్లో విహరిస్తున్నట్టుగా ఉన్నారు. ఎటువంటి ఆధునిక యంత్ర సహాయం లేకుండా ఇంతటి మహా అద్భుతాన్ని ఎలా ఆవిష్కరించారు... అమరావతి స్తూపం కూడా చెక్కుచెదరకుండా ఉంటే వేలాదిమంది అనునిత్యం సందర్శిస్తూ ఉండేవారు కదా అని ఆలోచనలో ఉండిపోయాను ...

నా చేయి పట్టుకొని నీకు ఓ అద్భుతం చూపిస్తారా అంటూ నన్ను ముందుకు తీసుకు వెళ్లాడు పీటర్. అతడిలోని ఆ ఉత్సాహం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది.

అక్కడ ఓ శిల్పఫలకం...ఏనుగు సవారీ మీద ఓ రాజు కూర్చున్నాడు...సైనిక సపరివారంగా ఏదో యుద్ధానికి వెళుతున్నట్టుగా చెక్కారు.

' ఆ రాజే సూర్య వర్మ.. నేటి పారిస్ అంత మహానగరాన్ని ఎనిమిది వందల ఏళ్ల క్రితమే నిర్మించిన మహా గొప్ప చక్రవర్తి' అంటూ ఆవేశంగా మాట్లాడుతున్నాడు...ఆనాడు లంపూర్లో ఫ్రెంచ్ ప్రొఫెసర్ నా పేరు వినగానే ... 'సూర్య వర్మ ది గ్రేట్ అని ఎందుకన్నాడో అర్థం అయింది. ఇంతటి గొప్ప ఆలయాన్ని కట్టించిన రాజు తప్పకుండా ఎంతో గొప్పవాడే.


నేను ఎంతో సంబరంతో.. ఉప్పొంగిన మనసుతో సూర్యవర్మ శిల్పాన్ని స్పృశించాను..

అంతే భూకంపం వచ్చినట్టుగా అనిపించింది .

(తరువాయి వచ్చే సంచికలో...)

మధురాంతకం నరేంద్ర
9866243659

విహారిగారి వసుధైక కుటుంబం



విహారిగారి కథలన్నీ చదివాక, ఆ కథలన్నింటిలోనూ ఆయన వ్యక్తిత్వం, లోకమంతా వ్యాపించిన గాలిలాగా, పరివ్యాప్తమై వుండడం గమనించాక, ప్రత్యేకంగా ఆయన వ్యక్తిత్వాన్ని పూర్తిగా, స్పష్టంగా పట్టిచ్చే కథేమిటని ప్రశ్నించుకుంటే, అందుకు సమా ధానంలా, 'వలయం' అనే కథ నా ముందు నిటారుగా నిలబడింది. తనను యెన్నికచేసిన కథల సంపుటికి, విహారిగారు ఆ కథనే మొదటి కథగా తీసుకోవడం వెనక, ఆ కథ తన సాహితీ జీవనానికి ముందుమాటగానో, భూమికగానో ఆయన భావించినట్టుగా నాకు తోచింది.

కొడుకు జీవితంలో యెదురుదెబ్బలు తగిలినప్పుడల్లా వాడికి తోడ్పడడం తండ్రి బాధ్యత. కొడుకు సమస్యల్ని తండ్రి పరిష్కరించడంలో ఆశ్చర్యమేముంటుంది? వ్యక్తిగత ప్రేమను సామాజిక ప్రేమగా పెంపొందించుకోవడంలోనే మనిషి గొప్పతనం ముడిబడి వుంటుంది. 'వలయం' కథలోని కథకుడు దూరపు బంధువుల యిబ్బందులకేగాదు, పరిచితులైన వాళ్ళెవరడిగినా, వాళ్ళకు తోడ్పడడం తనకి బాధ్యతగా భావిస్తారు. తన సహాయంవల్ల సుఖపడ్డవాళ్ళు, తనపట్ల కృతజ్ఞతల్ని వెల్లడించబోతే, అందులో తాను చేసిన పనేమీ పెద్దదిగాదని నమ్ముతాడు. అలా కాకుండా, యెవరైనా తాను కలగజేసుకోడంవల్ల యిబ్బందికి గురైతే, తాను తప్పేదైనా చేశానేమోనని తల్లడిల్లిపోతాడు. యెదుటి మనిషి మనస్సుకు నొప్పి కలగకుండా జాగ్రత్త పడుతూ, అతను అప్పజెప్పిన బాధ్యతను చిరునవ్వుతో, ఆత్మ విమర్శ చేసుకుంటూనే, చేసుకుపోతాడు. యీ బాధ్యతల వలయాల నుంచీ ఆ కథకుడు బయట పడాలని యెప్పుడూ అనుకోడు.

కుటుంబమనే మౌలిక సమాజం నుంచీ, ప్రపంచమనే విస్తృత సమాజం వరకూ, విహారిగారి సభ్యత్వ స్పృహ గాఢంగా ఆయన కథలన్నింటిలోనూ ప్రతిఫలిస్తూ వుంటుంది. కథకుడుగా ఆయన బాధ్యత గుర్తెరిగిన రచయిత అనీ, ఆ కర్తవ్య నిర్వహణ నుంచీ తప్పుకోవడం ఆయనకు అసాధ్యమనీ చెప్పడానికి అయిదు దశాబ్దాలుగా ఆయన నిర్విరామంగా రాస్తున్న రచనలే పెద్ద సాక్ష్యం.

1970-80 ల మధ్యలో ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రప్రభ, యువ, జ్యోతి వంటి పత్రికల్లో మధ్య తరగతికి చెందిన రచయితలే పుంకాను పుంకాలుగా కథలు రాశారు. సహజంగా ఆ రచనల్లో మధ్య తరగతి మనుషుల వుత్థాన పతనాలే వస్తువులయ్యాయి. వాళ్లందరిలోనూ యిప్పటి వరకూ ఆపకుండా రాస్తున్న కథకులు విహారిగారొక్కరే! యెప్పుడూ జన జీవనంలో వొకడుగా మమేకంగావడం, తన అనుభవ పరిధిలోకొచ్చిన విశేషాలనంతా సాహిత్యీకరించడం ఆయన జీవన స్వభావంగా మారిపోయింది.

కథ చెప్పడంలో విహారిగారిది ప్రసన్న కథా కవితార్థ యుక్తే! ప్రసన్నంగా, స్నేహంగా, ఆర్ద్రంగా, భుజంపైన చెయ్యేసుకుని నడుస్తున్న స్నేహితుడు- కథ చెప్తున్నట్టుగా వుంటాయి ఆయన కథలు. మన తొలినాటి కథకులందరిలాగే విహారిగారిది గూడా మౌఖిక ధోరణి. చాలా కథల్లో కథ చెప్పే వ్యక్తి కథలోని పాత్రే అయి వుంటాడు. కొన్నిసార్లు ప్రధాన పాత్రగానూ, మరొకొన్నిసార్లు చిన్న పాత్రగానూ వుంటాడు. సర్వసాక్షి కథనం వున్న కథల్లో, రచయిత స్వభావం, వ్యక్తిత్వం, కథనంతా తీర్చిదిద్దుతుంది. అలా ఆయన కథలన్నింటిలోనూ పరుచుకున్న విహారిగారి వ్యక్తిత్వం, 'వలయం' కథలోని కథకుడి స్వభావానికి చాలా దగ్గరగా వుంటుంది. అతను మనుషుల్ని ప్రేమిస్తారు. ప్రకృతినీ, జీవితాన్నీ, గౌరవిస్తాడు. తాను సంతోషంగా వుంటూ, తన చుట్టూ వున్న వాళ్లని సంతోష పెట్టడమే ధ్యేయంగా జీవిస్తాడు. తన ప్రేమను తన కుటుంబానికి పంచినంత నిబద్ధతతోనే. మొత్తం సమాజానికీ పంచుతాడు. మంచిని గుర్తించి పూజిస్తారు. చెడును ప్రేమతోనే జయించాలని చూస్తాడు. మధ్య తరగతి పునాదులపైన విస్తరిల్లిన మన దేశపు సౌభాగ్యానికి, మధ్యతరగతి వాళ్ల మానవీయ విలువలే ఆధారమని చాటిస్తాడు. మధ్యతరగతిలో వుండే కుహనా విలువల్ని వదులుకునే మార్గాల కోసం అన్వేషిస్తాడు. యిదంతా వొక జీవన విధానం. విహారిగారి స్వాభావికమైన యీ జీవన విధానానికి పెరిగిన కొమ్మలూ, ఆకులూ, పువ్వులూ, పళ్లే ఆయన రచనలు.

వ్యక్తిగా సమాజంపైనా, మనుషులపైనా గౌరవమున్నట్టే, విహారిగారికి సాహిత్యమన్నా, పాఠకులన్నా చాలా గౌరవముంది. పాఠకుడి సమయాన్ని వృధాగానివ్వడాయన. కథకు అనవసరమనుకున్న అదనపు బరువుల్ని తీసుకురాడు. కథను యెంత చెప్పాలో అంతే చెప్తాడు. వొక వాక్యమైనా, పదమైనా అనవసరమన్నది లేకుండా జాగ్రత్త పడాలనుకుంటాడు. కథకు కావల్సిన కంఠ స్వరాన్నీ, శైలినీ సునాయాసంగా అందిపుచ్చుకుంటాడు. కథ ప్రారంభమయ్యాక అది పంచ కళ్యాణి గుర్రంలాగానో, నవ్వుల నదిలో పువ్వుల నావలాగానో, ఠీవిగా చివరి వరకూ సాగిపోయేలా చూస్తాడు. కథనంలో యెక్కడా గతుకులుండవు. ముగింపెప్పుడూ కథకు కొనసాగింపుగానే వుంటుంది గానీ, అతికించినట్టుగా వుండదు. ప్రతికథా వొక జీవన

శకలంలా పచ్చగా, కళకళలాడుతూ వుంటుంది.

విహారిగారు తానో మంచి పాఠకుడ్నని చెప్పుకుంటారు. అందుకే ఆయన తన ముందున్న రచయితల మార్గంలోనే నడుస్తూ తనదైన విలక్షణ పద్ధతిని ఆవిష్కరించుకోగలిగారు. చాసో లా కథనంలో పొదుపునే పాటించినా కొన్ని చాసో కథల్లా ఆయన కథలు వ్యాసాలు కాలేదు. కుటుంబరావుగారిలా మధ్యతరగతి బ్రాహ్మణుల జీవితాల గురించే యెక్కువగా రాసినా, ఆయన కథలూ, వస్తువులూ, వేటికవి ప్రత్యేకంగా వుంటాయి. బుచ్చిబాబు తనకిష్టమైన కథకుడే అయినా, కథకు కావల్సినంత మేరకే వర్ణనలు పొదుపుగా వాడుకుం టారు. మొదటి వాక్యంతోనే పాఠకుల్ని కథలోకి లాక్కెళ్లిపోతారు. చివరి వరకూ వుత్కంఠతతో కథను నడిపిస్తారు. చిన్న కథనూ పెద్ద మెరుపుతోనే ముగిస్తారు. కథ ముగిశాక కూడా పాఠకుడు దాన్ని వెంబడించాలని కోరుకుంటారు.

విహారిగారి కథా ప్రపంచంలోకి అడుగుపెట్టడమంటే, అది సమకాలీన సమాజపు కోణాలన్నింటినీ పరామర్శించడమే అవుతుంది. కథకుడుగా ఆయన చాలా అప్రమత్తంగా వుంటాడు. తన తరువాతి తరాలనూ సానుభూతితో అర్థం చేసుకోవడానికే ప్రయత్నిస్తాడు. కొత్త నీరు పాత నీళ్లని తరిమేసే ధర్మం తన తరానికీ తప్పదనీ, తాతనీ బామ్మనీ వృద్ధాశ్రమానికి పంపాక చాలా రిలీఫ్‌గా ఫీలయ్యే తన కొడుకు భవిష్యత్తులో తమపట్ల గూడా అదే రకంగా వ్యవహరించక పోడని గుర్తిస్తాడు. రోగిష్టి తల్లిదండ్రుల్ని దుర్మార్గంగా విడిచిపెట్టి, విదేశాలకెళ్ళిపోయే పిల్లలు, నిస్వార్థంగా ఆ ముసలివాళ్లకు తోడ్పడు తున్న కూలి జనాల చిత్తశుద్ధిని శంకించినప్పుడు-నిరసిస్తాడు. ప్రయాణంలా సాగే జీవితంలో యెదురైన అనుభవాల నుంచీ, పాఠాలు నేర్చుకుని, హాయిగా ముందుకే సాగాలని హెచ్చరిస్తాడు.

అధోజగత్ సోదరులనూ, కింది మధ్యతరగతి వాళ్లనూ "డబ్బు" యెంతగా వేధిస్తుందో విహారిగారికి బాగా తెలుసు. అయితే మధ్య తరగతి మనుషుల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తున్న వ్యాపార సంబంధాల్ని నిరసిస్తున్న కథల్లో గూడా ఆయన మానవ సంబంధాల మాధుర్యాన్ని నొక్కి చెప్పడం మరచిపోరు. యెదిగిన కూతుర్ని రాబందుల భారి నుంచీ తప్పించడం కోసం నానా బాధలు పడే తల్లులూ, పుస్తకాన్ని కొనగలిగే అయిదు రూపాయల కోసం ప్రమాదకరమైన పందెపు బరిలో దిగే కుర్రాళ్ళూ, బతకలేని వుద్యోగం చేసి బాధ పడుతున్న కొడుకును ఆదుకోవడం కోసం బిక్షమెత్తడానికి గూడా సందేహించని ముసలి తండ్రులూ, బతుకు బరువు మోయ డానికి యిష్టంలేని పాత రోత పనులలోనే ముడుచుకుపోవడానికి సిద్ధపడే నిర్భాగ్యులూ, కూతుళ్ళకు పెళ్ళి చేయాల్సిన వయస్సులో గూడా నిస్సిగ్గుగా బిడ్డల్ని కనే తండ్రులూ, అవసరం కోసం అంగ వైకల్యం వుండే అమ్మాయిల్ని పెళ్ళాడ్డం తప్ప మరో మార్గం దొరకని నిస్సహాయులూ యీ మధ్య తరగతి విలాపాలూ, విలాసాలూ విహారిగారి సాహిత్య ప్రపంచంలో మనకెదురౌతారు.

అయినా విహారిగారి కథా ప్రపంచంలోకి అడుగుపెట్టడమంటే జీవన సంరంభంలోకి అడుగు పెట్టడమే అవుతుంది. ఆయనకున్న సానుభూతి, సహానుభూతి జీవితాన్నొక వుత్సవ సంరంభంగా మారు స్తుంది. రచయితకు జీవితంపైన, ప్రపంచంపైన వుండే గౌరవం, యిష్టం, ఆయన కల్పనా సాహిత్యాన్ని ఆనంద దాయకంగా మారు స్తుంది. చుట్టూ వుండే చీకటిని తిడుతూ కూచోవడం కంటే, చిన్నదైనా వో ప్రమిదెను వెలిగించడమే ఆయనకిష్టం. మనుషుల్లో వుండే మంచితనాల్ని గుర్తించి, వెల్లడించి, ప్రేమించడమే వ్రతంగా బతికే వరమ్మలూ, అవసరం వచ్చినప్పుడు గతమంతా మరిచి ఆదుకునే వదినమ్మలూ, బతుకంతా బాధ్యతల్ని సునాయాసంగా మోసే భద్ర మహిళలు సుభద్రమ్మలూ, భర్త ఆంతర్యాన్ని మంచికే మొగ్గే శ్రీనివా సులూ – వీళ్లంతా తమ మంచితనంతో ముగ్ధుల్ని గావించి, జీవితం పట్ల అనురక్తిని రేకెత్తిస్తారు.

విహారిగారిది ధర్మాగ్రహం. పీడనలోంచీ పీడనే పుడుతుందని ఆయన హెచ్చరిస్తారు. భర్త దుర్మార్గానికి వెరచి, యికపైన పీడితుల శాపాల్ని భరించలేనంటూ, అతగాడు చేసిన పొరబాట్లను సరిదిద్ద పూనుకున్న పార్వతమ్మ పాఠకులకు చెప్పాల్సిన పాఠం స్పష్టంగానే చెప్పేస్తుంది. సమాజంలో యింత దుర్మార్గముండడానికున్న కారణా లను ఆయన కథలన్నీ తరచి చూస్తాయి. యీ లోకాన్ని మరింత అందంగా తయారు చేయడమెలాగో సూచిస్తాయి.

విహారిగారి కథలు రాత్రి వుతికి ఆరేసిన నేత చీరను తెల్లవారు జామున కప్పుకున్నట్లుగా వుంటాయి. లే వెన్నెల్లో కమ్మతెమ్మర వీస్తున్న ట్టుగా దగ్గరౌతాయి. కష్టాలనూ, కడగండ్లనూ చూసినప్పుడు ఆగ్ర హంతో సూర్యశకలంలా మండిపోయినా, యిరుసున బెట్టిన కందెనలా కారిపోయినా, చివరకు వాత్సల్యమే జీవితమై ప్రవహించినట్టుగా సాగుతాయి.

జనవాక్యం

'అమ్మనుడి' చేస్తున్న సేవకు అభినందనలు

1. స్నాతకోత్తర స్థాయిలో తెలుగు మాధ్యమం ప్రవేశ పెట్టాలి. అంతేకాక మెడిసిన్, ఇంజనీరింగ్, వ్యవసాయశాస్త్రం లాంటి విషయాల్ని తెలుగు మాధ్యమంలో బోధించాలి.

2. అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం లాంటి విషయాల్ని స్నాతక స్థాయిలో ఇప్పటికీ కొన్నిచోట్ల తెలుగు మాధ్యమంలో బోధిస్తు న్నారు- విద్యార్థులకు అర్థమయేందుకని. విస్తృతస్థాయిలో ఇది జరగాలి.

3. ఆంగ్లాన్ని ఐచ్ఛిక విషయంగా బోధించాలి. తప్పనిసరి అంశంగా కాకుండా. ఆంగ్ల మాధ్యమం ఏ స్థాయిలోనూ అందకూడదు.


4. పాలనాభాషగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగే అమలు చేయాలి.

5. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగాల్లో ప్రత్యేక కేటాయింపు (రిజర్వేషన్) ఉండాలి.

– డా॥ తక్కేలు మాచిరెడ్డి
9666626546

ధారావాహిక

జోగిని మంజమ్మ ఆత్మకథ ⑦



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289

(గత సంచిక తరువాయి...)

గురువు చేసిపెట్టిన వంటకాలు తినేదాన్ని !

ఇలాంటి కష్టాల్లో హగరిబొమ్మనహళ్ళి జోగమ్మలతో ఆరునెలలు కాలం గడిపాను.

బతుకుతెరువు కోసం, కడుపు నింపుకోవడం కోసం 'భిక్షమెత్తే' వృత్తిని వదల్లేదు.

ఆ కాలంలో చెరువుగట్టుకు 'అలసందుల' కోతలకు వెళ్ళడం, మా జోగమ్మలకు పెద్ద లాభదాయకమైన విషయం.

అలసందుల కోతల్లో రైతులు వేసిన రాశుల ముందు మా కొంగు చాపితే మాకు కావలసినన్ని అలసందులు తీసుకున్నా రైతులు ఏమీ అనేవాళ్ళు కాదు. అప్పటికాలంలో అలసందులు పన్నెండు రూపాయలకు కె.జి.వచ్చేవి. రైతుల్లో మా పట్ల అంతటి అభిమానం ఉండేది. నమ్మకమూ ఉండేది. అయితే ఇప్పుడు తగ్గింది.

ఒక రోజు మేము ముగ్గురం జోగమ్మలు అలసందుల కోసం తంబ్రళ్ళికి వెళ్ళాం. కాళవ్వ జోగమ్మ బృందంవారు కూడా అక్కడికి వచ్చారు. వాళ్ళు నన్ను చూశారు. అప్పుడు నాతో ఉన్న జోగమ్మలకు ఏమైందో తెలియదు. నన్ను వదిలి వెళ్ళిపోయారు. దాంతో నేను ఒంటరినయ్యాను. ఆ రోజు చాలా దుఃఖం కలిగింది. నేను తండ్రి, తల్లి, ఇల్లు వదిలి వచ్చిన రోజున కూడా అంత సంకటపడలేదు. ఆ సంకటంతోనే భిక్షాటన చేశాను. తుంగభద్ర నది ఒడ్డున తిరిగాను. ఎక్కడ కూర్చున్నా సమాధానం కాలేదు. అలాగని భిక్షం అడగకుండా ఊరక ఉండటానికి లేదు. అప్పులు పెరిగాయి. భిక్షం ముగించుకుని ఊరికి వెళదామని సాయంకాలం త్రంబళ్ళి బస్టాండుకు వచ్చాను. అక్కడ కాళవ్వ జోగమ్మ, వారి బృందంలోని వాళ్ళు ఉన్నారు.

నేను చాలా అలసిపోయాను.

నాలో దుఃఖం పొంగుకు వస్తోందని నాకు తెలుస్తోంది.

అయితే బలవంతంగా అదిమి పెట్టాను.

అయితే నా బాధ, నా దుఃఖం నా ముఖంలో కనిపిస్తోందని నాకు తెలుసు.

నేను దుఃఖంలో ఉంటే నా ముఖం ఎలా మారిపోతుందో వాళ్ళకూ తెలుసు. అయినా నన్ను పిలవలేదు. అప్పుడు సోమక్క జోగమ్మ, 'ఆ రోజు ఆ అమ్మాయి నీ మాటలు విని, మనల్ని నమ్మి, చిలకనట్టి వదిలి వచ్చేసింది. మనమే ఇలా చేస్తే ఎక్కడికి పోవాలి? అది తెలుసో, తెలియకో తప్పు చేసింది. ఇప్పుడు ఒంటరిదైంది. మన వెంట పిల్చుకునిపోదాం' అని అందట. అందుకు కాళవ్వ, 'లేదు, ఆమెకు దెబ్బ పడాలి. బాధలు అనుభవించాలి. కష్టపడితే జీవితం అంటే ఏమిటో తెలుస్తోంది. అప్పుడు పెద్దవాళ్ళు-చిన్నవాళ్ళు, తల్లి-తండ్రి, గురువు అందరు గుర్తువస్తారు. వాళ్ళ గొప్పదనం తెలిసొస్తుంది' అని చెప్పి అందరిని పిల్చుకునిపోయిందట. అయితే ఆ రోజు రాత్రి 'సోమక్కా, నువ్వు చెప్పిన మాట నేను వినలేదు. మంజమ్మ ఇల్లు చేరిందో లేదో?' అని కాళవ్వ బాధ పడిందట.

(నేను కాళవ్వ బృందంలో మళ్ళీ చేరిన తరువాత ఈ విషయం సోమక్క నాతో చెప్పింది)

ఇలా జరిగిన మరుసటి రోజు హరపనహళ్ళి సంతకు భిక్షానికి వెళ్ళాను. అక్కడ కాళవ్వ జోగమ్మల బృందం కనిపించింది. నన్ను చూసిన కాళవ్వ రమ్మని పిలిచి నాకు బుద్ధి చెప్పింది. అంతేకాకుండా సోమక్క జోగమ్మను నాకు జత చేసి గొల్లరహళ్ళిలో ఇల్లు తీసుకుని అక్కడే మమ్మల్ని ఉంచింది.

ఆ రోజు ఆమె ఆ ఊళ్ళో ఉంచినందుకే ఈ రోజు నాకు ఇల్లు దొరికింది. ఓటింగ్ కార్డు దొరికింది. అన్నిటిని మించి ఆమె నన్ను కళాకారిణిగా తీర్చిదిద్దింది. ఈ రోజు నేను ఏదైనా కళాసేవ చేసివుంటే లేదా కళారంగంలో ఏదైనా అభివృద్ధి సాధించివుంటే అదంతా ఆమె ఆశీర్వాదంతో మాత్రమే. ఆమె ఈ రంగంలో కళాసేవ చేసినందుకే నాకు గొప్పగొప్ప అవకాశాలు దొరికాయి. నిజానికి అవి గురువుకు



దొరకాల్సిన అవకాశాలు. ఈ రోజు ఆమె ఉండివుంటే ఆమెకు ఎన్ని పురస్కారాలు దొరికేవో? ఆ యల్లమ్మకే తెలుసు. ఆమెది అద్భుతమైన కంఠ స్వరం. ఎన్ని వేల నాటకాలు వేసిందో ! ఒక్కొక్క ఊళ్ళో రోజుకు కనీసం నాలుగైదు సార్లు నాటకం వేసింది. పల్లెవాళ్ళు ఈ రోజు ఈ వీధిలో నాటకం ఆడిస్తే, మరుసటి రోజు మరో వీధిలో నాటకం వేయించేవాళ్ళు. ఆమె యల్లమ్మ పాత్ర చేసేది. ఆమెతో కనీసం 25 మంది పరశురాముడి పాత్రలు వేశారు.

ఆమె కంఠం ముందు వాయిద్యాలు ఓడిపోయేవి. అంటే ఆమె పాడుతున్నప్పుడు దూరంలోని జనాలకు వాయిద్యాల సద్దు వినిపించేది కాదట. వలకళ్ళి (ఇప్పుడు ఆ ఊరును కొండాపుర అంటారు) గ్రామంలో నాటకం వేస్తే మల్లాపుర గ్రామ ప్రజలకు వినిపించేదట. ఒకటిన్నర కిలోమీటరు దూరానికి కూడా వినిపించే కంఠం ఆమెది. పాటలను అవలీలగా పాడేది. ఇలా కథలు చెప్పి, నాటకాలు వేసి జోగమ్మలకు సమాజంలో ఒక స్థానాన్ని సృష్టించి పోయింది. ఈ నాటకానికి అభిమానులను తెచ్చిపెట్టింది. ఈ రోజు మేము కూర్చుని ఇలా భోజనం చేస్తున్నామంటే ఆమె చేసి పెట్టిన వంట అనుకోవాలి. మా కోసమే ఆమె కట్టిపెట్టిపోయిన బుత్తి. దాన్ని మేము తింటున్నాం. నేనూ తింటున్నాను.

అయితే ఆమె కలను సాకారం చేస్తున్నాననే సంతృప్తి నాకు ఉంది.

ఈ విషయాన్ని నేను చెప్పడంకన్నా ఎక్కువగా జనం చెప్పాలి.

ఆమె స్థాపించిన బృందంలో శ్రమిస్తూ, జోగిని నృత్యాన్ని ప్రదర్శిస్తూ, మంచి కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని గడుపుతున్నాను.

మాతో నాటకం వేస్తే అపశకునమట !

ఇప్పుడు ప్రభుత్వం మమ్మల్ని 'మంగళ ముఖి'లని పిలుస్తోంది.

మా దృష్టిలో అది మంచి పేరు.

ఆ పేరు వాడుకలోకి వచ్చిన తరువాత మా జీవితాలు కూడా మంగళకరమవుతూ పోయాయి.

సమాజంలో మమ్మల్ని చూసే దృష్టి కొద్దిస్థాయిలో మారింది.

కళా ప్రదర్శనకు అవకాశాలు పెరిగాయి.

మరియమ్మనహళ్ళి నాటకరంగ కళాకారులు 'ప్రభుత్వమే వీళ్ళను (జోగమ్మలను, తృతీయలింగులను) మంగళముఖిలుగా గుర్తించింది. వీళ్ళను చేర్చుకుని మేమేందుకు నాటకం వేయకూడదు" అని మాతో కలిసి, మమ్మల్ని తమ బృందంలో చేర్చుకుని నాటకం వేశారు.

'మోహిని భస్మాసుర' అనే నాటకంలో నేను భస్మాసురుడిగా, గౌరమ్మ జోగమ్మ దేవేంద్రుడిగా, రామవ్వ జోగమ్మ బ్రహ్మదేవుడిగా అభినయించాం. శ్రీమతి ఇళకల్లు ఉమారాణి, శ్రీమతి నాగరత్నమ్మ మాతో కలిసి నటించారు. ఇలాంటి మార్పులకు నాగరత్నమ్మే ప్రముఖ కారకురాలు.


ఆ రోజు మా అందరికి చాలా సంతోషం కలిగింది. ఎందుకంటే గొల్లరహళ్ళిలో ప్రతి సంవత్సరం దేవీ జాతర జరుగుతుంది. ఆ జాతరలో నాటకం వేసే పరంపర కొనసాగుతూ వస్తోంది. ఆ నాటకంలో నాకు నటించాలన్న కోరిక కలిగింది. అందువల్ల ఒకసారి ఊరివాళ్ళను అడిగాను. ఊరివాళ్ళు కూడా అంగీకరించారు. నా దగ్గర నాటకానికి ఇవ్వడానికి డబ్బులు లేవని చెప్పాను. అప్పుడు ఊరిప్రజల్లో 'మంజమ్మ పాత్ర వేస్తుందంటే నేను డబ్బు ఇస్తాను, నేను డబ్బు ఇస్తాను' అని నలుగురైదుగురు ముందుకు వచ్చారు. 'మంజమ్మకు కిరీటం పెట్టి పదిచేతులు పెడితే దేవతలా కనిపిస్తుంది. అలాంటి సన్నివేశాన్ని చూసి మనం సంతోషించాలి' అని అన్నారు. అప్పుడు నాకు కలిగిన సంతోషాన్ని వివరించడానికి నాకు మాటలు దొరకటం లేదు.

ఆ ఉత్సాహంతో డైలాగులను కంఠస్థం చేయడం ఆరంభించాను. భిక్షానికి వెళ్ళినా చౌడికెలో నాటకం పుస్తకం పెట్టుకుని వెళ్ళి సమయం దొరికినప్పుడల్లా కంఠోపాఠం చేశాను. సంతలలోనూ తిరుగుతూ డైలాగులను మననం చేసుకుంటున్నాను. అంత ఉత్సాహంతో నేర్చుకున్నాను.

జాతర దగ్గర పడుతుండగా నలుగురైదుగురు గ్రామపెద్దలు నా దగ్గరికి వచ్చి,'మగజోగమ్మలు మా నాటకంలో నటించకూడదు' అని అన్నారు. 'ఎందుకు?' అని అడిగాను.

అప్పుడు, "మగజోగమ్మలతో నాటకం వేస్తే అపశకునం అంట. అంతేకాకుండా పక్కనున్నపల్లెలవాళ్ళు,'ఊళ్ళో మగవాళ్ళు లేరా? మగజోగమ్మల చేత పాత్ర వేయిస్తున్నారుకదా, మీరు మగవాళ్ళు కాదా?' అని అడుగుతున్నారట. అందువల్ల ఊరి కుర్రవాళ్ళు మీ చేత పాత్ర చేయించవద్దంటే వద్దని అంటున్నారు. కాబట్టి నువ్వు నాటకంలో నటించకు" అన్నారు.

ఆ రోజు నాకు చాలా అవమానంగా అనిపించింది. ఉన్న ఊరిలో ఇలాంటి అవమానాన్ని నేను ఎన్నడూ అనుభవించలేదు.



(...తరువాయి 48 వ పుటలో)

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా. కాళిదాసు పురుషోత్తం
9000642079

'ఆమె లేఖలు'

(గత సంచిక తరువాయి...)

నాలుగోలేఖ : నాలుగోజాబు అక్టోబరు 6వ తేది. ట్రిస్టన్ డి అకున్హా అనే ప్రదేశం చేరారు. అక్కడికి చాలా కొద్ది ఓడలు మాత్రమే వెడతాయట. అది ఒకనాటి అగ్ని పర్వతం. సముద్ర మట్టానికి 8 వేల అడుగుల ఎత్తున ఒక రాతిప్రదేశం. బోనపార్టీ హయాంలో లార్డ్ కానల్‌రీ అక్కడొక స్థావరాన్ని ఏర్పరచి, కొంతమంది సైనికుల్ని నియమించాడట. వాళ్లలో కొన్ని కుటుంబాలు ఇప్పటికీ అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకొని వున్నారని ఆమె రాస్తుంది. అక్కడి గవర్నరును ఒకప్పుడు కార్పొరల్ గ్లాస్ అనేవాళ్లు. అతను, అయిదుగురు అంగరక్షకులు, వాళ్లభార్యలు, 32 మంది సంతానంతో ఆ ద్వీపంలో ఇరవై ఏళ్లుగా వుంటున్నారు. ఓడ నేరుగా ఆ ప్రాంతానికి వెళ్లలేకపోయేసరికి, 'గ్లాస్‌నే' నలుగురు మనుషుల్ని వెంటపెట్టుకొని ఓడ వద్దకు వచ్చాడు. వాళ్లకు కెప్టెన్ మంచి భోజనం పెట్టి, కానుకలిచ్చి గౌరవించాడు. వాళ్లు మేకులు కావాలని అడిగారు – గాలికి ఎగిరిపోకుండా కొట్టుకోడానికట. అందరూ సంతోషంగా జీవితాలు గడుపుతూంటారు. చట్టాలు, నిబంధనలు లేవు. అందరూ ఏ పొరపొచ్చాలు లేకుండా కలిసి మెలసి బతుకుతారు. ఒకరి వ్యవహారంలో మరొకరు జోక్యం చేసుకోరు. 'గ్లాస్' వాళ్లకు పెద్దేకానీ యజమాని కాడు. వాళ్ల పిల్లలకు చదువు చెప్తాడు. మత గురువు కూడా అతనే!

తర్వాత మజిలీ కేప్ ఆఫ్ గుడ్ హోప్. వారం రోజులు మజిలీ. రోజూ గుర్రాలు అద్దెకు తీసుకొని ఊరంతా తిరిగేవాళ్లు. కేప్‌టౌన్ మంచి పట్టణం. చక్కని వీధులు. ప్రతి వీధీ చెట్టు చేమలతో కళకళలాడుతూ వుంటుంది. అన్నీ రెండు అంతస్థుల తెల్లని మేడలు. ఊరి నిండుకూ ఇంగ్లీషు, డచ్, మలయా, పార్సీ, హస్టెన్ టాట్స్ అనే జాతి వాళ్లతోపాటు దోమలు, నల్లులు కూడా సమృద్ధిగా వున్నాయని, అందరికంటే ముందుగా నల్లులే అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకొన్నట్లుంటుందని ఆమె చమత్కరిస్తుంది. అక్కడ తాను దిగిన ఇంగ్లీషు లాడ్జింగ్‌కు తన సోదరుడు ఫ్రాంక్ అయితే, హోటల్ డేడ్స్ అని పేరు పెట్టి వుండేవాడని అంటోంది. ప్రయాణీకులు రెండు జట్లుగా విడిపోయి, ఊరు చూడ్డానికి బయల్దేరారు. నిన్న కొండ చిలువను చూడ్డానికి వెళ్లాం. 33 అడుగుల పొడవు, పచ్చమట్టి రంగుల్లో ఆవలి పక్క వెండి పొలుసులతో మహా భయంకరంగా వుంది. నేనింత వరకు అట్లాంటి భయంకరమైన పాముని చూడలేదని రాస్తుంది. సముద్ర తీరం నుంచి దాదాపు 15 మైళ్ల వెళ్లి కేప్‌టౌన్ చూసి వచ్చారు. కేప్‌టౌన్ మెడెయిరా అంతటి అందమైన ప్రదేశం కాకపోయినా, ఒకటి రెండు అద్భుత దృశ్యాలు ఆకట్టుకొంటాయి. పెద్దపెద్దరాళ్లు, పచ్చిక మైదానాలు, పూలతో నిండిన బయళ్లు – కనుల పండువగా వుంటాయి. ఇంగ్లీషువాళ్లు కట్టించిన చర్చి ఆమెకు చాలా బాగుంటుంది. దానికి అనుబంధంగా సన్‌డే స్కూలు వుంది. ఒక మ్యూజియం కూడా వుంది. ఈ ఊళ్లో జీవనం ఎలా వుంటుందని నాన్నగారు అడిగితే, ఇక్కడ వస్తువుల ధరలు మూడు రకాలుగా ఉంటాయని, డచ్‌వారికి చౌక, ఇంగ్లీషువాళ్లకి ప్రియం, మాలాంటి యాత్రికులకు ప్రియాతి ప్రియం అని చెప్పమంటుంది.

కేప్ వదిలిన తర్వాత, ప్రయాణమంతా ప్రయాసగా సాగిందని, ఎదురుగాలులు, ఈదురు గాలుల్లో ఓడ ఊగిసలాడుతూంటే, తాము పడుతూ లేస్తూ ప్రయాణం సాగించామని ఆమె మద్రాసు చేరిన తర్వాత, అక్టోబరు 13వ తేదీ రాసిన ఐదో జాబులో పేర్కొంది. వాతావరణం ఎట్లా వుందని కెప్టెన్‌ను అడిగితే చాలా భయంకరంగా వుందని, ఎప్పుడైనా తుపాను రావచ్చునని హెచ్చరించేవాడు. రోజంతా భయంభయంగా, విసుగ్గా వుండేది. ఎవరికీ తోచేదికాదు. ఆ విసుగులో ఒకరితో ఒకరు ఉత్త పుణ్యానికే తగువులాడుకొనేవారు. ఐతే మొత్తం మీద ప్రయాణీకులు స్నేహంగా, సౌమ్యంగానే గడిపి, క్షేమంగా మద్రాసు తీరం చేరుకున్నారు.

తాము మద్రాసు తీరం చేరుకున్న రోజు సముద్రం ప్రశాంతంగా వుందని, అలలు అసలు లేవని ఆమె రాస్తుంది. ప్రయాణీకులందరూ ఓడ నుంచి 'మసూలా పడవ'ల్లోకి మారి తీరం చేరుకుంటారు. ఆ పడవల్ని నడిపే సరంగులు ఒంటిమీద చిన్నగుడ్డ పేలికలతో నల్లగా వుంటారని, వాళ్లు తమాషాగా ఈలవేస్తూ పడవలు నడుపుతారని, ఒక్కో పడవకు పన్నెండు మంది సరంగులుంటారని ఆమె చెప్తుంది 'మద్రాసు రోడ్స్' దృశ్యం అద్భుతంగా వుంటుంది. సముద్రం రకరకాల ఓడలతో, నావికులతో కళకళలాడుతూంటుంది. అయితే అవేవీ తెప్పలకు, వాటిని నడిపే చిత్రమైన మనుషులకూ, సరిపోలవు. మూడు కొయ్య మొద్దుల్ని ముడివేసి తెప్పగ తయారు చేసి సముద్రం మీదికి వెళ్తారు. తిరిగి రాగానే మొద్దుల్ని విడదీసి ఎండబెడతారు. ఒక్కొక్క తెప్పను ఒకరు, ఇద్దరు లేక ముగ్గురు నడుపుతారు. వాళ్లు తెప్ప మీద గొంతు కూచుని, నేర్పుగా తెడ్డువేస్తారు. ఈ తెప్పలు సముద్రం మీదికి వెళ్లే దృశ్యం ఆసక్తికరంగా వుంటుంది. భయంకరమైన అలల్లో సహితం అవి వెళ్తాయి. ఒక్కోసారి అలలపై అలవోకగా నాట్యం చేస్తూ, మరి ఒక్కోసారి నీటికింద దోబూచులాడుతూ, ఒక్కోసారి తెప్ప, మనిషి అలల్లో కొట్టుకొనిపోతూ, తెప్ప ఒకవైపు, మనిషి మరోవైపు తేలిపోతూ, మళ్లీ ఏదో మంత్రం వేసినట్లు రెండూ కలసిపోతూ..." ఇలా వర్ణిస్తుంది మద్రాసు సముద్ర తీరదృశ్యాన్ని ఐదవ జాబులో.

నాలుగు నెలలు ఒక సాహస యాత్రగా సాగిన సాగర యాత్ర ముగిసి ఆమె క్షేమంగా మద్రాసు చేరుకున్నది.

ఐదవలేఖ : "మద్రాసు నాకు బాగా నచ్చింది. ఇక్కడి ప్రజలు కూడా నాకెంతో నచ్చారు".

ఉత్తరంలో 'ఆమె' పేర్కొంటుంది. మద్రాసు వాతావరణం బాగుంది. ఇళ్లు విశాలంగా ఉంటాయి. చర్చి అంత పెద్ద గదులు. తలుపులు, కిటికీలు ఎప్పుడూ తెరిచే వుంచుతారు. గాలీ వెలుతురు బాగుంటాయి. ఇటలీ ఇళ్ల మాదిరి వేడి అనిపించదు, ఉష్ణోగ్రత 78 డిగ్రీలున్నా. ప్రతిగదికీ వట్టివేళ్ల తడికలుండడం వల్ల 70 డిగ్రీలు మించినట్టుండదు. మద్రాసులో ఆమె తన సోదరుడు స్టాన్‌టన్ యింట్లో బస చేసింది. మద్రాసులో తాను చాలా వింతలూ, విశేషాలు చూశానని, వాటిలో దేన్ని, మొదట చెప్పాలో తెలియడం లేదని ఆమె అంటుంది. "గారడీ వాళ్లను గురించి చెప్పనా, పాములవాళ్లు, దొమ్మరివాళ్లు, స్థానికులు...వీళ్లలో ఎవర్ని గురించి చెప్పమంటావు?" అంటూ పాముల వాళ్లను గురించి మాత్రమే చెప్తుంది. పాములను ఆడించే వాళ్లు చాలా చిత్రంగా ఉంటారు. తాము ఆడించే పాములు విష సర్పాలని, వాటిలో బ్రాహ్మణ నాగు మరీ భయంకరమైనదనీ, అది కాటువేస్తే మూడు గంటల్లో మనిషి ప్రాణం పోతుందని వాళ్లు చెప్తారు. నెలకోసారి కోరలు తీసేస్తామని వాళ్లు చెప్పారు కానీ, వాళ్లు తీసేది కోరలు కాదు, కోరల్లో విషం అని ఆమె అంటుంది. ఒకరోజు పాములవాళ్లు ఎనిమిది నాగుపాముల్ని, మూడు సాదా పాముల్ని తెచ్చి తన ముందు అద్భుతంగా ఆడించారని ఆమె రాస్తుంది.

సంపన్నుల యిళ్లల్లో నౌకర్లను చూసి ఆమె చాలా ఆశ్చర్య పోతుంది. ప్రతి చిన్న పనికీ నౌకర్లమీద ఆధారపడడం, ఒక్కొక్క పనికి ఒక్కో నౌకరుండడం, నౌకర్ల కింద మళ్లీ నౌకర్లు – ఇదంతా ఆమెకెంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. తన వద్దనే ఇద్దరు నౌకర్లు – ఒక 'ఆయా', మరో దర్జీ వున్నారు. 'ఆమె' భర్త వద్ద ఒక 'బోయ్' వున్నాడు. వీళ్లు కాక, ఇంట్లో పొచిపనికి ఇద్దరు, ఇల్లు శుభ్రం చేయడానికిం కొకరు, నీళ్లు తేవడానికి మరొకరు, గుడ్డలు పరచడానికొకరు, భోజనం వడ్డించడానికి, దీపాలు వెలిగించడానికి, డైనింగ్ టేబుల్ వద్ద కాచు కొని వుండడానికి వేర్వేరు పనివాళ్లుంటారు. "ప్రతి గుర్రానికీ ఒ సేవకుడు, గడ్డి కోసుకొచ్చేందుకొక ఆడ పని మనిషి. ప్రతి కుక్కకు ఒక నౌకరు. పిల్లులకు వుండరా అని అడిగాను. ఉహు...ఉండరట. బహుశా అదొక్కటేనేమో – తన పని తాను చేసుకోగల ప్రాణి ఇక్కడ" అని ఆమె వ్యాఖ్యానిస్తుంది. ఒక్కో యింట్లో యింతమంది పనివాళ్లున్నా. వాళ్లు చేసే పని మాత్రం ఎక్కువేమీ వుండదు. కనబడే నౌకర్లు వీళ్లయితే, కనబడకుండా మరికొంత మంది – ఈ నౌకర్ల కింద నౌకర్లుంటారు. అసలు పనంతా చేసేవాళ్లు...ఐతే ఎంత మంది నౌకర్లున్నా పనిమాత్రం తెమలదు. నేను ఈ నౌకర్లకోసం కాచుకోక, నా పనులు నేనే చేసుకుంటాను. అంతా చేసుకుంటుంటే మిసెస్ స్టాన్‌టన్ నన్ను ఎగతాళి చేస్తుంది" నౌకర్లు యజమానుల యిళ్లలో మెట్లమీద చాపలు పరుచుకొని వుంటారని, అక్కడ ఏమీ తిన్నట్టుగానీ అనిపించక పోయినా తమకు కావలసినవన్నీ చక్కగా సమకూర్చుకొంటారని ఆమె అంటుంది. "నిజమైన భారతీయ మహిళ ఎల్లవేళలా సోఫామీద పడుకొని వుంటూ, చేతి గుట్ట మీదపడి పోయినా 'బోయ్' అని కేక వేస్తుంది. అప్పుడొక బక్క పల్చని ముసలాడు మెల్లగా లోపలికి వచ్చి యజమా నురాలు చెప్పిన పనిచేసి, పిల్లిలా మెల్లగా బయటకు జారుకొని, యధా ప్రకారం వరండాలో కాళ్లు పెనవేసుకొని కూచుంటాడు – మళ్లీ అమ్మగారికి దయకలిగి తనను పిలిచే దాకా!"

ఈ దేశస్థులు (నేటివ్‌లు) హేయంగా ప్రవర్తిస్తారని, 'నక్క వినయం' చూపేవారని, తాము ఇంగ్లీషువారి కాలి దుమ్ముతో సమాన మైనట్లు నడుచుకొంటారని ఆమె అభిప్రాయం, ఐతే వాళ్లు తమను గురించి అంత నీచంగా భావించుకొనేట్లు చేసింది. ఇంగ్లీషు వాళ్లేనని ఆమె అంటుంది. "వాళ్ల నీచమైన దాస్యభావం సహించరానిదే అయినా, వాళ్లను మన ఇంగ్లీషువాళ్లు మరీ హేయంగా, మొరటుగా చూడడం ఎంతో బాధాకరంగా ఉంటుంది. నౌకర్లతో కాస్త మర్యాదగా మాట్లాడేది కొత్తగా ఇండియాకు వచ్చిన వాళ్లు మాత్రమేనని, వాళ్లు తెలియక అలా మాట్లాడుతారని ఇక్కడి ఇంగ్లీషువాళ్లు అంటుంటారు". అని ఆమె వ్యాఖ్యానిస్తుంది. దీనికి తన 'ఆయా'తో సంభాషణను, దర్జీ సంఘటనను ఉదాహరణగా చెప్తుంది.

ఒకరోజు ఆమె ఆయాను రొట్టె, నీళ్లు తెమ్మని చెప్తూ 'ప్లీజ్' అని మర్యాదగా అంటుంది. రొట్టె, నీళ్లు తెమ్మనడమైతే సరేగాని, ఆ ప్లీజ్ అనే మాటేమిటో ఆయాకు అర్థం కాలేదట. ఆయా తలుపు దాకా వెళ్లి తిరిగి వచ్చి –

"ఏం చెప్పావమ్మా?" అని అడుగుతుంది.

"రొట్టె, నీళ్లు తెమ్మన్నాను"

"అది సరే కానీ ఆ తరువాత ఏదో 'ఇఫ్ యు ప్లీజ్' అన్నారే. అంటే ఏమిటమ్మా?" అంటుంది అమాయకంగా. అలాటి గౌరవ వాచకాలతో తననెవరూ పిలవలేదట. 40 ఏళ్ల వయస్సు. లావుగా బొద్దుగా వుండే ఆయాకు ఏర్‌కుషన్‌కి గాలి ఊదటమంటే మహా సరదా.

ఒకసారి తన దర్జీ సూచించిన ముసల్మాన్‌కు 'ఆమె' కొంత ఎంబ్రాయిడరి పని అప్పగిస్తుంది. ముసల్మాన్ ఎంతకూ పని పూర్తి చేయకపోయేసరికి, 'ఏంచేద్దాం' అని మిసెస్ స్టాన్‌టన్‌ను సలహా అడుగుతుంది. మిసెస్ స్టాన్‌టన్ చాలా తేలిగ్గా –

'ఏముంది? దర్జీ జీతం పట్టి వుంచు" అని సలహా చెప్తుంది.

"కానీ, పాపం ఇందులో దర్జీ తప్పేముంది?"

"అదంతా అటుంచు. అతను ముసల్మాను స్నేహితుడు. నీ వతని జీతం పట్టి వుంచావంటే, అతను నీ ఎంబ్రాయిడరి పూర్తయ్యే దాక రోజూ తన స్నేహితుణ్ని చావబాదుతుంటాడు" – మిసెస్ స్టాన్‌టన్ సలహా యిస్తుంది.

ఈ రెండు సంఘటనలనూ చెప్పి, మరింత సానుభూతితో చూడాలని, నిజానికి వాళ్లు పసిపిల్లలతో సమానమని 'ఆమె' అంటుంది.

ఒంగి ఒంగి సలాములు కొట్టే స్థానికులను ఈసడించుకొంటూ 'ఆమె' ఒకటి రెండు సంఘటనలను వివరిస్తుంది.

ఆమెభర్త 'ఎ–' ముందొకసారి మద్రాసులో పని చేసివెళ్లి, ఇప్పుడు మళ్లీ అక్కడికే వచ్చేసరికి, ఆయన్ను చూడ్డానికి చాలామంది 'నేటివులు' వచ్చి పోతుంటారు. 'అయ్యగారి కటాక్షం కోసం వచ్చామ"ని చెప్తుంటారు. ఒకసారి ఉదయం ఆరుగంటలకు ఒక పెద్దాయన గేటువద్ద బండిదిగి, చెట్టుకింద చెప్పులు వదలి లోపలికొచ్చాడు.

(...తరువాయి 45 వ పుటలో)

యడ్లపల్లి అమర్‌నాథ్
9398245804.

ఓరుగల్లు యోధులు ముసునూరి నాయకులు





క్రీస్తు శకం 1149 నుండి క్రీస్తు శకం 1369 వరకు రెండు వందల సంవత్సరాలకు పైగా తెలుగువారి ప్రధాన రాజధాని అయిన ఓరుగల్లు కోటలో నివసించి, ఓరుగల్లు ప్రభువులైన కాకతీయుల రాజులకు యుద్ధాల్లో విజయాలను అందించిన వీరవంశం ముసునూరి నాయక వంశం. దోసపాళ్ళ గోత్రం ప్రధానంగా గల ముసునూరి నాయకులు ఓరుగల్లు రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఓరుగల్లు ప్రభువుల వద్ద మంత్రులుగా, సేనాధిపతులుగా, కటక పాలకులుగా, అంగరక్షకులుగా, దళపతులుగా మరియు కోట పరిరక్షకులుగా వివిధ హోదాల్లో పని చేసినట్టు చరిత్ర తెలుపుతోంది. ముసునూరి ప్రోలయ నాయకుడు తాను వేయించిన విలస శాసనంలో కాకతీయ ప్రతాప రుద్రునికి మరియు ఢిల్లీ సుల్తానులకు మధ్య జరిగిన 8 యుద్ధాల్లో 7 సార్లు విజయాన్ని అందించినట్టు చెప్పుకున్నాడు.

కాకతీయ ప్రతాపరుద్రుని సైన్యాధ్యక్షుడు ముసునూరి ప్రోలయ నాయకుడు. ప్రోలయ సైనిక దళంలో అతని విజయాల్లో కీలక పాత్ర పోషించిన మహావీరులు సూర్యదేవర నాయకులు. ప్రోలయకు ముఖ్య అనుచరులుగా ఉంటూ తమ నైపుణ్యంతో ఎంతో కీర్తిని సంపాదించిన యోధులు సూర్యదేవర నాయకులు. ఢిల్లీ సుల్తానుల ధాటికి కాకతీయ రాజ్యం క్రీస్తు శకం 1323లో కూలిపోయింది. తెలుగు ప్రాంతం అంతా ఢిల్లీ పాలకులైన తుగ్లక్ వంశం హస్తగతం అయింది. అయితే ఆనాటి తెలుగు పాలకులు వేయించిన శాసనాలు ఢిల్లీ సుల్తానులు తెలుగు నేల మీద అరాచక పాలన సాగించినట్టు తెలియజేస్తున్నాయి. తెలుగు ప్రజలంతా ఆ భయంకర పాలన నుండి స్వాతంత్రాన్ని కోరుకుంటున్న సమయం అది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో భద్రాచలం అటవీ ప్రాంతం అయిన రేఖపల్లిలో ముసునూరి ప్రోలయ నాయకుడు ఢిల్లీ సుల్తానుల మీద విప్లవ పోరాటం మొదలు పెట్టాడు

12వ శతాబ్దంనాటి ముసునూరి గుండయ్య శాసనం ముసునూరి రాజ్యాన్ని కమ్మనాడుకు చెందిన కమ్మ రైతు కుటుంబాల వారు అని తెలియజేస్తోంది.


కాకతీయ సామంత నాయకులు ప్రోలయ నాయకునితో చేతులు కలిపారు. తెలుగు జాతి స్వాతంత్ర్యం కోసం ముసునూరి యోధులు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అత్యంత శక్తిమంతులైన ఢిల్లీ సుల్తానులను ఎదిరించి విజయాలను సాధించారు. క్రీస్తు శకం 1334లో ప్రోలయ తమ్ముడైన ముసునూరి కాపయ నాయకుడు ఓరుగల్లు మీదకు దండయాత్ర చేసి విజయం సాధించాడు. ఈ రకంగా తెలుగు ప్రాంతం అంతా క్రీస్తు శకం 1335 కల్లా ఢిల్లీ సుల్తానుల పాలన నుండి విముక్తి అయ్యింది. ముసునూరి ప్రోలయ నాయకుడు మరియు ముసునూరి కాపయ నాయకుడు సాధించిన ఈ విజయాల్లో కమ్మనాటి నాయకులు కీలక పాత్ర పోషించి తెలుగు జాతికి స్వతంత్రం తీసుకువచ్చారు. కమ్మనాటి నాయకులు ఓరుగల్లు ప్రభువులైన ముసునూరి కమ్మ నాయక రాజులతో వివాహ సంబంధాలు కూడా ఏర్పరుచుకుని ఓరుగల్లు రాజ్యంలో ఎంతో పలుకుబడిని సంపాదించారు. ఓరుగల్లు ప్రభువులైన ముసునూరి నాయక రాజుల బంధువులుగా ఓరుగల్లు కోట నిర్మాణంలోనూ కోట గోడల అభివృద్ధిలోనూ ఓరుగల్లు నగర నిర్మాణంలోనూ కమ్మనాటి నాయకులు ప్రధాన పాత్ర పోషించారు. క్రీస్తు శకం 1369లో ముసునూరి కాపయ నాయకుడు రాచకొండ రాజుల చేతిలో మరణించడంతో ఓరుగల్లు రాజ్యం పతనం అయింది. దీంతో తెలంగాణ ప్రాంతంలో కమ్మనాటి నాయకుల పాలన అంతం అయ్యింది. కమ్మనాటి నాయకులు కాపయ మరణించాక హంపి చేరుకొని విజయనగర బుక్కరాయల సైనికులుగా సేవలందించారు.

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలంలో ముసునూరి నాయకులు దక్షిణ భారతదేశ యుద్ధాల్లో కీలకపాత్ర పోషించారు. కృష్ణదేవరాయల సేనాధిపతులుగా ప్రస్తుత గుంటూరు జిల్లాలో కొన్ని నాయకరాజులు పాలించారు. ఓరుగల్లు యోధులైన ముసునూరి నాయకుల చరిత్ర చాలా వరకు వెలుగులోకి రాలేదు. త్రిలింగ దేశం అంటే ఒకప్పటి తెలుగునేలకు సరిహద్దులు. త్రిలింగ దేశం మూడు శివలింగాల మధ్య ఉన్న ప్రాంతం. ఆ మూడు లింగాలు

1. కాళేశ్వరం, 2. ద్రాక్షారామం, 3. శ్రీశైలం

కాళేశ్వరం ఉత్తర తెలంగాణాలోని భూపాలపల్లి జిల్లాలో ఉంది. ద్రాక్షారామం తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. శ్రీశైలం కర్నూలు జిల్లాలో ఉంది.

ముసునూరి ప్రోలయ్య నాయకుడు, ముసునూరి కాపయ్య నాయకుడు, ముసునూరి అనపోతా నాయకుడు, ముసునూరి వినాయక దేవుడు రేఖపల్లి, ఓరుగల్లు, తొయ్యేరు, రాజమహేంద్రవరం రాజధానులుగా రాజ్యం ఏర్పాటు చేసి స్వతంత్ర త్రిలింగ దేశాన్ని 14వ శతాబ్దంలో పరిపాలించారు. మిగిలిన కమ్మవంశాల వారు కూడా ముసునూరి సైన్యంలో చేరి, ముసునూరి




త్రిలింగదేశాన్ని పరిపాలించిన ముసునూరి నాయకులు

రాజులకి అండదండలు అందించేవారు.


ముసునూరి రాజులు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా దండయాత్రలు చేసి విజయాలు సాధించినట్టు పురాతన చరిత్రకారులు తెలిపారు. మిగిలిన కమ్మ వంశాల వీరులు కూడా ఈ దండయాత్రలలో పాల్గొని రాజ్యాన్ని విస్తరించారు. భారతావని యోధుడు సామ్రాట్ ముసునూరి ప్రోలయ నాయకుడు పరిపాలించిన "రేఖపల్లి"ని సందర్శించటం జరిగింది. ఈ ప్రాంతం తెలుగు ప్రజలకు ఒక్క మక్కా, అయోధ్య, జెరూసలేం లాంటిది. ఇక్కడి నుండే ప్రోలయ నాయకుడు స్వాతంత్ర్య సంగ్రామం నడిపించాడు.

రేఖపల్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. ఇది అటవీ ప్రాంతం. టర్కీ దేశానికి చెందిన ఢిల్లీ సుల్తానులయిన తుగ్లక్‌ను ఓడించటం కోసం ప్రోలయ నాయకుడు ఈ ప్రాంతం ఎంచుకోడం జరిగింది. దురదృష్టవశాత్తు ఈ ప్రాంతం పోలవరం ముంపు ప్రాంతంలో ఉంది. అయితే ఈ ప్రాంతం మునిగేది లేనిది ఇక్కడి అధికారులు స్పష్టంగా ఇప్పుడే చెప్పలేమంటున్నారు. ఇతర భారతదేశ హిందూ రాజులు ప్రజలను కాపాడలేక అడవుల్లోకి పారిపోయిన సమయంలో ముసునూరి ప్రోలయ నాయకుడు ఒక్కడే ఢిల్లీ సుల్తానులకు ఎదురు నిలబడి పోరాడాడు. రేఖపల్లి ప్రజలతో, అధికారులతో చాలా గంటలపాటు చర్చించటం జరిగింది. రేఖపల్లి చరిత్రను వారికి వివరించడం జరిగింది. వారి ప్రాంత చరిత్ర విన్నాక వారు గర్వముతో పొంగిపోయారు. ఈ గ్రామంలో పలు దేవాలయాలను నేను సందర్శించటం జరిగింది. ఇక్కడ ఒక పురాతన మట్టికోట ఆనవాళ్లు ఉన్నాయి. ఈ మట్టికోట ప్రాంతంలో ఒక పురాతన చెట్టు కింద కోటమైసమ్మ అనే ఒక దేవత విగ్రహం ఉంది. అసలు విగ్రహం భూమిలోనే ఉంది అంట. ఆ ప్రాంతంలో ఆరేళ్ళ క్రితం ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ దేవతను ఆ నాటి రాజులు కులదేవతగా పూజించేవారు అంట. ఈ విషయాల మీద పరిశోధనలు మొదలు పెట్టాను. ఓరుగల్లులో మరియు రేఖపల్లిలో ఆనాటి మహా వీరులైన ముసునూరి నాయకుల చరిత్రను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగుజాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే స్వాతంత్ర్య సమరయోధులు నాయకులు.



చలసాని నరేంద్ర
9849569050

రాజ్యాంగంపై ప్రమాదం ఎవరి నుండి!



సుమారు మూడేళ్ళ పాటు లోతైన సమాలోచనలు అనంతరం ప్రపంచంలోనే అతి పెద్దదిగా రూపొందించుకొన్న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాల కాలం గడిచింది. మొన్ననే భారత రిపబ్లిక్ 71వ ఉత్సవాన్ని సంబరంగా జరుపుకున్నాము. భారత దేశ చరిత్రలో ఇదొక్క మహోజ్వల మైన ఘట్టం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా, ప్రజలందరికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను, సమాన అవకాశాలను కలిగిస్తూ, ఎటువంటి వివక్షతకు అవకాశం లేకుండా మనలను మనం రూపొందించుకున్న మహత్తర ఘట్టం.

ఒక వంక దేశం అంతా రిపబ్లిక్ దే ఉత్సవాలను జరుపుకొంటుండగా, దేశంలో కొందరు, ముఖ్యంగా ప్రతిపక్షాలు, పలు అంశాలలో వాటి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా అడుగులు వేస్తున్న వివిధ ప్రజాసంఘాలు, భారత రాజ్యాంగం ప్రమాదంలో పడింది అనే నినాదాలు ఇస్తున్నారు. 'రాజ్యాంగాన్ని కాపాడండి' అంటూ కొన్ని రోజులుగా దేశంలో పలు నగరాలు, పట్టణాలలో నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు.

ఒక దేశపు రాజ్యాంగం ఆ దేశం ప్రజల సాంస్కృతిక, భావాత్మక ఆలోచనలకు, విలువలకు అద్దం పడుతుందా? లేదా రాజ్యాంగం మేరకు ఆ దేశ ప్రజలు నడుచు కుంటారా? అన్నది - ఈ సందర్భంగా తలెత్తే ప్రధాన ప్రశ్న. నేడు రాజ్యాంగం ప్రమాదంలో పడింది అని చెప్పడానికి ప్రధాన కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన జమ్మూ కాశ్మీర్ లో ఆర్టికల్ 370 అమలును నిర్వీర్యం చేయడం, ఆ తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకు రావడం.

వాస్తవానికి ఈ రెండు అంశాలపై తొలి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నుండి వివిధ పార్టీలు, నేతలు స్పష్టమైన హామీలు ఇస్తూనే ఉన్నారు. రాజ్యాంగంలో కేవలం ఒక తాత్కాలిక ఏర్పాటుగా తీసుకొచ్చిన ఆర్టికల్ 370ని ఇదివరకే ఇందిరాగాంధీ, పివి నరసింహారావు వంటి ప్రధానులు రాజ్యాంగ సవరణల ద్వారా నిర్వీర్యం చేశారు. ఇక పౌరసత్వ సవరణకు సంబంధించి నెహ్రూ నుండి ఇందిరా వరకు పొరుగు దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణం గానే ఉంది. వామపక్షాలతో సహా అన్ని పక్షాలు ఈ అంశంపై పార్లమెంట్‌లో గతంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

భారతరాజ్యాంగం అమలులోకి వచ్చినరోజే రిపబ్లిక్‌డే. 1947 లో బ్రిటిష్ వలసపాలకులను సాగనంపి, ఆగష్టు15న స్వతంత్రం సాధించుకొంటే, ఆ తర్వాత సుమారు మూడేళ్లకు రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26న రిపబ్లిక్‌డేగా జరుపుకొంటున్నాము. అయితే చాలామంది స్వతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డేల మధ్యగల వ్యత్యాసం గురించి తడబాట్లు పడుతుంటారు. గత సంవత్సరం ఆగష్టు15ను రిపబ్లిక్‌డేగా జరుపుకున్న ఢిల్లీ పోలీస్‌లకు వ్యతిరేకంగా ఒక కేసు కూడా నమోదైనది.

ఆగష్టు 15-విదేశీ పాలకుల నుండి స్వేచ్ఛ పొందిన రోజ యితే, మనలను మనం ఒక సర్వ స్వతంత్ర దేశంగా ప్రకటించు కొన్నరోజు రిపబ్లిక్‌డే అని చెప్పవచ్చు. అందుకనే భారత ప్రజల సాధికారికతకు గుర్తు ఈ దినంగా భావించాలి. ఆగష్టు 15న జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా తాత్కాలిక భారతప్రభుత్వం ఏర్పడినా సాంకేతికంగా బ్రిటిష్ రాజు జార్జ్ మనదేశాధినేతగా కొనసాగారు.

1950 జనవరి 26న మనరాజ్యాంగంను అమలులోకి తీసుకు రావడంద్వారా భారత్‌ను ప్రజాస్వామ్య రిపబ్లిక్‌దేశంగా మనం ప్రకటించుకొని, మొదటి రాష్ట్రపతిగా డా. రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నాము. అందుకనే స్వతంత్ర దినోత్సవాన్ని ఒక విధంగా రాజకీయ పరమైన విజయంగా జరుపుకొంటూ ఉంటె, మనదేశ సాధికారితకు చిహ్నంగా, ప్రజల సార్వభౌమత్వానికి గుర్తుగా రిపబ్లిక్‌డేను జరుపు కొంటాము.

రిపబ్లిక్‌డే రోజున ఢిల్లీలో భారతసేనలు తమ అత్యాధునిక ఆయుధాలను, పరాక్రమాలను ప్రపంచానికి ప్రదర్శించడం ద్వారా మనది అభేద్యమైన జాతి అనే సంకేతం ఇస్తుంటాయి. ఈ సందర్భంగా జరిగే పెరేడ్ రాష్ట్రపతి భవన్‌కు సమీపంలోగల రైసినా హిల్ నుండి ప్రారంభమై, రాజ్‌పత్, ఇండియాగేట్‌ల ద్వారా ఎర్రకోట వరకు సాగుతుంది. త్రివిధ దళాల నుండి మన సాయుధ దళాల కమాండర్ ఇన్ చీఫ్ అయిన రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరిస్తారు.

ఈ రోజున భారతీయులు అందరు సగర్వంగా మన జాతీయ పతాకాన్ని ఎగురవేసుకొంటూ, మనజాతీయగీతం "వందే మాతరం", "జనగణమన"లను ఆలపించుకొని, దేశ స్వాతంత్ర్యం కోసం అసమాన త్యాగాలు జరిపిన స్వాతంత్ర్య సమరయోధులకు అంజలి ఘటిస్తారు.

రాజ్యాంగాన్ని జాతి సమగ్రత, భద్రతవంటి అంశాలను దృష్టిలో ఉంచుకోకుండా సంకుచిత రాజకీయ అవసరాల మేరకు అన్వయించుకొనే ప్రయత్నం జరుగుతూ ఉండడంతో నేడు రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి భిన్నంగా వ్యవహారాలు నడుస్తున్నాయి. నరేంద్ర మోదీ చేబడుతున్న చర్యలు తమ విభజన రాజకీయాలకు ముగింపు కాగలవని పలు వర్గాలు ఆందోళన చెందుతున్నట్లు ఉన్నది.

అదే సమయంలో, నరేంద్రమోదీ ప్రభుత్వంసైతం మౌలిక

అంశాలు, సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించడం కోసం భావో ద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుండడం కూడా పలు వర్గాలలో ప్రభుత్వ చర్యలు అనుమానాస్పదంగా మారుతున్నాయి. మోదీ ప్రభుత్వం తలపెట్టిన జాతీయ జనాభా రిజిస్టర్, పౌరసత్వ రిజిస్టర్ వంటి చర్యలు సహితం వివాదాస్పదంగా మారడంతో రాజ్యాంగంపై ప్రమాదం అంటూ నినాదాలు ఏర్పడుతున్నాయి. ఇటువంటి కొన్ని మౌలిక అంశాలపై జాతీయ ఏకాభిప్రాయం ఏర్పరచే ప్రయత్నం చేయకుండా, రాజకీయ ప్రయోజనాలకే రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇస్తూ ఉండడంతో ఇటువంటి సమస్యలు ఏర్పడు తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రజల విశ్వాసాలే ఒక జాతిని నడిపిస్తాయి. కేవలం రాజ్యాంగంలో హామీలు ఇచ్చినంత మాత్రం చేత ప్రజలకు భరోసా ఏర్పడదు. ఉదాహరణకు భారతదేశంతోపాటే సుమారు 60 ఆసియా, పసిఫిక్ దేశాలు స్వతంత్రం పొందాయి. అవ్వన్ని ప్రజా స్వామ్య పక్రియను అనుసరించాయి. అయితే నేడు భారత్ లో మినహా మరే దేశంలో ప్రజాస్వామ్యం ఇంకా మనుగడలోలేదని చెప్పాలి. నిరంకుశ వ్యవస్థలో, మతరాజ్యాలలో ఆయాదేశాలలో నెలకొన్నాయి.

మన పొరుగున ఉన్న పాకిస్థాన్, బాంగ్లాదేశ్‌లు మొదట్లో లౌకిక, ప్రజాస్వామ్య దేశాలుగా ఆవిర్భవించాయి. కానీ తొందరలోనే అవి మత రాజ్యాలుగా మారాయి. తరచూ సైనిక పాలనలను చూస్తు న్నాయి. కాబట్టి కేవలం రాజ్యాంగ నిబంధనలో ఏ దేశంలో కూడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడలేవు. అందుకు బలమైన సామాజిక, సాంస్కృతిక నేపధ్యం కూడా అవసరం.

నేడు మన రాజ్యాంగానికి ఏర్పడుతున్న ముప్పు విధాన నిర్ణ యాలు తీసుకొనే రాజకీయ పార్టీలు మౌలిక రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇవ్వడం వల్లననే అని అర్థం చేసుకోవాలి. నేడు దేశంలో రెండు, మూడు పార్టీలు తప్ప దాదాపు అన్ని ఒక కుటుంబం లేదా ఒకరిద్దరు వ్యక్తుల చేతులలో అధికారం కేంద్రీకృతం అవుతూ ఉంటున్నది. దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీలు ఒక కుటుంబం సొంత ఆస్తులవలే కొనసాగుతున్నాయి.

అంతర్గత ప్రజాస్వామ్యం దాదాపు ఏ పార్టీలో కనిపించడం లేదు. నేడు రాజ్యాంగానికి కీలకమైన ముప్పు మన రాజకీయ పార్టీల వ్యవస్థ నుండే తలెత్తుతున్నదని గమనించాలి. కీలకమైన అంశాలపై పార్టీల అత్యున్నత కమిటీలలో కాని, మంత్రివర్గాలలో కాని లోతయిన చర్చలు జరగడం లేదు. నాయకత్వం ఇష్టానుసారం, వారి ప్రయోజనా లకు అనువుగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి.

రాజ్యాంగ పర వ్యవస్థలను సముచిత రాజకీయ ప్రయోజనా లకు నిర్వీర్యం కావించడం, రాజకీయ ప్రక్రియలో విధానాలకు కాలం చెల్లడం నేడు మనం ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాల్. శాసన మండలి తమ ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు బిల్లులను తక్షణమే ఆమోదించకుండా కాలయాపనకు ప్రయత్నం చేసిందనే ఆగ్రహంతో– ఆ వ్యవస్థే అవసరం లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వ్యవహరించడాన్ని చూసారు.

ప్రజలకు జవాబుదారితనం, పాలనలో పారదర్శకత నేడు మచ్చుకైనా కనిపించడంలేదు. చివరకు పంచాయత్, మునిసిపల్ ఎన్నికలలో సహితం కాంట్రాక్టర్లు, మద్యం వ్యాపారులు, దళారీలు రాజ్యం ఏలుతుంటే ప్రజల పాలనకు అర్థం లేకుండా పోతున్నది. నేరస్థులకు సీట్లు ఇవ్వకుండా రాజకీయ పార్టీలను ఆదేశించాలని ఎన్నికల కమీషన్ సుప్రీంకోర్టును అభ్యర్థించవలసి రావడం పతనమవు తున్న మన రాజకీయ విలువలకు అద్దం పడుతున్నది.

నేరస్థులు, ధన రాజకీయాలు–మన ఎన్నికల వ్యవస్థలో ఆధి పత్యం వహిస్తున్నారని ఆందోళనలు వ్యక్తం అవుతున్నా, ఎంతగా అధికార దుర్వినియోగం చేసినా, ధనరాశులను కురిపించినా, అధికార పార్టీలు అరుదుగా మాత్రమే తిరిగి ఎన్నిక అవుతూ వస్తున్నాయి. అంటే మన రాజకీయ పార్టీలకన్నా మనప్రజలు మనరాజ్యాంగ విలువ లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ప్రజల నిబద్ధతే మన రాజ్యాంగానికి శ్రీరామ రక్ష.

(41 వ పుట తరువాయి)

"అప్పుడే మేము గుర్రపు స్వారికి వెళుతున్నాం. అతను అలాగే కాళ్లకు చెప్పులైనా లేకుండా మా గుర్రాల పక్కనే నడిచాడు మేం వెళ్లమని అనుజ్ఞ ఇచ్చేదాకా!"

దారిలో మరో పెద్దమనిషి కలిశాడు.

"అతను మమ్మల్ని చూడగానే బండి దిగి, చెప్పులు వదిలేసి, ఆ దుమ్ములో అలాగే ఒంగిఒంగి సలాములు చేస్తూ నిలబడి పోయాడు – మేం దాటి పోయేదాకా! తరువాత మా యింటికొచ్చి, మేం స్వారీ నుంచి తిరిగి వచ్చేదాకా – దాదాపు గంటన్నర సేపు – వరండాలో కాచుకొని వుండిపోయాడు".

ఇంకోసారి ఆమె వద్దకు ఒక పెద్దాయన వొంటరిగా వచ్చి, భర్తనెలా పట్టుకరావాలో సలహా ఇచ్చి వెళ్లాడు. కొన్ని అబద్ధాలైనా చెప్పడానికి – 'ఏ' చేత వొప్పించమని మరీమరీ చెప్పాడు. తాను తరచు 'అయ్యగారికి' ఈ సలహా యిస్తున్నా ఆయన చెవిన పెట్టడంలేదట. అమ్మగారైనా చెప్తే అయినా వింటాడేమోనని అనుకొన్నాడట.

"అయ్యగారు చాలా మంచివారు. నిజాయితీపరులు. ఎప్పుడూ మాతోనే ఉంటారు. తాను ఏం అనుకొంటాడో అది అనేస్తారు. ఇట్టా చెప్పెయ్యడం మంచిదికాదని అయ్యగారికి మీరైన చెప్పండమ్మా. అందరూ అబద్ధాలు చెప్పేవారే. కాని అయ్యగారి పద్ధతివేరు. మంచిదే. అందరూ ఎలా చెప్తున్నారో అయ్యగారూ అలాగే చెప్పాలి. అప్పుడు అయ్యగారని చాలా డబ్బు వస్తుంది" అని అతను బోధ చేశాడు.

"అది ఇంగ్లీషువాళ్ల పద్ధతి కాద" ని చెప్పాను. ఐతే నేటివుల మాదిరి అబద్ధాలాడే ఇంగ్లీషువాళ్లు చాలా మంది వున్నారని, వాళ్ళంతా బోలెడు డబ్బు సంపాదించి సుఖంగా వున్నారని అతను వాదించాడు. చివరకి అబద్ధమాడి డబ్బు సంపాదించడం తప్పని, అది తన భర్తకు గానీ, తనకుగానే ఇష్టంలేదని గట్టిగా చెప్పిన తర్వాత "ప్చ్ ప్. ఏం చేద్దాం" అని జాలిపడుతూ వెళ్లిపోయాడు.

(తరువాయి వచ్చే సంచికలో...)

నంద్యాల నారాయణరెడ్డి
9360514800

స్వాతంత్ర్యకాల నడువులు 9

[redacted]

వేసగి బి[redacted] చేరి తిమి. ఆటల పాటల నడుమన చదువు సాగతా ఉంది. తరగతి పొత్తాలు కాకుండా కొత్త కొత్త పొత్తాలు పరిచయం అవతా ఉండాయి మాకు. వాటిని మా కళ్ల ముందుకు తెచ్చి పెట్టింది ఎల్లప్ప చౌదరిగారి పెట్టంగడి (పెట్టె అంగడి).

హోసూరులో దినపత్రికలూ మాసపత్రికలూ దొరికే అంగడి అది. హోసూరు ఆంధ్రలో చేరకపోయినా, మదరాసు రాష్ట్రంలోనే మిగిలిపోయినా మా ఊర్లో అమ్మే పత్రికలన్నీ తెలుగువే. మా తావున ఎక్కువగా చదివేది ఆంధ్రపత్రి దినపత్రిక. పేటలో అయితే అంతో ఇంతో చదువుకొన్న ఎవరి చేతిలో చూసినా ఆంధ్రప్రభ కనబడు తుంటుంది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వంటి వార పత్రికలే కాక డిటెక్టివ్ నవలలూ ఎమెస్కోవాళ్ల పొట్టి పొత్తాలూంటే వేనవేలు అమ్ముడవుతుంటాయిక్కడ. ఏ తెరువులో అయినా ఏ ఇంట్లో అయినా తెలుగు పత్రికలు పట్టని చెయ్యే ఉండదు. మైనరుబాబుల చేతుల్లో అయితే పసుపూ ఎరుపూ అంచుల డిటెక్టివ్ నవల ఉండే తీరుతుంది.

పొద్దునా మాపునా ఆ పెట్టంగడి దగ్గర జనం సందడే సందడి. దినపత్రికలు చేత పట్టుకొని దేశ రాజకీయాలు మాట్లాడేవాళ్లు ఒకపక్క, వారపత్రికల్లోని సాహిత్యాన్నీ సినిమా వార్తలనూ తిరగేసేవాళ్లు ఒకపక్క, రామాయణం, భారతం, భాగవతం కైవారం తాత తత్త్వాలు వంటి పొత్తాలను కొంటూ వేదాంత చర్చల్లో మునిగేవాళ్లు ఒకపక్క, రాజ మండ్రివారి 'నవ్వులు పువ్వులు' కొవ్వూరువారి 'పకపకలు' వంటి హాస్య పత్రికలను చూస్తూ పకపక నవ్వేవాళ్లు ఒకపక్క, చందమామ బాలమిత్రవంటి బాల పత్రికల కోసం గుమిగూడిన చిన్నోళ్లం ఒకపక్క...ఇట్ల తెలుగుతనమంతా ఉద్దపోసినట్లుంటుంది ఎల్లప్ప చౌదరిగారి పెట్టంగడి.

ఎల్లప్పచౌదరి పుణ్యం వలనే మా పేటలో తెలుగు పత్రికల్ని చదివే వాడిక పెరిగిందని పెద్దోళ్లు అంటుంటారు. ఈయనది హోసూరుకు 20 కి.మీ దూరంలోని తిప్పేపల్లి అనే చిన్న పల్లెటూరు. అక్కడనింకా పేటకు వచ్చేసి, అపురూపమైన మహడీని కట్టుకొని ఉంటున్నాడు. ఆరడుగులకు మించిన ఆజానుబాహుడు ఆయన. గోచిపోసి కట్టిన పంచె, పైన జుబ్బా, నడుముకు డవాలు, జుబ్బాపైన అరచేతుల కోటు, వెలుపైన మొకము, విశాలమైన నుదురుమీద విబూది పట్టెలు, కోటేరేసినట్లు ముక్కు...పొద్దునా మాపునా ఆయన దోవ పొడుగునా అందరినీ మాట్లాడిస్తా నవ్వుతా నడచిపోతుంటే తెరాటల్లోని గుమ్మడి వెంకటేశ్వర్రావు మా పేటకు వచ్చేసి తిరుగుతు న్నట్లు అనిపిస్తుంటుంది. ఆబాలగోపాలానికీ తెలుగు పత్రికల రుచిని చూపించిన మహన్నుబావుడు మా ఎల్లప్ప చౌదరి.

తలలో నాలుక అనంతయ్యవారు :

కేవలం సంపాదన కోసమే కాకుండా తెలుగుసేవ కోసం కూడా అంగడిని నడిపే ఎల్లప్ప చౌదరి మాదిరిగానే ఇంకొకాయన కూడా ఉండారు మా పేటలో. ఆయన పేరు అనంతయ్యవారు. ఎల్లప్ప చౌదరి పెట్టంగడికి పక్కనే ఈయనది పూటకూళ్ల అంగడి. ఎవరైనా అంగటికి పోయి బెంచీమీద కూర్చుంటానే, వాళ్ల ఎదురుగా ఉండే బల్లమీద వంగి రెండు మోచేతులనూ ఆనించి, కళ్లలో కళ్లుపెట్టి చూస్తా "ఏం తింటావు కడుపుకి?" అని గద్దించినట్లు అడుగుతాడు అనంతయ్యవారు. కొత్తవాళ్లయితే తుళ్లిపడి పైకిలేచేస్తారు. ఏలనంటే అది తిట్టుకదా! అపుడు అయ్యవారు చిరునవ్వు నవ్వుతూ "ఏలప్పా లేచేస్తివి, ఇడ్లీనా దోసెనా ఏం తింటావు అని అడిగితిని" అంటే, లేచినవాళ్లు కూడా నిట్టూర్చి నవ్వుతూ కూర్చునేవాళ్లు. తినిసంక రవంత సేపు అక్కడే కూర్చునేవాళ్లకు తన అంగట్లో ఎత్తిపెట్టిండే పత్రికలనో నవలలనో ఇచ్చేవాడు చదువుకొమ్మని. కొన్ని పొత్తాలను అమ్ముతుంటాడు కూడా.

తెరాట కొటాయిల్లో సౌదామిని, అమరగీతం, సారంగధర, చింతామణి, పెళ్లినాటి ప్రమాణాలు వంటి తెరాటలు నడుస్తుంటాయి. ఇదే కాదు ఇంకా ఎన్నెన్నో తెరాటలు. వీటని చూసేకి పల్లెలనింకా ఎద్దుల బండ్లు కట్టుకొని జనం వస్తుంటారు. మొదటి ఆట చూసినాక వెంటనే రెండో ఆటకు పోయి, దానిని కూడా చూసినంకనే, ఏ నడిరేయిలోనో ఊర్లకు బయలుదేరుతారు.

అనంతయ్యవారు సెనగల్నో పెసల్నో అలసందల్నో సుండలు (గుగ్గిళ్లు) చేసి, కొటాయిల దగ్గర దినానికి రెండు మూడు మణుగులు (20 లేదా 30 కిలోలు) అమ్మేస్తుంటాడు. తెరాటల్లో నడుమ నడుమ అరగంటకొకసారి 'రీళ్లు' అని విరామం ఉంటుంది. అప్పుడు ఈ సుండలు కొనుక్కొనేవాళ్లు. ఆటలో ఐదారు రీళ్లన్నా ఉంటాయి. అనంతయ్య వారు సుండల బేరంతోపాటు ఇంకొక మేలును కూడా చేస్తుంటాడు. కొటాయిల బయళ్లలో ఉండే బండ్లకూ ఎద్దులకూ కావలికాస్తా ఉంటాడు. అయ్యవారు ఎవరికీ బెదరడు, రౌడీలకు కూడా ఆయనంటే అదలు. ఒక అణా ఇస్తే, రెండు పిడికిళ్ల సుండలు ఇస్తాడు. అయ్యవారి చెయ్యి పెద్దది. ఆ సుండలుతోనే ఆకలి తీరిపోతుంది. కాసులిచ్చి కొనుక్కోలేని చిన్నోళ్లు ఎవరైనా ఆయన



కంటపడితే, తినండ్రా అంటా గుప్పెడు పంచేస్తాడు.

సతీ అనసూయ వంటి తెరాటలు వచ్చినపుడు కొటాయిల మీద అంటీ ఆరే దీపాలను (సీరియల్ సెట్స్) పెడతారు. ఆడవాళ్లకు వాటిని చూపిస్తా "చూడండమ్మా, ఆ అనసూయమ్మలో సత్యం లేకపోతే దీపాలు వాటంతట అవే అంటి, అవే ఆరుతాయా, చూడండమ్మా ఆ తల్లి సత్యాన్ని" అని తెరాటకు ప్రచారం చేస్తాడు. జనాలంతా అనసూయమ్మ పేరుతో అంజిలీదేవికి భక్తులయిపోతుంటారు. అంజిలీదేవి అంటే మా పల్లెల్లో సాక్షాత్తూ దేవతే.

ఇట్ల చిన్నోళ్లకూ పెద్దోళ్లకూ ఆడోళ్లకూ మగోళ్లకూ అందరికీ తలలోనాలుక మా అనంతయ్యావారు. ఇంతేకాదు, వార పత్రికలలో వచ్చే ధారావాహికలన్నిటినీ కలిపి గట్టి అట్టవేసి కుట్టి పొత్తాలుగా చేసి, చదువుకోడానికి ఇస్తుంటాడు. అనెంక అనెంక అయ్యావారిని చూసి ఎందరో ఈ పనిని చేసుకోసాగిరి. అనంతయ్యావారు కనుమరు గయినా, ఆయన నేర్పిన అట్టపొత్తాల పనితనం మా పల్లెల్నింకా అంటిపెట్టుకొనే ఉంది.

ఉడుకునెత్తురు

మా గురువుగారింట్లో ఆంధ్రోద్యమం గురించి మాట్లాడుకొంటా ఉండే మేస్టర్లు ఇంకొక సారి సమావేశమయిరి.

"మన గతి ఇంతేకద సార్, అరవ పెత్తనం కిందనే ఇంక తరతరాలు బతకాలేమో!"

"ఏం చేసేది! భౌగోళికంగా మన ప్రాంతం ఆంధ్రరాష్ట్రంలోకి చేరడం ఇంక జరగని పని. మద్రాసు రాష్ట్రంలో ఉంటూనే తెలుగును కాపాడుకొనేది ఎట్లనేది యోచన చేయాల"

"దక్షిణ భారతంలోని నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏడాదికొక దగ్గర సమావేశమై భాషా అల్ప సంఖ్యాక వర్గాల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని నిర్ణయం తీసుకొన్నారంట. మనకు కావలసింది ఏముంది, మన తావున బడిలో ఏలుబడిలో తెలుగు ఇట్లనే నడిస్తే చాలు"

"నడవనిస్తారా అనేదే కదా సందేహం. మద్రాసు రాష్ట్రంలో ఈ కాంగ్రెస్ పార్టీయే ఉంటుందని ఏమి నమ్మకం! ప్రాంతీయ పార్టీ అయిన డిఎంకె బలపడతా ఉంది. ఆ అన్నాదొర ఉపన్యాసాలు వింటుంటే వెన్నులో వణుకు పుడతావుంది. వడుగన్ నమ్మవనల్ల నల్లవనల్ల అనే నినాదాన్ని ఎత్తుకోనుండాడు. అంటే ఉత్తరాదివాడు మనవాడు కాదు మంచివాడు కాదు అని కదా. ఉత్తరాదివాడు అంటే హిందీవాడు అని అందరూ ఏమారిపోతుండారు. ఆంధ్రోద్యమం చేసినందుకు తెలుగువాళ్లమీద కసినిపెంచుకోనుండారు అరవ నాయ కులు. ఆ కోపమంతా మనమీద చూపిస్తే మనకు దిక్కెవరు? ఆ ఆంధ్రావాళ్లని నమ్మేకి అవుతుందా?"

"నమ్మేకి సాధ్యం లేదు. మొదట్నింకా ఆంధ్రా మేధావులూ నాయకులూ మనల్ని పట్టించుకోనే లేదు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఆంధ్రరాష్ట్ర చిత్రపటాన్ని తయారించింది ఎప్పుడు, 1930–40 నడుమ అనుకొంటాను. ఇంకా ముందరే ఉండచ్చును కూడా. దాన్లో మన హోసూరు తావును చేర్చనేలేదు. ఆయన గొప్పవాడే మహనీయుడే, కానీ ఒక్క పొరపాటుతో లక్షల గొంతులకు ఉరులు

వేసినాడు కదా. పొట్టి శ్రీరాములుగారు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేయలేదే, మదరాసు నగరం కోసం ప్రాణాలను వదిలేసి నాడు. ఆయన త్యాగానికి కూడా విలువ కట్టకుండా తట్టాబుట్టా సర్దుకొని పారిపోయిరి. పోయేటబుడు ఊరకే పోకుండా మదరాసు లోని అరవ బోర్డుల్నంతా కొట్టి తగలబెట్టి మసిపూసి పొయ్యేసిరి. ఇపుడు ఇక్కడ ఉండిపోయిన లక్షాంతరం తెలుగువాళ్ల గతి ఏమవుతుంది? మన హోసూరువాళ్లం మెదటినింకా ఆంధ్రోద్యమంలో పాలు పంచుకొంటిమి. మనల్ని ఎంత పక్కకు నెట్టేసిరి వాళ్లు! ఆంధ్రరాష్ట్రానికి తలనగరం, కర్నూలా విజయవాడా అని ఓటింగు పెట్టినపుడు, మన ఎం.ఎల్.ఏ. మునిరెడ్డి కూడా ఓటింగులో పాలు గొని కర్నూలుకు ఓటు వేసినాడు. ఆంధ్రేతరుల ఓట్లు చెల్లవని కోస్తా ప్రాంతం నాయకులు గోల చేసేసిరే, మనం ఆంధ్రేతరులమా, అరవం పొడంటేనే గిట్టని మనం తెలుగువాళ్లం కాదా, నట్టేట్లో పుట్టిముంచేసి పోడిసిరి అంటారే అట్ల చేయలేదా వాళ్లు, రేపు మన్నాడు మనం మన తెలుగుకోసం పోరాడినా పట్టించుకొంటారా?"

"ఆ నిజలింగప్ప వెనకాల నడిచి మైసూరు రాష్ట్రంలో చేరిపోయింటేనూ ఈ ఇక్కట్లు లేకపోయుండును. ఆంధ్రనాయకులను నమ్మి మోసపోతిమి".

"నువ్వు అట్లనుకోవద్దు. నిజలింగప్పకు మన హోసూరు తావు మీద రవంత కూడా అక్కరలేదు. ఆయనకు హుబ్లిని తలనగరం చేయలేదని కోపం. పైగా హోసూరు ప్రాంతంలో కన్నడిగులున్నా లింగాయతులు చానా తక్కువ. లింగాయతులు ఎక్కువగా ఉండే తాళవాడి ఫిర్కా (కోయంబత్తూరు జిల్లా) కోసం కొట్లాడిన దాంట్లో పదిశాతం కూడా మన హోసూరుకోసం గొంతెత్తలేదు ఆ మహన్న బావుడు".

"నిజలింగప్ప కతను పక్కనపెట్టండి. మైసూరు స్టేట్‌కు బెంగుళూరును తలనగరం చేసిరి – మనం అట్ల చేరిపోయుంటే ఎంత అందుబాటు, ఇరవై ఐదు మైళ్ల దూరంలో తలనగరం, ఒకపూట సంగటి తినేసి నడిసిపోతే కూడా రెండోపూట సంగటిపొద్దుకు చేరిపోవచ్చు.

"రాజధాని నగరం మాత్రమే చూసుకొంటే సరిపోతుందా? కన్యాకుమారి నింకా కేరళ రాజధాని త్రివేంద్రం రెండుగంటల పయనం. చెన్నపట్నం ఐదువందల మైళ్లు. అయినా కన్యాకుమారి తమిళులు పోరాడి మద్రాసు రాష్ట్రంలోకి ఎందుకు చేరిరి? బీదరుకు హైదరాబాదు 60 మైళ్లు. బెంగుళూరు ఐదువందల మైళ్లు. ఫజలాలీ కమిటీ బీదరు జిల్లాను ఆంధ్రాలో కలపమనే సిఫార్సు చేసింది. బీదరులో కన్నడ సంగాలు గగ్గోలు పెట్టలేదా? రాజధానితో సామాన్య మానవుడికి పొద్దుకూ ఏం పని ఉంటుంది? **భాషా రాష్ట్రాలు అనేవి ఎందుకు ఉండాలనుకొంటిమి? చదువూ ఉద్యోగమూ పరిపాలనా అంతా జనం భాషలో, జనానికందరికీ తెలిసే భాషలో ఉండాలని కదా.** ఇపుడు మద్రాసు రాష్ట్రంలో ఉండిపోతే తెలుగువాళ్లమైన మనం దరం తమిళపాలనకు సర్దుకోలేమనే కదా మన ఆందోళనంతా. మైసూరు రాష్ట్రంలో చేరింటే తమిళం బదులుగా కన్నడం పాలనాభాష అయింటుంది. దానివలన మనకు జరిగే మేలు ఏముంటుంది?"

"సరే విడవండి. ఏది ఏమైనా అరవ పెత్తనానికి హోసూరు జనం లొంగుతారనేది అబద్ధం. పెత్తనం చేయాలని చూస్తే తిరగబడి తీరుతారు".

"సొంతభాషమీదా సొంత నేలమీదా జనంలో ఎప్పుడూ అభిమానం ఉండనే ఉంటుంది. వాటికి ప్రమాదం వచ్చినపుడు తిరగబడే తత్వమూ ఉంటుంది. అయితే జనాన్నంతా ఒక్కటి చేయగలిగిన వాడొకడు ఉండాలి. అతను నాయకుడు కావచ్చు, యోజకుడు కావచ్చు, కార్యకర్త కావచ్చు, జనంలోనింకా ఆ ఒక్కడూ తయారై నిలబడితే ఇంక జనం అడుగులు నిలబడవు తడబడవు" మా గురువుగారి మాటలతో సమావేశం ముగిసింది.

నూనూగు మీసాల వయసునాది. అసలే ఉడుకునెత్తురు. ఇంకా కుతకుత ఉడికింది (77 ఏడేళ్ల వయసునాదిప్పుడు ఇంకా ఆ ఉడుకు చల్లారనే లేదు).

(39 వ పుట తరువాయి)

అందువల్ల చాలా బాధపడ్డాను. నాకు తెలిసిన, నా చుట్టుపక్కల ఉన్న జనం, నేను నమ్మిన ప్రజలే అవమానం చేశారు. ఇక వేరే ఊరివాళ్ళు అవమానించకుండా ఉంటారా? అని అనిపించింది.

ఈ సంఘటన జరిగిన రెండు రోజులు నేను ఇంటినుంచి బయటికి రానేలేదు. ఊరివాళ్ళతో మాట్లాడటానికి కూడా అవమానంగా అనిపించింది. భయం వేయసాగింది. ఎవరైనా ఏమైనా అంటారేమోననే భయం వెంటాడుతుండేది. ఆ సంఘటన జరిగిన రెండేళ్ళు ఊళ్ళోని ఏ కార్యక్రమాలకు వెళ్ళలేదు.

'ఎవరైనా నువ్వు మగజోగమ్మవి, కార్యక్రమంలో పాల్గొనకు' అని అంటారేమోననే భయం వేధించేది.

అందుకే ఏ కార్యక్రమానికి వెళ్ళలేదు.

నాలో ఉన్న అలాంటి భయాన్ని దూరం చేసినవారు మరియమ్మనహళ్ళికి చెందిన శ్రీమతి నాగరత్నమ్మగారు, ఆమె బృందం.

మా ఊరిలో జరిగిన అవమానాన్ని మరిచిపోయేలా చేశారు.

పోగొట్టుకున్న సంతోషాన్ని, అవకాశాన్ని నాకు ఇచ్చారామె.

ఎవరైతే నాటకంలో వేయకూడదని అన్నారో, వాళ్ళ చేతనే చప్పట్లు కొట్టించారు.

పోగొట్టుకున్న చోటే నాకు గౌరవమర్యాదలు లభించాయి.

ఇది జోగమ్మలకు దొరికిన గౌరవం అనుకున్నాను.

ఇప్పుడు సమాజం మారింది.


మమ్మల్ని కూడా బాగా పలకరిస్తున్నారు.

స్త్రీ కళాకారులు మమ్మల్ని చేర్చుకుని నాటకాలు ప్రదర్శిస్తుండటం దీనికి సాక్ష్యం !

(తరువాయి వచ్చే సంచికలో....)

పుస్తక సమీక్ష

యుగపురుషుడు వీరేశలింగం



తాజాకూర్పు, ఉపోద్ఘాతం:
తెలకపల్లి రవి
పుటలు : 336, వెల : రు. 270/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్
గవర్నరుపేట
విజయవాడ - 2
సెల్ : 0866-2577533

కందుకూరి వీరేశలింగం (1848-1919) ఒక గొప్పవ్యక్తి. ఏకైక వ్యక్తి కాదు, అనేకానేక విషయాల సమష్టి. 'ప్రబుద్ధ భారత యుగకర్త, ఆంధ్ర వైజ్ఞానిక సంస్కరణోద్యమములకు మూలపురుషుడు, ఆధునికాంధ్ర వాఙ్మయమునకు అధిష్ఠాత, సాంఘిక స్వాతంత్ర్య పిపాసి, స్త్రీ జనోద్ధారకుడు' ఆరుద్ర చెప్పినట్టు. అటువంటి ఉజ్జ్వల చారిత్రకుని ఏ బిరుదుతో వర్ణించినా అది అసమగ్రమే!

గత సం॥ కందుకూరి శతవర్ధంత్యుత్సవాలు జరుపబడిన సందర్భంలో రెండు పుస్తకాలు ఆవిష్కరింపబడ్డాయి. ఒకటి - చెన్నపురి తెలుగువాణి, డా॥ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో వెలువడిన సంకలనంలో కందుకూరి సాహితీతత్త్వం, కందుకూరి సామాజికతత్త్వం పేరున 32 వ్యాసాలతో నివాళి అర్పంపబడింది. రెండవది - తెలకపల్లి రవి ముందుమాటతో ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ, 'యుగ పురుషుడు వీరేశలింగం' పేరున అందించిన అరుదైన ప్రచురణ. అయితే ఈ పుస్తకం 1963 వ సం॥లో, కందుకూరి 115వ జయంతి సందర్భంగా మొదటి ప్రచురణగా వెలువడింది. ఇప్పుడు ఆ పుస్తకం యథాతథంగా, కందుకూరి శతవర్ధంతి సందర్భంగా పునర్ముద్రింపబడింది. అదనంగా ఉన్నవి రెండు తెలకపల్లి రవి 'ముందుమాట', రెండవది ఆంధ్రపత్రిక లో నాడు ప్రచురితమైన వీరేశలింగం మరణవార్త గురించిన కథనాలు.

పరిశోధకులూ, పండితులూ కూడా కందుకూరి బహుముఖ సేవలపైనా, రచనలపైనా, ప్రజ్ఞాపాటవాలపైనా, జీవిత సాహిత్యాలపైనా విశేష అధ్యయనం చేస్తూనే వచ్చారు. ఈ పునర్ముద్రిత పుస్తకంలో, కందుకూరి జీవితం, సంఘసేవ, భాషా సేవ, రచనలు, స్త్రీ జనోద్యమం, స్థాపించిన సంఘాలు, నిర్వహించిన పత్రికలు - యిలా అన్ని విషయాలపై సమగ్రమైన వివరాలను తెలియచేసే వ్యాసాలు (37), కవితలు (15) ఉన్నాయి. 'యుగపురుషుడు' (నార్ల), 'సర్వతోముఖ సంఘ సంస్కర్త' (మామిడిపూడి), 'నాటకములు' (ఖండవల్లి), 'ఉపన్యాసములు' (ఎస్వీ జోగారావు), 'కవి చరిత్ర పరిశోధన' (మల్లంపల్లి సోమశేఖరశర్మ), 'ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మ' (కనుపర్తి వరలక్ష్మమ్మ), మొ॥ ప్రముఖుల వ్యాసాలు; కవితల విషయానికి వస్తే, రాయప్రోలు వారి 'మూల పురుషుడు', విశ్వనాథ వారి 'వీరేశలింగ స్మృతి', కాళోజీ 'కర్మయోగి కందుకూరి', దాశరథి 'నీరాజనము', సి.నా.రె. 'మణిదీపం', ఆరుద్ర 'యుగపురుషుడు', మధునాపంతుల 'వీరేశలింగోదాహరణము' వంటి ప్రముఖ కవులు వ్రాసిన కవితలున్నాయి. ఇంకా ప్రధానంగా చెప్పవలసినది, కందుకూరి పై విశేష అధ్యయనం చేసిన అక్కిరాజు రమాపతి రావుగారి రెండు వ్యాసాలు - 'పంతులు గారి గ్రంథ రచనా, ముద్రణములు, వివరములు', రెండవది, 'కందుకూరి జీవితము నందలి కొన్ని ముఖ్య ఘట్టాలు' ఉన్నాయి.

ఒక్కొక్క రంగంలో కందుకూరి ముద్ర ఏమిటో, దోహదమేమిటో తెలుసుకొనటానికి, సాహిత్యరంగంలో దిగ్దంతులు అయినవారు వ్రాసిన అధ్యయనాల సంపుటి అని దీనిని పేర్కొనవచ్చు, ఆ విధంగా వీరేశలింగం ప్రభావం చూపిన, ప్రేరణ యిచ్చిన అన్ని రంగాల గురించిన సమగ్ర విషయ సంపుటి ఈ పుస్తకం. మన సాహిత్యంలో చరిత్రకు ప్రాధాన్యమిస్తూ 'ఆంధ్ర కవుల చరిత్ర' ను అందించిన క్రాంతదర్శి, కందుకూరి చరిత్రను యీ పుస్తకం ద్వారా అందించే ప్రయత్నం మొదటిసారి 1963లో జరిగి, యిప్పుడు పునరావృతమై మళ్లీ 60 సం॥లకు పునర్ముద్రణగా మనముందుకు వచ్చింది. మనమంతా, ముఖ్యంగా స్త్రీలంతా, కందుకూరికి శాశ్వతంగా కృతజ్ఞులంగా ఉంటూ, వారి మహత్తర సేవను స్మరించుకోవటానికి; కందుకూరి ప్రబోధించిన భావాలను మననం చేసుకొనటానికీ, ఈ పుస్తకం తోడ్పడుతుంది.

- ఎం.వి.శాస్త్రి
9441342999

మాతృత్వపు మధురిమల మల్లెలపందిరి



'తల్లీ! నిన్ను తలంచి'
(కన్నబిడ్డల గుండె చప్పుడు)
పుటలు : 257, వెల : అమూల్యం
ప్రతులకు : 102,
గగన మహల్ అపార్ట్‌మెంట్స్, దోమల్‌గూడ
హైదరాబాదు, ఫోను : 040 - 27636172

'మాతృదేవోభవ' అని ఉపనిషత్తులు తల్లిని తొలిదైవంగా లోకానికి చాటి చెప్పాయి. "నాస్తి మాతృ సమో ఛాయా / నాస్తి మాతృ సమాగతిః" అని స్కంధ పురాణం పేర్కొంటుంది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని శ్రీమద్రామాయణం నిరూపించింది. సకల చరాచర సృష్టికి మాతృ స్వరూపిణి జగన్మాత సంకల్పమే ఆదిమూలం.

భూమిపై పుట్టిన ప్రతిప్రాణికి అమ్మ అమృతం. అమ్మ ఒక అద్భుతం. సమాజంలోని సమస్త రంగాలలో ఉన్నత సోపానాలను అధిరోహించిన వ్యక్తుల విజయపరంపరలకు తొలి సోపానం తల్లి. వ్యక్తిని శక్తిగా తీర్చిదిద్దగల మాతృమూర్తి ఔన్నత్యాన్ని, పలు కోణాలలో నిరూపించిన ప్రత్యేక రచన ప్రముఖ కవయిత్రి 'కళారత్న, సాహితీ బాంధవి' డాక్టర్ చిల్లర భవానీదేవి గారు ఏర్చి కూర్చిన 'తల్లీ! నిన్ను

తలంచి'. 'కన్నబిడ్డల గుండె చప్పుడు' అనే ఉపశీర్షికతో గ్రంథం లోపలికి తొంగి చూడాలనే ఉత్సుకతను కలిగిస్తున్న గ్రంథం.

మన సమాజంలో వివిధ రంగాలలో పేరు ప్రఖ్యాతులు సాధించిన రచయితలు, కళాకారులు, వైద్య, విద్యా, పారిశ్రామిక తదితర రంగాలలో నిష్ణాతులై శిఖరాయమానంగా ఎదిగిన మహనీయులు ఎందరో ఉన్నారు. వారి అభివృద్ధిని, విజయాలను వివరించే పలు కార్యక్రమాలు వివిధ పత్రికలలో, ఛానళ్ళలో వెలువడ్డాయి. ఆ క్రమంలో 'నది' మాస పత్రికలో డా॥ భవానీదేవిగారు 'తల్లీ! నిన్ను తలంచి" శీర్షికను ప్రముఖ వ్యక్తుల విజయాలకు ప్రేరణనందించిన వారివారి మాతృమూర్తుల ఔన్నత్యాన్ని, త్యాగాలను వివరిస్తూ ముఖాముఖి రూపంలో దాదాపు నాలుగున్నర సంవత్సరాల పాటు ధారావాహికగా నిర్వహించారు. వినూత్నంగా సాగిన ఆ శీర్షికలో భవానీదేవి గారు పాఠకులకు పరిచయం చేసిన 53 మంది ప్రముఖుల జీవితాలలో వారి మాతృమూర్తి కలిగించిన ప్రేరణను ఈ గ్రంథ రూపంగా అందించటం ముదావహం.

పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి మొదలుకొని రచయిత్రి తనకు, తన మాతృమూర్తితో కల అనుబంధాన్ని వెలువరించినంత వరకు వివిధ రంగాల ప్రముఖుల అంతరంగాలు ఈ పుటలలో ప్రతిఫలించాయి. వారివారి తల్లుల ప్రేరణను గురించి ఆవిష్కరించిన తావులలో వారి ఛాయాచిత్రాలతో పాటు వారి తల్లుల ఛాయా చిత్రాలను కూడ పొందు పరచటం ఈ గ్రంథానికి వన్నె తెచ్చింది. శీర్షిక ఉపోద్ఘాతంలో తల్లి ఔన్నత్యాన్ని, వైశిష్ట్యాన్ని వెల్లడించే వేదోపనిషద్వాక్యాలను, సంస్కృతాంధ్ర ప్రాచీనార్వాచీన కవుల పద్య రాజాలను, వచన కవితలను ఉట్టంకించిన తీరు కవయిత్రి సాహిత్యాభినివేశాన్ని తేటతెల్లం చేస్తుంది.

మహాభక్తురాలు బెజ్జమహాదేవి పరమశివుడిని బిడ్డగా భావించుకొని, తల్లిలేని శివునికి తానే తల్లియై పరిచర్యలు చేసింది.

"తల్లిగల్గిన నేల తపసిగానిచ్చు / తల్లి గల్గిన నేత తలజడల్గట్టు" అని బాధపడిన వైనాన్ని వర్ణించిన పాల్కురికి సోమనాథుడి నుండి "పాత చీరల్ని కాలం దారంతో కుట్టిన / బొంత మీద పడుకున్నప్పుడు అమ్మ అరచేతుల్లో పడుకున్నంత ఆనందం / అమ్మ చేతి చిత్ర వర్ణం బొంత" అంటూ తన ఆవేదనను అక్షరీకరించిన శ్రీ ధేనువకొండ శ్రీరామమూర్తిగారి 'అమ్మఒడి' దీర్ఘ కవితలోని పంక్తుల వరకు భవానీదేవిగారు అమ్మపై కవులు వెలువరించిన అభిప్రాయాలను చక్కగా అలంకరించారు. ఈ వినూత్నమైన విధానం రచనకు కావ్యత్వ శోభను కలిగించిందని పేర్కొనవచ్చు.

భావానీదేవిగారు స్వయంగా తమ తల్లిపట్ల అపారమైన మమతానురాగాలను నింపుకున్న స్త్రీ మూర్తి కనుక ఈ గ్రంథం ఆద్యంతమూ ఒక ఆర్ద్రత అనే అంతస్సూత్రంతో సాగింది. సాహిత్య లోకంలో ఈవిధమైన రచనలకు నాందిగా పేర్కొనదగిన ఈ గ్రంథాన్ని తమ మాతృమూర్తికే అంకితం కావించటం సమంజసం, సార్థకం. దీనిలోని ప్రతి అక్షరం శిలాక్షరమై, సుదీర్ఘమైన అస్తిత్వాన్ని పొందుతుంది. చదివిన ప్రతి ఒక్కరికీ వారి అంతరంగంలో ఆక్రమించిన అమ్మ జ్ఞాపకాలను ఉద్దీప్తం చేస్తుంది. మాతృమూర్తి పట్ల తమ ఆరాధనా భావాన్ని వెలువరించిన ఒక్కొక్కరి గాథ మనస్సు లోగిళ్లను తెరిచి దివ్యమైన వెలుగులను నింపగలదు. "తల్లి పాదాల దగ్గర స్వర్గం ఉంటుంది" అనే ఖురాన్ సూక్తిని స్ఫురణకు తెచ్చిన డా.భవానీ దేవిగారి కృషి బహుధా ప్రశంసనీయం. వారికి హృదయపూర్వక శుభాభినందనలు.

– డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి
9394113848

తెలుగు యువశాస్త్రవేత్త అభిలాష్‌ను కాపాడుకోలేకపోయాం!

అభిలాష్ రంగారెడ్డి జిల్లా కోల్‌కుందే అనే పల్లెటూరులో పుట్టాడు. ఆర్థికస్తోమత లేని కుటుంబం వారిది. చదువులో చాలా చురుకైనవాడు. పల్లెటూరులో చదువుతున్నప్పుడే పంతుళ్ల ప్రశంసలు పొందాడు. తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి తరగతిలోను ప్రథమశ్రేణిలో ప్రథముడుగా నిలిచాడు. ఇంటర్‌లో చదువుతున్నప్పుడే గణితంలో పన్నెండు (12) కొత్త సూత్రాలను కనిపెట్టాడు. సునాయాసంగా ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించుకో గలిగాడు. ఇంజనీరింగ్‌లో చదివే సమయంలోనే ఎక్కువ సమయం ప్రయోగశాలలో గడిపేవాడు. చదువు పూర్తవగానే ఆవిష్కరణలకు పూనుకున్నాడు. కొత్త రేసుకారు, మూడు రకాల విమానాల కొత్త నమూనాలను, ఎగిరే పళ్లెము, ఆర్నటాప్పర్ గ్లాడరు మొదలగువాటిని ఆవిష్కరించాడు. తన కొత్త ఆవిష్కరణలను బెంగుళూరు, చెన్నై, ముంబయి, రాజధాని ఢిల్లీ, కోల్‌కతా, గుహావటి నగరాలలో ప్రదర్శించాడు.

తెలుగువారి దురదృష్టం. 2010 ఫిబ్రవరిలోరోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో కోమాలోకి వెళ్లాడు. తల్లిదండ్రులకు తగిన చికిత్స చేయించే స్తోమత లేదు. దాతల దానంతో వైద్యులు శక్తివంచన లేకుండ శ్రమించి వైద్య సేవలందించారు. దాతలిచ్చిన ధనం అయిపోయింది. చికిత్సకు డబ్బులేదు. విధిలేక తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. మన సర్కారు వారి దృష్టిలో నిరుపేద శాస్త్రవేత్త పడలేదు. వారికి కనపడలేదు. వినిపించలేదు. అదే ఏ రాజకీయ నేత అయితే అమెరికాలాంటి దేశాలకు పంపి వైద్యం చేయించేవారు. కాని ప్రభుత్వం పూనుకుని యువ శాస్త్రవేత్త అభిలాష్‌ను కాపాడుకోలేక పోయింది. పది మాసాలు మృత్యువుతో అలుపెరుగని పోరాటంచేసి 2010 డిసెంబర్‌లో తిరిగిరాని లోకానికి వెళ్లిపోయాడు అభిలాష్. ప్రభుత్వం సిగ్గు పడవలసిన విషయం. ప్రజల తరపున మనం క్షమాపణ చెప్పుకుందాము.

వేములపల్లి సత్యవతి

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

2019 డిసెంబరు 27,28,29 తేదీలలో విజయవాడలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు



ప్రారంభ సభలో అధ్యక్షోపన్యాసం చేస్తున్న డా॥ మండలి బుద్ధప్రసాద్




ప్రారంభ సభ దృశ్యం



జ్ఞానపీఠ పురస్కార గ్రహీత
డా॥చంద్రశేఖర కంబార



కేంద్ర సాహిత్య అకాడెమీ కార్యదర్శి
డా॥ కె.శ్రీనివాసరావు



తెలుగు విమర్శకులు
ఆచార్య వెల్చేరు నారాయణరావు

తీర్మానాలు : 1. భాష, బంధాలు బలపడాలి : తెలుగువారంతా తమ జాతీయతను నిలబెట్టుకునేందుకు స్వభాషాభిమానం, స్వజాతీయాభిమానం, స్వాభిమానం కాపాడుకోవాలి. మానవ సంబంధాలు, కుటుంబ బంధాలు బలపరిచేందుకు దోహదపడే విద్యను ప్రాథమిక స్థాయి నుంచే అందించాలి. మాతృభాషను కాపాడుకుందాం.. స్వాభిమానం చాటుకుందాం'అనే నినాదంతో బోధనా విధానం రూపొందాలి. **2. రచయితలకు విజ్ఞప్తి :** తెలుగుదనానికి, తెలుగు భాష మనుగడకు ఎప్పుడు, ఎక్కడ ప్రమాదం వాటిల్లినా రచయితలు స్పందించాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందర్నీ ఏకం చేయాలి. **3. భాషపై అవగాహన పెంచాలి ! :** మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు యువతలో తెలుగు భాషపై అవగాహన కల్పించాలి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నివసించే వారికి ఆధునిక సాంకేతిక ఉపకరణాల ద్వారా తెలుగు నేర్పించేందుకు బోధన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇందుకు ప్రభుత్వాలు సహకరించాలి.... **4. ఆదరణ పెరిగేలా :** భాషకు ఆదరణ లభించే విధంగా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లో ఆంధ్రప్రదేశ్ వెలుపల నివసించే తెలుగువారికి సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలంటూ దేశంలోని విశ్వవిద్యాలయాలకు, ప్రభుత్వాలకు విజ్ఞప్తి **5. ఆర్థిక సహకారం :** తెలుగు పుస్తకాల రచన, ప్రచురణ, పంపిణీకి ఆర్థిక తోడ్పాటు అందించాలంటూ సేవా సంస్థలు, ప్రముఖులకు వినతి. **6. ఆధునికత అందిపుచ్చుకునేలా :** ఆధునిక, సాంకేతిక అంశాలకు అనుకూలంగా ఉండేలా తెలుగు భాషను ఆధునీకీకరించే కృషి వేగవంతం కావాలి. **7. అవాంతరాలు తొలగించాలి. :** న్యాయ, పాలనా వ్యవస్థల్లో తెలుగు అమలుకు అవరోధంగా ఉన్న సాంకేతిక పదాల అనువాదంలో ఆయా రంగాల నిపుణులు సహకరించాలి. **8. ప్రాంతీయ పదాలకు ప్రాధాన్యం !! :** బోధనాంశాల్లో తెలుగు భాషా సంస్కృతి, నైతిక విలువలు, వ్యక్తిత్వవికాసం లాంటి అంశాలు ఉండాలి. ప్రాంతీయ పదాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. **9. కానుకలుగా గ్రంథాలు** : బహుమతులు, కానుకలు, జ్ఞాపికలుగా అందిం చేందుకు ఉత్తమ తెలుగు సాహిత్య గ్రంథాలను వినియోగించాలి. **10. విస్తృత ప్రచారం :** తెలుగు భాషకు విస్తృత ప్రచారం కోసం ఊరూరా సభలు నిర్వహించాలి. తెలుగు వేదికలు ఏర్పాటు చేయాలి. రచయితలు ప్రజల మనసులను హత్తుకునే రచనలు చేయాలి.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
February 2020 Vol :5, Issue 12
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20